www.truepointnews.com
ESTD 2024
PointNewsDaily
pointnewsdaily
ARN No: T/TG/2024/1040
Vol.I ISSUE 273
*Air Surcharge Extra Applicable

# పాయింట్

**Published From :** Vijaywada - Hyderabad - Delhi - Bengaluru

గురువారం 10, జూలై, 2025 | పేజీలు :12



# పోలీసులపై మరోసారి జగన్ ఫైర్

**చిత్తూరు:**

పోలీసులు తీరుపై ఫైర్ అయ్యారు వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్. "ఎల్లకాలం ఇదే ప్రభుత్వం అధికారంలో ఉండదు. రేపు రాబోయేది జగన్ ప్రభుత్వం. ఈ విషయం గుర్తుంచుకోండి" అంటూ హెచ్చరికలు జారీ చేశారు. గిట్టుబాటు ధర లేక నష్టపోతున్న మామిడి రైతులను పరామర్శించేందుకు బుధవారం ఆయన చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మార్కెట్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా రైతుల పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు."రైతుల తలలు పగలగొడతారా? 1,200 మందిని జైళ్లలో పెడతారా? అసలు రాష్ట్రంలో ఉంది పోలీసులా? రాక్షసులా?" అంటూ జగన్ తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. రైతులను రౌడీ షీటర్లలా పరిగణిస్తూ దురుసుగా ప్రవర్తించడం సరికాదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ ప్రలోభాలకు, ఇచ్చే లంచాలకు లొంగవద్దని పోలీసులకు హితవు పలికారు."రేపు ఇదే చంద్రబాబు మిమ్మల్ని కూడా మోసం చేయొచ్చు. అప్పుడు మీ తరఫున పోరాటం చేయాల్సి వచ్చేది కూడా నేనే" అని జగన్ అన్నారు. కనీస మద్దతు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న మామిడి రైతుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, వారి పక్షాన నిలబడతానని భరోసా ఇచ్చారు. జగన్ పర్యటనతో బంగారుపాళ్యంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

**జగన్ పర్యటనలో ఒకరికి తీవ్ర గాయాలు**

చిత్తూరు జిల్లా బంగారుపాళ్యంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ పర్యటన తీవ్ర ఉద్రిక్తతకు, గందరగోళానికి దారితీసింది. వైసీపీ శ్రేణులు నిబంధనలను బేఖాతరు చేస్తూ భారీగా తరలిరావడంతో పలుచోట్ల తోపులాట జరిగింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చింది. జగన్ పర్యటన సందర్భంగా రోడ్ షోకు ఎలాంటి అనుమతులు లేనప్పటికీ, వైసీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. షరతులను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఎస్పీ మణికంఠ ముందే హెచ్చరించినా వారు లెక్కచేయలేదు. బెంగళూరు నుంచి అరగొండ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు జగన్ చేరుకోగానే గందరగోళం మొదలైంది. అక్కడ కేవలం 30 మందికే అనుమతి ఉండగా, వందలాది మంది ఒక్కసారిగా దూసుకురావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ నేత విజయానంద రెడ్డి కాన్వాయ్ వాహనం పైనుంచి జారిపడ్డారు. అతనిని వెంటనే జగన్ కాన్వాయ్‌లోకి ఎక్కించారు. అనంతరం చికిత్స కోసం ఆస్పత్రికి పంపారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో జగన్‌తో సమావేశమయ్యేందుకు 500 మందికి పోలీసులు అనుమతించారు. కానీ, జగన్ రాకముందే వేలాదిగా కార్యకర్తలు యార్డులోకి చొచ్చుకెళ్లడంతో అక్కడ కూడా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బంగారుపాళ్యంలో రైతులతో మాట్లాడకుండానే మాజీ సీఎం జగన్ పర్యటన ముగిసింది. మామిడి కాయలు లేని మండీ వద్దే ఆయన ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఆ తర్వాత జగన్ వెళ్లిపోయారు.



# మంత్రులకు ఇదే లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్ సీఎం

- మంత్రుల పనితీరుపై సీఎం చంద్రబాబు తీవ్ర అసంతృప్తి
- విపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టడంలో ఫెయిల్ అయ్యారంటూ ఫైర్ ఆదేశం
- పనితీరు బాగోకపోతే కొత్తవారికి అవకాశం ఇస్తానని స్పష్టీకరణ

**అమరావతి:**

మంత్రులు పనితీరుపై ఏపీ సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే పదవులు ఉండవంటూ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టడంలో విఫలమైతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. అమరావతిలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆయన మంత్రుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత రాజకీయాలు కేవలం సబ్జెక్టు ఆధారంగా కాకుండా, ప్రచారాలపైనే ఎక్కువగా నడుస్తున్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో మంత్రులు అన్ని విషయాలపై సకాలంలో స్పందించాలని గట్టిగా సూచించారు. "విపక్షాల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడే తిప్పికొట్టకపోతే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. మీరు సరిగా స్పందించకపోతే మీ స్థానంలో కొత్త వాళ్లు వస్తారు. ఇక మంత్రులు రోజులు లెక్క పెట్టుకోవాల్సి వస్తుంది" అని ఆయన హెచ్చరించారు. వైసీపీ నాయకులు మహిళల పట్ల కూడా అసభ్యంగా మాట్లాడుతుంటే.. వారి నిజ స్వరూపాన్ని ప్రజల ముందు ఉంచాల్సిన బాధ్యత మంత్రులపై ఉందని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వానికి నష్టం కలిగించే ఏ చిన్న విషయాన్ని కూడా ఉపేక్షించవద్దని, ప్రజాక్షేత్రంలో వాస్తవాలను బలంగా వినిపించాలని ఆయన ఆదేశించారు. ఇకపై చెప్పినట్లు నడుచుకోకపోయినా.. పనితీరులో మార్పు రాకపోయినా.. ఇదే లాస్ట్ అండ్ ఫైనల్ వార్నింగ్ అంటూ హెచ్చరించారు.



## వైసీపీ కుట్రలపై విచారణ చంద్రబాబు

- పెట్టుబడులు రాకుండా వైసీపీ అడ్డుకుంటోందని మంత్రి వెల్లడి
- సీఎంకు ఆధారాలు చూపిన మంత్రి పయ్యావుల
- ఈ మెయిల్స్ పెట్టిన అంశంపై విచారణకు ఆదేశిస్తాం

03



## నేడు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0

- ఒకేరోజు 2.28 కోట్ల మంది భాగస్వామ్యంతో రికార్డుకు సన్నాహాలు
- పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం
- తల్లిదండ్రుల నుంచి పాఠశాలల పనితీరుపై అభిప్రాయాల స్వీకరణ

03



## బ్యాటరీతో నడిచే సైకిల్ పవన్ సవారీ

- విజయనగరం జిల్లాకు చెందిన విద్యార్థిని అభినందించిన పవన్
- భవిష్యత్తులో సరికొత్త ఆలోచనల దిశగా అడుగులు వేయాలని ఆకాంక్ష

**మంగళగిరి :**

విజయనగరం జిల్లాకు చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థి రాజాపు సిద్ధూ అతి తక్కువ ఖర్చుతో బ్యాటరీతో నడిచే సైకిల్‌ను తయారు చేశాడు. ఈ వినూత్న ప్రయోగాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ పరిశీలించి అభినందించారు. సోషల్ మీడియాలో సిద్ధూ ఆవిష్కరణ గురించి తెలుసుకున్న పవన్ కళ్యాణ్ అతన్ని మంగళగిరిలోని క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సిద్ధూ రూపొందించిన సైకిల్‌ను స్వయంగా నడిపి తన ఆవిష్కరణలను పరిశీలించారు. అతని ఆలోచనలను మెచ్చుకుని భవిష్యత్తులో సరికొత్త ఆలోచనల దిశగా అడుగులు వేయాలి అని ఆకాంక్షిస్తూ ప్రోత్సాహకంగా లక్ష రూపాయలు అందించారు. అంతేకాకుండా సైకిల్‌పై సిద్ధూని కూర్చోబెట్టి స్వయంగా నడిపారు. విజయనగరం జిల్లా జాడవారి కొత్తవలస గ్రామానికి చెందిన సిద్ధూ, కాలేజీకి వెళ్లేందుకు మూడు గంటలు బ్యాటరీ ఛార్జ్ చేస్తే 80 కిలోమీటర్ల వరకు ప్రయాణించగల సామర్థ్యం గల ఈ ఎలక్ట్రిక్ సైకిల్‌ను స్వయంగా తయారు చేశాడు.

## కుట్రలతో పర్యటనలు.. జగన్‌పై అచ్చెన్న ఫైర్

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు యత్నం
- ఐదారు జిల్లాల నుంచి జనాలను తరలించడం ఎందుకని ప్రశ్న
- పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లు పోశారని విమర్శ



**అమరావతి:**

వైసీపీ అధినేత జగన్ చిత్తూరు పర్యనటపై తీవ్రంగా మండిపడ్డారు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు . జగన్ చేపడుతున్న పర్యటనలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన జగన్‌కు లేదని, కేవలం రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కుట్రలో భాగంగానే యాత్రలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం కేబినెట్ సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, అనగాని సత్యప్రసాద్‌తో కలిసి అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ పర్యటనలు సినిమా సెట్టింగుల్లా ఉన్నాయని అచ్చెన్నాయుడు ఎద్దేవా చేశారు. "పరామర్శకు వెళ్తే రైతులను కలిసి మాట్లాడాలి కానీ, ఐదారు జిల్లాల నుంచి జనాన్ని తరలించడం ఎందుకు? ముందుగా వేసుకున్న పథకం ప్రకారమే రోడ్లపై మామిడి పండ్లను పోయడం ఎందుకని ప్రశ్నించారు. ఇది క్రిమినల్ మైండ్‌తో చేసే పని" అని మండిపడ్డారు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి ఇలాంటి చర్యలతో సమాజానికి ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. తోతాపురి మామిడి రైతుల సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల బంపర్ క్రాప్ రావడం, పల్ప్ పరిశ్రమల వద్ద గతేడాది నిల్వలు ఉండటంతో ధర పడిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో, పరిశ్రమలతో మాట్లాడి కిలో మామిడిని రూ.8కి కొనేలా ఒప్పించామని, ప్రభుత్వం తరఫున కిలోకు రూ.4 చొప్పున సాయం అందిస్తున్నామని వివరించారు. ఇప్పటికే అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొనుగోళ్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులను ఆదుకుంటున్న తర్వాత కూడా జగన్ పర్యటనలు చేయడం వెనుక దురుద్దేశం ఉందని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేయాలన్నదే ఆయన లక్ష్యంగా కనిపిస్తోందని విమర్శించారు.



## లెనిన్ సెంటర్ పేరు మార్చాలి ఏపీ బీజేపీ అధ్యక్షుడు

- ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ
- అభినందనలు తెలిపిన పార్టీ నేతలు

**విజయవాడ:**

ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఎంపీ పురందేశ్వరి, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, మిగతా 4వ పేజీలో..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు



- హడ్కో రుణాలకు గ్యారంటీ
- నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కుకు ఆమోదముద్ర
- అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం

**అమరావతి:**

సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ జరిగింది. మంత్రిమండలి పలు నిర్ణయాలు తీసుకుంది. అమరావతిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు భూములు కేటాయిస్తూ సీఆర్డీఏ అథారిటీ చేసిన తీర్మానాలకు ఆమోద ముద్ర వేసింది. ప్రజాప్రతినిధులు, అధికారుల భవనాలు పూర్తి చేసేందుకు రూ.524 కోట్లు మంజూరు చేసింది. రాజధానిలో రెండో విడత భూ సమీకరణ అవసరాలను ప్రజలకు వివరించాలని మంత్రివర్గం పేర్కొంది. రైతుల అనుమానాలు నివృత్తి చేసి ఒప్పుకున్నాకే భూ సమీకరణ చేయాలని నిర్ణయించింది. కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. రైతులకు దాన్యం సేకరణ డబ్బు చెల్లించేందుకు రూ.672 కోట్లు విడుదల చేశామని పార్థసారథి వివరించారు. ఆ నగదును 24 గంటల్లో వారి ఖాతాల్లో వేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆరున్నర లక్షల కోట్ల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడి కొనుగోలుకు రూ.260 కోట్లు విడుదల చేసేందుకు మంత్రివర్గం సమ్మతించిందని చెప్పారు.

**గెయిల్, అంబికా సంస్థలకు కేటాయించిన భూమి రద్దు**

అలాగే అమరావతిలో 6 కేంద్ర సంస్థలకు 33.49 ఎకరాల కేటాయింపునకు మంత్రిమండలి ఆమోదం తెలిపినట్లు చెప్పారు మంత్రి పార్థసారధి. రాజధానిలో 7 సంస్థలకు కొత్తగా 32.4 ఎకరాలు కేటాయిస్తున్నట్లు తెలిపారు. గెయిల్, అంబికా సంస్థలకు కేటాయించిన భూమి రద్దు ప్రతిపాదనను మంత్రివర్గం ఆమోదించినట్లు వివరించారు. అమరావతిలో వరల్డ్ ఎకానమీ ఫోరం నిర్మాణ ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని పేర్కొన్నారు. అదేవిధంగా అమరావతిలో గత ప్రభుత్వం రద్దు చేసిన 1,575 పింఛన్ల పునరుద్ధరణకు ఆమోద ముద్ర వేసినట్లు తెలియజేశారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపినట్లు పార్థసారథి వివరించారు. తద్వారా రూ.4000ల కోట్ల పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ స్పేస్ పాలసీ 20252030కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెప్పారు. ఫలితంగా స్పేస్ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు మిగతా 3వ పేజీలో..

# ఆంధ్రప్రదేశ్ ను 'అంతరిక్షం'లో అగ్రభాగాన నిలిపేలా స్పేస్ పాలసీ 4.0!



అంతరిక్ష (స్పేస్) పరిశోధన రంగంలో పెట్టుబడులు పెంచే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు 'ఏపీ స్పేస్ పాలసీ 4.0'ను రూపొందించింది. 202429 మధ్య పెట్టుబడులు పెట్టే సంస్థలకు పాలసీ నిబంధనలు వర్తిస్తాయని, రాబోయే పదేళ్లలో రూ.25 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 35 వేల మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. అంతరిక్ష రంగంలో రూ.లక్ష కోట్లు పెట్టుబడులను రాబట్టడమే లక్ష్యంగా ఏపీ ముందడుగేసింది.

అంతరిక్ష పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, తయారీ, లాంచ్ సేవల పరంగా రాష్ట్రాన్ని హబ్‌గా తీర్చిదిద్దాలన్నది లక్ష్యమని వివరించింది. లేపాక్షి, తిరుపతిల్లో స్పేస్ సిటీల అభివృద్ధికి 'ఏపీ స్పేస్ సిటీ కార్పొరేషన్' పేరిట స్పెషల్ పర్పస్ వెహికల్(ఎస్‌పీవీ)ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు, భారీ, మెగా పరిశ్రమలకు పలు ప్రోత్సాహకాలను అందించనుంది. అంతరిక్ష రంగంలో స్టార్టప్‌లు, భారీ సంస్థలు, విద్యా సంస్థలు, ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేలా సమ్మిళిత పారిశ్రామిక ఎకోసిస్టంను అభివృద్ధి చేయడం. స్పేస్ వ్యాల్యూ చైన్‌లో ఉన్నత, మధ్య, కింది స్థాయిల్లో దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం. గవర్నెన్స్, విద్యారంగం, వ్యవసాయం, విపత్తు నిర్వహణ, పర్యావరణ పర్యవేక్షణలో స్పేస్ ఆధారిత ఆవిష్కరణలను సులభతరం చేయడం. శ్రీహరికోట సమీపంలో పారిశ్రామిక బేస్ ఏర్పాటు. తయారీ క్లస్టర్‌లను అభివృద్ధి పరచడం వంటి భారీ లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళుతోంది.


రాష్ట్ర వ్యాప్తంగా ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌ల ఏర్పాటు కోసం ప్రభుత్వం 23వేల ఎకరాలు గుర్తించిందని పాలసీలో తెలిపింది. ఏపీఐఐసీ కోసం ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ, పార్కులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపింది. వీటిలో అప్రోచ్ రోడ్, విద్యుత్ కనెక్టివిటీ, నీటి కనెక్టివిటీ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. పార్కుల ఏర్పాటు, అభివృద్ధి కోసం ప్రైవేట్, ప్రభుత్వ భూములను అనుమతిస్తున్నట్లు తెలిపింది. పెట్టుబడిదారులకు సత్వరం అనుమతులు ఇచ్చేలా సింగిల్ డెస్క్ అప్రువల్ మెకానిజాన్ని అమలు చేయనున్నట్లు పాలసీలో ప్రభుత్వం తెలిపింది. రాబోయే పదేళ్లలో.. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షిలో స్పేస్ డిజైన్ సెంటర్‌ను నెలకొల్పి సబ్‌సిస్టం ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్, పేలోడ్, డిజైన్ క్లస్టర్ అభివృద్ధి.

తిరుపతి జిల్లా శ్రీహరికోటలో స్పేస్ అప్లికేషన్ సేవలను అందుబాటులోకి తెచ్చేలా స్పేస్ డేటా బేస్డ్ సర్వీసెస్, భౌగోళిక విశ్లేషణల క్లస్టర్‌ల ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. డిజైన్లు, పరిశోధన, తయారీ, లాంచింగ్ అవసరాలకు రెండు స్పేస్ ఇండస్ట్రియల్ జోన్‌ల అభివృద్ధి. స్టార్టప్‌లు, నవకల్పనలకు అనువైన వాతావరణం కల్పించడం. ఉపగ్రహ అప్లికేషన్లు, లాంచ్ లాజిస్టిక్స్ కోసం అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో క్రిటికల్ స్పేస్ టెక్నాలజీని అందిపుచ్చుకోనుంది.

**లేపాక్షి, తిరుపతిలో స్పేస్ సిటీలు...**

రాష్ట్రంలో రెండు స్పేస్ సిటీలు నిర్మించాలని కొత్త పాలసీలో సీఎం చంద్రబాబు నిర్దేశించారు. 500 ఎకరాల్లో ఏర్పాటు కానున్న లేపాక్షి స్పేస్ సిటీలో డిజైన్ అండ్ డెవలప్మెంట్‌కు ప్రాధానత్య ఇస్తారు. ఆర్ అండ్ డి, స్పేస్ స్టార్ట్ అప్, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్, స్పేస్ అప్లికేషన్లు సేవలకు సంబంధించి సంస్థలు ఏర్పాటు కానున్నాయి. తిరుపతి స్పేస్ సిటీని మాన్యుఫ్యాక్చరింగ్, లాంచ్ లాజిస్టిక్ సేవలు అందించే సంస్థల ఏర్పాటుకు కేటాయించారు. ఇక్కడ లాంచ్ వెహికల్ అసెంబ్లీ, శాటిలైట్ పేలోడ్ అసెంబ్లీ, మెకానికల్ సిస్టమ్‌కాంపొనెంట్ మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రానిక్‌ఏవియానిక్స్ అసెంబ్లీ సంస్థలకే ఈ సిటీలో అవకాశం కల్పిస్తారు. బెంగళూరుకు సమీపంలో లేపాక్షి స్పేస్ సిటీ, శ్రీహరికోట చెన్నయ్‌కు సమీపంలో తిరుపతి స్పేస్ సిటీ ఉండటం కలిసొచ్చే అంశం. తిరుపతి స్పేస్ సిటీ నుంచి - శ్రీహరికోటకు రోడ్ కనెక్టవిటీపైనా ముఖ్యమంత్రి మార్గనిర్దేశం చేశారు. రాష్ట్రంలో మొత్తం 6 క్లస్టర్లను ఇందుకోసం ప్రతిపాదించారు. వీటిలో విశాఖపట్నంలో నావెల్ క్లస్టర్, దొనకొండలో ఏరోక్రాఫ్ట్ కాంపొనెంట్ క్లస్టర్, తిరుపతిలో ఆర్ అండ్ డి క్లస్టర్, లేపాక్షిలో ఏరోస్పేస్ ఎలక్ట్రానిక్స్ క్లస్టర్, ఓర్వకల్లులో అన్‌మాన్డ్ సిస్టమ్ క్లస్టర్, జగయ్యపేటలో మిస్సైల్ అండ్ అమునిషన్ క్లస్టర్‌లను ఏర్పాటు చేయనున్నారు. 2033 నాటికి 44 బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం 'ఇండియా స్పేస్ పాలసీ2023'ని తీసుకొచ్చింది. ఏపీ ప్రభుత్వం సైతం అందులో భాగస్వామ్యమై లక్ష మందికి రానున్న ఐదేళ్లలోనే అంతరిక్షం పాలసీ ద్వారా ఉద్యోగాలు సృష్టించాలనుకుంటోంది.

# ఎక్కాలు రావు..లెక్కలు తెలీవు!



- **మూడోతరగతిలో ఆరోహణ,అవరోహణ క్రమం రాయలేరు**
- **ఆరోతరగతిలోనూ సరిగ్గా 10 వరకూ ఎక్కాలు చెప్పలేరు**
- **కేంద్ర విద్యాశాఖ సర్వేలో విస్తుపోయే వాస్తవాలు**

దేశవ్యాప్తంగా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల్లో లెక్కలు, ఎక్కాలు తెలియని విద్యార్థులే ఎక్కువని కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన తాజా సర్వే వెల్లడించింది. పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయంటే మూడో తరగి విద్యార్థుల్లో 45శాతం మందికి 99వరకూ అంకెలను ఆరోహణ, అవరోహణ క్రమంలో గుర్తించే శక్తి లేదు. ఆరోతరగతి విద్యార్థుల్లో 10 వరకూ ఎక్కాలు వచ్చిన వారు సగం కంటే కాస్త ఎక్కువ (53శాతమే).

గత ఏడాది డిసెంబర్ 4న కేంద్ర విద్యా శాఖ పరిధిలోని ..విద్యావ్యవస్థ పనితీరు, విశ్లేషణ, సమీక్ష సమగ్రాభివృద్ధి రాష్ట్రీయ సర్వేక్షణ్ సర్వే నిర్వహించింది. దేశంలోని 36 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఉన్న 781 జిల్లాలకు చెందిన 74,229 ప్రభుత్వ, ప్రైవేట్ బడుల్లో నిర్వహించిన ఈ సర్వేలో 21,15,022 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తొమ్మిదో తరగతిలో 53 శాతం మంది విద్యార్థులే గణిత ప్రక్రియల పరస్పర సంబంధం, వాటిని ఇచ్చిన లెక్కల్లో అన్వయించగలుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వ బడులకు చెందిన వారు అత్యుత్తమంగా ప్రతిభ చాటుతుండగా...రెండో స్థానాన్ని ప్రైవేట్ బడుల విద్యార్థులు ఆక్రమించారు. రాష్ట్ర ప్రభుత్వాలు నడిపే బడుల విద్యార్థులది మూడో స్థానం.

ఇక తెలుగు విషయానికొస్తే సరళమైన పదాలను కూడా మూడో తరగతి పిల్లలు చదవలేని దుస్థితి. ఎనిమిదవ తరగతి విద్యార్థులు రెండో తరగతి చిన్నారుల పాఠాలు చదవగలుగుతున్నారు. 9వ తరగతి చదివే విద్యార్థులకు సగం మందికే తమ మాతృభాషపై అవగాహన ఉంది. మాథ్స్, సైన్స్ 100కి 35 నుంచి 36మంది విద్యార్థులకు మాత్రమే కాస్త పట్టుంది. సోషల్ సబ్జెక్టులో కూడా చాలా వెనకబడిపోయారు. జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రం పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. అనంతపురం వంటి వెనుకబడిన జిల్లాలో గణితం, ఇంగ్లీష్, సైన్స్ లో విద్యార్థుల ప్రతిభ అధ్వాన్నంగా ఉందని సర్వే తేల్చింది.

పరాఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్ ఫలితాల నేపథ్యంలో విద్యార్థుల ప్రతిభను మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కేంద్ర విద్యాశాఖ కార్యదర్శి సంజయ్ కుమార్ వెల్లడించారు. అమ్మఒడి, తల్లికి వందనం వంటి పథకాలు తీసుకువచ్చి చదవడానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలు మెరుగ్గా చదవడానికి తీసుకోవలసిన మార్గాలను అన్వేషించాలి. ఈ తరహా అవగాహనతో పదో తరగతి పరీక్షల్లో మాత్రం అన్ని సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు సాధిస్తున్న చిన్నారులు లక్షల్లో ఉండడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి..? పదిలో 600 మార్కులకు ఒకప్పుడు 500 దాటితే ఊరు, మండలమంతా మెచ్చుకుని, సన్మానాలు చేసే పరిస్థితి ఒకనాడు ఉండేది. కానీ, 570 పైన మార్కులొచ్చినా ఏడుస్తున్న చిన్నారులు, తగ్గాయని నసిగే తల్లిదండ్రులు ప్రస్తుతం అక్కడక్కడ కనబడుతున్నారు. తల్లిదండ్రుల దృక్పథం మారాలి. గురువులు ఆ దిశగా పిల్లలకు విషయ జ్ఞానాన్ని పెంచాలి. పిల్లలకు వారి సబ్జెక్టుల్లో ఎంత అవగాహన ఉంది, ఏ మాత్రం లెక్కల్లో పటిమ ఉందని ఆలోచించడం ఇకనైనా మొదలుపెట్టాలి.

# అధికారుల నిర్లక్ష్యానికి విద్యార్థులు బలి కావాలా?

- **అధికారుల అలసత్వం.. విద్యార్థులకు శాపం..**
- **2020–21లో వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ ఏర్పాటు**
- **నాలుగేళ్లయినా అనుమతులు తెచ్చుకోవడంలో నిర్లక్ష్యం?**
- **అనుమతులు తీసుకురావడానికి ఏళ్లు పడుతుందా?**
- **రాజకీయ విమర్శలు సరే.. విద్యార్థులకు న్యాయం ఏదీ?**
- **ప్రభుత్వాల నిర్లక్ష్యానికి విద్యార్థులు బలి కావాలా?**



రాష్ట్రంలో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కాస్తా విద్యార్థులకు శాపంగా మారుతోంది. ప్రభుత్వాలు ఏమైనా అమలు చేయాల్సింది మాత్రం అధికారులే కదా. వైఎస్ జగన్ ప్రభుత్వం 2020-21లో కడపలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీని స్థాపించింది. ఈ యూనివర్సిటీకి ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్), యూజీసీ (యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత కోవిడ్ కారణంగా అనుమతులు ఆలస్యమయ్యాయని వైఎస్ జగన్ పులివెందుల పర్యటనలో చెప్పారు. కానీ 2023, 2024 బ్యాచ్ లు ప్రారంభించే సమయంలోనైనా అధికారులు అనుమతులు తెచ్చుకోవడంలో చురగ్గా వ్యవహరించాల్సింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదైనా అనుమతి పెండింగ్ లోనే ఉంది. అయితే ఈ విషయంపై అటు వైసీపీ అధినేత జగన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్లతో కౌంటర్ ఇచ్చుకున్నారు. కానీ ఇక్కడ ఇద్దరు నేతలు అధికారుల నిర్లక్ష్యాన్ని మాత్రం ప్రస్తావించలేదు. యూనివర్సిటీకి ఇంకా అనుమతి రాలేదు. రేపు ఆ విద్యార్థులు తమ కోర్సు పూర్తి చేశాక అయినా అనుమతి రాకపోతే వారి పరిస్థితి ఏంటి? మరో ఫాతిమా మెడికల్ కాలేజీలా విద్యార్థులు, తల్లిదండ్రులు కోర్టుల చుట్టూ తిరగాలా? ఇప్పటికైనా కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (COA) నుంచి అనుమతి పొందేందుకు కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలి.

**విద్యార్థులకు అండగా ఉంటాం: జగన్**

పులివెందుల పర్యటనలో ఉన్న జగన్ ను డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వైసీపీ అండగా నిలుస్తుందని ఆపార్టీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (COA) అనుమతి లేకపోవడం, ADCET విడుదలపై గత కొద్ది రోజులుగా ఈ విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. విద్యార్థులకు మంచి యూనివర్సిటీ కడితే ఈ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేస్తోంది. వైఎస్సార్‌సీపీ విద్యార్థులకు అన్నివిధాల అండగా ఉంటుంది అని వైఎస్ జగన్ హామీ ఇచ్చారు.

అనంతరం వైఎస్ జగన్ తన 'ఎక్స్' ఖాతాలో ఈ విషయంపై సీఎం చంద్రబాబును నిలదీస్తూ ట్వీట్ చేశారు. మా ప్రభుత్వం 2020-21లో కడపలో వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీని స్థాపించింది. ఆ వర్సిటీకి ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్), యూజీసీ (యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) అనుమతి ఇచ్చింది. కానీ.. కోవిడ్ మహమ్మారి ప్రబలడంతో ఆ సమయంలో కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీవోఏ) ఆ యూనివర్సిటీలో తనిఖీలు నిర్వహించలేకపోయింది. సీవోఏను ఒప్పించడంతో 2023 అక్టోబర్‌లో తనిఖీకి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. మొదటి మూడు బ్యాచ్‌లకు ఆమోదం తెలిపేందుకు 2024 జూలై 1న తనిఖీ చేసింది. అయితే వైస్ ఛాన్సలర్ నుంచి ఎటువంటి హామీ లేకపోవడం వల్ల ఇప్పటికీ ఆమోదం పెండింగ్‌లో ఉంది. దురదృష్టవశాత్తు ప్రస్తుత ప్రభుత్వం ఆ యూనివర్సిటీని ఇప్పటి వరకు పట్టించుకోవడం లేదు.

2023-24, 2024-25 బ్యాచ్‌లకు సీవోఏ అనుమతులు మా ప్రభుత్వ హయాంలోనే వచ్చాయి. కానీ.. ఈ సంవత్సరం గ్రాడ్యుయేట్ల బ్యాచ్ కోసం తక్షణమే ప్రభుత్వం స్పందిస్తుందని ఆశించాం. దారుణమైన విషయం ఏమిటంటే.. ఈ ప్రభుత్వం కొత్త విద్యార్థులను చేర్చుకోవడానికి ఇప్పటి వరకు ఏడీ సెట్ పరీక్ష నిర్వహించలేదు. ఏడీ సెట్‌కు ఇంకా కన్వీనర్‌ను కూడా నియమించలేదు. పరీక్ష ఎప్పుడు జరుగుతుంది? అడ్మిషన్లు ఎప్పుడు ప్రారంభమవుతాయి? ఈ ప్రభుత్వం నిద్రాణస్థితి నుంచి మేల్కొంటుందని ఆశిస్తున్నాను. మేలుకో బాబూ.. అంటూ జగన్ తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

**వైఎస్ జగన్ కు మంత్రి నారా లోకేష్ కౌంటర్**

మరోవైపు డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థులు కలిసిన అనంతరం జగన్ తన ఎక్స్ ఖాతాలో చేసిన వ్యాఖ్యలకు.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా 'ఎక్స్' లోనే కౌంటర్ ఇచ్చారు. పాపాలు చేసిన మీరు శాపాలు పెట్టడం ఏంటి జగన్? అంటూ వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను లోకేష్ తన ట్వీట్లో ప్రస్తావించారు.

ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంది మీరే కదా జగన్ అని లోకేష్ ప్రశ్నించారు. ఇప్పుడు దొంగే దొంగా దొంగ అన్నట్టు, ఎందుకీ నాటకాలు? అన్నారు. 2020 21లో మొదటి బ్యాచ్ ప్రారంభం అయ్యింది. యూనివర్సిటీకి కనీసం సొంత బిల్డింగ్ లేకుండా, ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా 3 ఏళ్ళు నడిపించింది మీ ప్రభుత్వంలో కాదా? కనీసం ఫుల్ టైం ఫ్యాకల్టీ కూడా లేకుండా కన్సల్టెంట్లతో నడిపించి, విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నారు. కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (COA) అనుమతి లేకుండా మీరు చేసిన నిర్వాకం వల్ల, 2020 21, 202122 & 202223 బ్యాచ్ కి సంబంధించిన విద్యార్థులు నష్టపోయారు. దీని ప్రభావం ఈ ఏడాది ADCET పై కూడా పడింది.

అనుమతి కోసం వచ్చిన కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (COA), యూనివర్సిటీని 01.07.2024 & 02.07.2024న సందర్శించి, కనీస సౌకర్యాలు కూడా లేవు అంటూ, యూనివర్సిటీలో లోపాలపై 26.07.2024న నోటీసులు ఇచ్చింది. దీనిపై 07.08.2024న ప్రభుత్వం వివరణ ఇచ్చింది. క్యాడర్ వైజ్ ఫ్యాకల్టీ లేదు అంటూ 2020 21, 202122 & 202223 బ్యాచ్ అనుమతులు ఇచ్చేది లేదని 25.10.2024న COA తెలిపింది. 20.11.2024న యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ లో ప్రిన్సిపాల్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లని తాత్కాలిక పద్ధతిలో నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ ఉన్నత విద్యా శాఖ 02.07.2025న అనుమతిని మంజూరు చేసి, ఇదే విషయాన్ని 03.07.2025న COA కి తెలియజేసింది.

**మా ప్రభుత్వం తీసుకున్న చర్యలు**

* కనీస సిబ్బంది లేకపోవడం వల్ల, APSCHEకి లేఖలు పంపి, ADCET 2025కి కన్వీనర్‌ను నియమించాల్సిందిగా కోరడం జరిగింది.
* యూనివర్సిటీ శాశ్వత భవనాల నిర్మాణం కోసం ఏర్పాట్లు చేస్తున్నాం.
* మీ హయాంలో ఇచ్చిన రెగ్యులర్ అధ్యాపక నియామక నోటిఫికేషన్ పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టే ఆర్డర్ ఇవ్వడంతో, విద్యార్థులు నష్ట పోకుండా సిబ్బందిని నియమించటానికి చర్యలు తీసుకున్నాం మీ హయాంలో కనీసం రెగ్యులర్ అధ్యాపకులు లేకుండా కన్సల్టెంట్లతో నడిపింది మీరు. యూనివర్సిటీకి కనీసమైన సౌకర్యాలు, భవనాలు కూడా లేకుండా నడిపింది మీరు. మీ పాపాలను సరి చేస్తూ, విద్యార్థులకు అండగా నిలుస్తుంది కూటమి ప్రభుత్వం అంటూ నారా లోకేష్ ట్వీట్ చేశారు.

**ప్రభుత్వం స్పందన**

కడప: ఎట్టకేలకు కడపలోని డా. వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు చేస్తున్న ధర్నాపై ప్రభుత్వం స్పందించింది. వెంటనే యూనివర్సిటీకి బి.డిజైన్, బి.ఎఫ్.ఎ కోర్సులలో మెరిట్ ఆధారంగా డైరెక్ట్ అడ్మిషన్లు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. మెరిట్ ఆధారంగా నేరుగా అడ్మిషన్లకు ఏపీఎస్ఎస్ఈ అనుమతి ఇచ్చింది. 2025–26 విద్యా సంవత్సరానికి మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు జరగనున్నాయి. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**– వీసీ ప్రొఫెసర్ జి. విశ్వనాథ్ కుమార్.**

# ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'స్మార్ట్' షాక్!

- **ప్రతిపక్షంలో ఒకలా.. ప్రభుత్వం వచ్చాక మరోలా**
- **కూటమి ప్రభుత్వంపై స్మార్ట్ మీటర్ల కుంపటి**



రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు కూటమి ప్రభుత్వం 'స్మార్ట్' షాక్ ఇస్తోంది. స్మార్ట్ మీటర్ల దోపిడి విధానంపై ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పిందని సామాన్య ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రతిపక్షంలో ఉన్న సమయంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు". ప్రస్తుతం మాట మార్చి బాగున్న డిజిటల్ మీటర్లను తొలగించి మరి స్మార్ట్ మీటర్లను బిగిస్తుండడంపట్ల ప్రజాగ్రహజ్వాల మొదలైంది. ముందు ప్రభుత్వ కార్యాలయాలకు, ఆ తదుపరి షాపులు, పరిశ్రమలు, సంస్థలకు బిగించారు. ఇప్పుడు నివాస గృహాలకూ అమర్చుతున్నారు. వినియోగదారుల ముందస్తు అనుమతి లేకుండా, కనీస అవగాహన కలిగించాలన్న స్పృహ లేకుండా బలవంతంగా కరెంట్ ఆగిపోతుందని బెదిరించి మీటర్లను పెడుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా అర్థమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అధిక కరెంటు బిల్లులతో సామాన్యుడి గుండెలలో ఇది మంచి ప్రభుత్వం అని చెప్పుకునే కూటమి ప్రభుత్వ తీరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బడా కార్పొరేట్ ఆదానీ కంపెనీకి స్మార్ట్ మీటర్లకు పదేళ్ల పాటు నిర్వహణ డీబీఎఫ్ఓఓటీ(డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్) పద్ధతిలో కాంట్రాక్టును ప్రభుత్వం కట్టబెట్టింది. తొలి దశలో 41 లక్షల కనెక్షన్లకు మీటర్లు పెడుతున్నారు. దశలవారీగా రాష్ట్రంలోని రెండు కోట్ల మంది వినియోగదారుల గృహాలకు మీటర్లను బిగిస్తారు. ఈ విధానం ద్వారా విద్యుత్ రంగాన్ని బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రైవేటీకరణకు మొదటి మెట్టని మేధావులు అభిప్రాయపడుతున్నారు. దీని పేరే ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్. సెల్‌ఫోన్ తరహాలో ముందుగానే డబ్బు చెల్లించి చార్జింగ్ చేయించుకోవాలి. అప్పుడే కరెంటు వస్తుంది. ముందు రూ. 500 తగ్గకుండా బ్యాలెన్స్ వేయించుకోవాలి. బ్యాలెన్స్ అయిపోగానే మళ్ళీ డబ్బు చెల్లించి రీచార్జి చేయించుకోవాలి. లేకపోతే కరెంటు నిలిచిపోతుంది. కంపెనీవారే ఆన్‌లైన్‌లో బిల్లు పంపుతారు. తప్పులు వచ్చినా సమాధానం చెప్పే నాథుడు ఉండరనే కలవరం లేకపోలేదు.

మనిషన్నవాడు ఏనాడూ చూడని విధంగా పగలు ఒక రేటు, రాత్రి ఒక రేటు, వేసవి కాలం ఒక రేటు, చలికాలం మరొక రేటు వసూళ్లు తప్పవు. ఈ విధానాన్ని "టైం ఆఫ్ ది డే" అని పిలుస్తారు. దీని ప్రకారం ఒక రోజును నాలుగు భాగాలుగా విడగొడతారు. ప్రతి సమయానికి ఒక రేటు నిర్ణయిస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి 10 గంటల మధ్య ఎక్కువ కరెంటు వినియోగిస్తారు. కాబట్టి, ఆ సమయంలో మరింత ఎక్కువ చార్జీలు వసూలు చేస్తారు. అంటే మనిషికి అవసరమైనపుడు కాకుండా బిల్లు పడనప్పుడు కరెంట్ వినియోగించుకోవలసిన దుస్థితి ఏర్పడుతుంది.

సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ 8,927, త్రీ ఫేజ్ మీటర్‌కు రూ 17,286 అదానీ కంపెనీకి జనం చెల్లించాలి. జిల్లాలను బట్టి రేట్లలో తేడాలు ఉంటాయి. ముందు చెల్లించనవసరం లేదన్నారు. కానీ వాటి ఖర్చును కూడా 93 నెలలలో వాయిదాల పద్ధతిలో ఈ మొత్తం మనపై వసూలు చేస్తారు. రాష్ట్రంలోని రెండు కోట్ల మీటర్లకు దాదాపు రూ.25 వేల కోట్ల భారం జనం నెత్తిన పడుతుంది. బాగున్న పాత మీటర్లు వృథాగా పడేస్తారు. మీటర్లు తయారు చేసేది, బిగించేది, నిర్వహించేది సర్వం అదానీ కంపెనీనే! కాబట్టి వీరి దోపిడికి అడ్డు అదుపు ఉండదు.

స్మార్ట్ మీటర్లు ఎఎంఐ(అడ్వాన్స్‌డ్ మీటర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్), ఎఎంఆర్(ఆటోమేటిక్ మీటర్ రీడింగ్) టెక్నాలజీతో ఉంటాయి. మన ఇంటిలోని స్మార్ట్‌మీటర్‌కు, అదానీ కంపెనీకి వైర్‌లెస్ ద్వారా అనుసంధానం చేస్తారు. కంట్రోల్ మొత్తం ప్రైవేటు సంస్థ చేతిలో ఉంటుంది. విద్యుత్ వినియోగాన్ని, డబ్బు వసూళ్లను వారే నియంత్రిస్తారు. పెత్తనం మొత్తం వారిదే. విద్యుత్ ఉత్పత్తి ఇప్పటికే సగభాగం బడా కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోయింది. ఇప్పుడు స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్తు పంపిణీ కూడా అదానీ వంటి బడా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రజల సొమ్ముతో ప్రభుత్వం వేసిన విద్యుత్ లైన్లు, స్తంభాల నుంచి ప్రైవేట్ కంపెనీలు మనకు విద్యుత్ సరఫరా చేస్తాయి. స్మార్ట్ మీటర్లు బిగిస్తాయి. బిల్లులు వసూలు చేసుకుంటాయి. ఇప్పటికే స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని పలుచోట్ల వినియోగదారులు ఆందోళనలు చేస్తున్నారు.

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్తు రంగంలో సంస్కరణలను ప్రవేశపెట్టిన ఫలితంగా దేశంలో ఇప్పటికే 56 శాతం విద్యుత్తు, 19 శాతం విద్యుత్తు పంపిణీ వ్యవస్థ, 55 శాతం పునరుత్పాదక విద్యుత్తు అదానీ లాంటి బడాకార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. విద్యుత్తు రంగాన్ని పూర్తిగా ప్రైవేటు శక్తులకు అప్పగించటానికి మోడీ ప్రభుత్వం 2003 నాటి ఎలక్ట్రిసిటీ చట్టాన్ని మార్చి విద్యుత్తు సవరణ బిల్లును ఆర్డినెన్స్ రూపంలో 2020లో సంపూర్ణ లాక్ డౌన్ సమయంలో తీసుకొచ్చింది. ఈ బిల్లు పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉన్నందున చట్టం రూపం తీసుకోలేదు. కానీ దొడ్డిదారిన అమలు చేస్తున్నారు. విద్యుత్ వినియోగదారుల గుండెలపై కుంపట్లు పెట్టే ఈ విద్యుత్తు బిల్లుపై ప్రతిపక్షాలతో పాటు వామపక్ష పార్టీలు, రైతు సంఘాలు, వినియోగదారుల సంఘాలు వివిధ రూపాలలో ఆందోళనలు కొనసాగిస్తున్నాయి.

ఈ సవరణ బిల్లును అడ్డం పెట్టుకొని దేశంలోని వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లు మూడు సంవత్సరాల్లో బిగించాలని 2021 ఆగస్టు 17న కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీచేసింది. అయితే స్మార్ట్ మీటర్లను వినియోగదారులు అంగీకరిస్తేనే బిగించాలనే నిబంధనను అదానీ సంస్థ అధికారులు గాలికి వదిలేసి విద్యుత్ అధికారుల అండతో బిగించి వెళుతున్నారు. విద్యుత్ పంపిణీ ప్రైవేటీకరణ, ఉచిత విద్యుత్ పథకాల తొలగింపు, పేదలకు తక్కువ రేటుకి విద్యుత్ అందించే క్రాస్ సబ్సిడీ విధానం రద్దు, అందరికీ ఒకటే స్లాబ్, స్మార్ట్ మీటర్లు బిగించాలని కేంద్రం తాఖీదులు ఇచ్చింది. అందుకు ఆర్డిఎస్ఎస్ (రీవాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం అమలులో భాగంగా ఆనాటి వైసీపీ, కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అండతో 18 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగింపుకు రంగం సిద్ధం చేశారు. ఒక్కొక్క మీటరు ఖర్చు, నిర్వహణ కలిపి రూ. 35 వేల రేటు నిర్ణయించారు. ఇదొక భారీ కుంభకోణం. అదానీకి, తమ బినామీ కంపెనీ షిరిడి సాయి ఎలక్ట్రికల్ సంస్థలకు రూ 13,252 కోట్ల కాంట్రాక్టులు కట్టబెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా పంపు సెట్లకు మీటర్లు బిగించటంపై రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో పంపు సెట్లకు మీటర్ల బిగింపు తాత్కాలికంగా ఆగింది.

ఇప్పటికే పెరిగిన విద్యుత్ బిల్లులతో సామాన్య జనం నిత్యం గగ్గోలు పెడుతున్నారు. కరెంటు చార్జీలు పెంచేది లేదని, బాదుడు ఆపుతామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని రోడ్లపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. అసలు బిల్లు కంటే కొసరు బిల్లు ఎక్కువై వినియోగదారులు లబోదిబో అంటున్నారు.



# బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం: మంత్రి నాదెండ్ల

- **పోర్టు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాకు చెక్‌పెట్టాలని ఆదేశం**
- **బియ్యం ఎగుమతులకు సహకారం – మార్గదర్శకాలు విడుదల**

**అమరావతి:**

రాష్ట్రం నుంచి ఇతర దేశాలకు బియ్యం ఎగుమతులకు ప్రభుత్వం వ్యతిరేకం కాదన్నారు ఆహార, పౌర సరఫరా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్. ఎగుమతి దారులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సులభంగా ఎగుమతులు చేసుకోవచ్చని సూచించారు. మంత్రి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌లోని మంత్రి చాంబర్‌లో కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నుంచి బయటకు వెళ్ళే బియ్యం సరఫరాలో PDS (సబ్సిడీ) బియ్యం కలిపే ప్రసక్తే లేకుండా కఠినంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నమోదవుతున్న 6A కేసులతో పాటు PD యాక్ట్, BNS సెక్షన్ల కింద కేసులు కూడా నమోదు చేయాలని స్పష్టం చేశారు. విశాఖపట్నం, కాకినాడ, నెల్లూరు పోర్టు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి 24/7 సిబ్బందితో తనిఖీలు చేపట్టాలని, అవసరమైతే చెక్‌పోస్టులు పెంచాలని సూచించారు. కాకినాడ పోర్ట్ వద్ద PDS బియ్యం నియంత్రణ బాగా జరుగుతోందని, అలాగే విశాఖ, నెల్లూరు పోర్ట్ ప్రాంతాలను కూడా మరింత పటిష్టం చేయాలని సూచించారు. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశించారు. జాతీయ రహదారులపై కూడా అవసరమయ్యే చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. కాకినాడ జిల్లాలో మొత్తం 85 కేసులు, విశాఖపట్నం జిల్లాలో 92 కేసులు, నెల్లూరు జిల్లాలో 62 కేసులు పెట్టినట్లు చెప్పారు.

# నల్లపురెడ్డిపై కేసు నమోదు



**కోవూరు:**

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిపై కేసు నమోదైంది. ఓ మహిళ ఫిర్యాదుతో కోవూరు పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని 74, 75, 79, 296 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీంతో ఈ కేసులో ప్రసన్నకుమార్‌రెడ్డికి నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశముంది. మరోవైపు తన ఇంటిపై దాడి చేశారని..తనను చంపేందుకు ప్లాన్ చేశారంటూ ప్రసన్నకుమార్‌రెడ్డి సైతం పోలీసులు ఫిర్యాదు చేశారు.

# వస్తున్నా మీకోసం

- **ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ మూడురోజుల పాదయాత్ర**
- **ప్రతి గుండెను తడుతూ, ప్రతి సమస్యను వింటూ ప్రజలతో మమేకం.**
- **పదవి కాదు.. బాధ్యత గుర్తుచేసే యాత్ర**



**ధర్మవరం:**

ఆరోగ్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఏడాది ప్రజా సేవ పూర్తి చేసుకున్న సందర్భంగా ధర్మవరం పట్టణంలో పాదయాత్ర చేయనున్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మూడు రోజుల పాదయాత్ర చేపడుతున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పేర్కొన్నారు. 2024 జూన్ 4న ధర్మవరం శాసనసభ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఘన విజయం సాధించి, ఆపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సత్యకుమార్ యాదవ్ పాలనకు ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా, మంత్రి ప్రజల మధ్య నడుస్తూ, ప్రతి గుండెను తడుతూ, ప్రతి సమస్యను వింటూ మూడు రోజుల పాదయాత్ర నిర్వహించబోతున్నారని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. పాదయాత్ర జూలై 11వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు తిక్కస్వామి నగర్‌లోని శివాలయం వద్ద నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. శుక్రవారం, శనివారం, ఆదివారం—మూడు రోజుల పాటు పట్టణంలోని పలు వార్డుల్లో మంత్రి స్వయంగా పాదయాత్ర చేస్తూ ప్రజలను కలిసి, వారి అభిప్రాయాలను స్వీకరిస్తారని చెప్పారు. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ఇప్పటికే ప్రారంభమైన ప్రాజెక్టులు, అలాగే రాబోయే ప్రణాళికలపై ప్రజలకు మంత్రి వివరిస్తారని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడమే ఈ పాదయాత్ర ముఖ్య లక్ష్యమని చెప్పారు. ధర్మవరం అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమైందన్న విశ్వాసంతో ప్రతి వీధిని, ప్రతి ఇంటిని తన సొంతంగా భావిస్తూ మంత్రి ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకోనున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణ ప్రజలందరినీ ఆహ్వానిస్తున్నామని, మీ సమస్యను నేరుగా మంత్రివారికి తెలియజేసే ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని హరీష్ బాబు కోరారు.

# డిసెంబర్ నాటికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్ రెడీ

- **అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్ స్పీకర్ పరిశీలన**
- **అధికారులకు పలు సూచనలు చేసిన అయ్యన్నపాత్రుడు**



**అమరావతి:**

రాజధాని అమరావతిలో ప్రతిష్టాత్మక సంస్థల నిర్మాణాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శాశ్వత సచివాలయం, హైకోర్టు నిర్మాణం పనులు వేగం పుంజుకున్నాయి. అమరావతిలో నిర్మాణంలో ఉన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల క్వార్టర్స్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు పరిశీలించారు. వేగంగా జరుగుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ డిసెంబర్ నాటికి అమరావతిలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్వార్టర్స్ అందుబాటులోకి వస్తాయని చెప్పారు స్పీకర్ అయ్యన్నపాత్రుడు. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని క్వార్టర్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. చట్టసభ సభ్యుల కోసం మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 35 మంది మంత్రులు, 36 న్యాయమూర్తుల క్వార్టర్స్ మార్చి నాటికి అందుబాటులోకి వస్తాయన్నారు. స్పీకర్, డిప్యూటీ స్పీకర్, మండలి ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ క్వార్టర్స్, మంత్రుల క్వార్టర్స్‌తో పాటే ప్రత్యేక గుర్తింపు ఉండేలా చూడాలని సూచించారు. స్విమ్మింగ్ పూల్, ఆసుపత్రి, క్లబ్ హౌస్ వంటివి కూడా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను స్పీకర్ ఆదేశించారు. సోలార్, గ్రౌండ్ వాటర్ రీఛార్జ్, వేస్ట్ వాటర్ యూజెస్ వంటి అన్ని వసతులు ఉండేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి అధికారిక నివాసం, రాజ్ భవన్‌లు కృష్ణా నది వెంబడి ఉంటాయన్నారు. సిఆర్డిఏ హౌసింగ్ & బిల్డింగ్స్ (హౌసింగ్ ప్రాజెక్ట్స్) విభాగ చీఫ్ ఇంజినీర్ ఎన్.శ్రీనివాసులు, ఇతర ఇంజినీరింగ్ విభాగ అధికారులు..భవనాలలో ఏర్పాటు చేసిన సదుపాయాలు, ఇంటీరియర్ గురించి వివరించారు. మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు శాసన మండలి, శాసనసభ సభ్యుల కొరకు నిర్మిస్తున్నట్లు అధికారులు స్పీకర్‌కి తెలియజేశారు.

మహిళ సాధికార సభ్యుల సదస్సు సెప్టెంబర్ 14, 15 తేదీల్లో తిరుపతి వేదికగా ఉంటుందని శాసన సభపతి అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో సభాపతి అయ్యన్నపాత్రుడు మీడియాతో ముచ్చటించారు. ఏపీ ఆతిథ్యం ఇవ్వాలన్న పార్లమెంట్ స్పీకర్ సూచన మేరకు దీనిని నిర్వహిస్తున్నామని తెలిపారు. దాదాపు 500 మంది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ కమిటీ సభ్యులు అన్ని రాష్ట్రాల నుంచి పాల్గొంటారన్నారు. ఆగస్టు మొదటి వారం లేదా రెండో వారంలో 10 రోజుల పాటు అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ఉంటాయని అయ్యన్నపాత్రుడు వెల్లడించారు.

ప్రజారాజధాని అమరావతిలో నిర్మించిన MLA, MLCల క్వార్టర్స్ భవన సముదాయాలను ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు గారు పరిశీలించారు. శాసనసభాపతి వారికి సిఆర్డిఏ హౌసింగ్ & బిల్డింగ్స్ (హౌసింగ్ ప్రాజెక్ట్స్) విభాగ చీఫ్ ఇంజినీర్ ఎన్.శ్రీనివాసులు, ఇతర ఇంజినీరింగ్ విభాగ అధికారులు..భవనాలలో ఏర్పాటు చేసిన సదుపాయాలు, ఇంటీరియర్ గురించి వివరించారు. మొత్తం 12 టవర్లలో 288 క్వార్టర్లు శాసనమండలి, శాసనసభ సభ్యుల కొరకు నిర్మిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఇంటీరియర్ పనులలో పురోగతిని శాసనసభాపతి వారికి అధికారులు వివరించగా ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనను దృష్టిలో పెట్టుకుని శాసనసభ్యులకు నివాస సముదాయాలు ఏర్పాటు చేయాలని అధికారులకు శాసనసభాపతి వారు పలు సూచనలు చేశారు. అలాగే భవన సముదాయాల వద్ద ఏర్పాటు చేస్తున్న పలు సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# వైసీపీ కుట్రలపై విచారణ చంద్రబాబు

- **పెట్టుబడులు రాకుండా వైసీపీ అడ్డుకుంటోందని మంత్రి వెల్లడి**
- **సీఎంకు ఆధారాలు చూపిన మంత్రి పయ్యావుల**
- **ఈ మెయిల్స్ పెట్టిన అంశంపై విచారణకు ఆదేశిస్తాం**



**అమరావతి:**

రాష్ట్రంలో పెట్టుబడులపై వైసీపీ కుట్రలు చేస్తోందంటూ సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీకి పెట్టుబడులు రాకుండా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సీపీ కుట్రలపై విచారణ చేయిస్తామని ప్రకటించారు. ఏపీకి పెట్టుబడులు రాకుండా వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రివర్గ భేటీలో మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఏపీ ఎండీసీ బాండ్లలో పెట్టుబడులు పెట్టొద్దని 200 కంపెనీలకు మెయిల్స్ పంపారని ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా వైసీపీ కుట్రలు పన్నుతోందని క్యాబినెట్ భేటీలో ప్రస్తావించారు పయ్యావుల కేశవ్. ఏపీఎండీసీ జారీ చేసిన బాండ్లల్లో పెట్టుబడులు పెట్టొద్దంటూ ఏకంగా 200 దేశ, విదేశీ కంపెనీలకు తప్పుడు ఈమెయిల్స్ పెట్టారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. తమ పార్టీ సానుభూతిపరుడితో వైసీపీనే మెయిల్స్ పెట్టించిందని సీఎంకు ఆధారాలు కూడా చూపారు పయ్యావుల కేశవ్.

దీనిపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ బ్రాండ్ దెబ్బ తీసేలా వివిధ సంస్థలకు ఈ మెయిల్స్ పెట్టడంపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. పెట్టుబడులు అడ్డుకునేలా వైసీపీ చేస్తున్న కుట్రలపై విచారణ చేయిస్తామని మంత్రివర్గంలో ప్రకటించారు. తప్పులు చేసి.. ఆ తప్పులను ప్రత్యర్థుల మీదకు నెట్టేయడమనే కుట్రలను మొదటి నుంచి వైసీపీ అమలు చేస్తూనే ఉందని ధ్వజమెత్తారు. నిధులు రాకుండా తెర వెనుక అడ్డుకోవడం, పథకాలు అమలు చేయడం లేదని ప్రజల్లో దుష్ప్రచారం చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. ఇలాంటి విషయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతీసేలా 200 కంపెనీలకు ఈ మెయిల్స్ పెట్టడాన్ని సీరియస్ గా తీసుకోవాలని పలువురు మంత్రులు చెప్పారు. దీనిపై స్పందించిన సీఎం చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ దెబ్బ తీసేలా ఈ మెయిల్స్ పెట్టిన అంశంపై విచారణకు ఆదేశిస్తామన్నారు. మామిడి రైతుల విషయంలోనూ వైసీపీ ఇదే విధంగా తప్పుడు అంశాలను దుష్ప్రచారం చేస్తోందన్నారు. గతంలో అమరావతికి నిధులు రాకుండా వైసీపీ తప్పుడు ఫిర్యాదులు చేసిందని పలువురు మంత్రులు గుర్తు చేశారు.



# పవన్‌తో మాధవ్ భేటీ

ఏపీ ఉప ముఖ్యమంత్రి. జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బుధవారం సాయంత్రం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మాధవ్ సమావేశం అయ్యారు. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత మొదటి సారి కలిసిన మాధవ్‌ను శాలువా కప్పి, జ్ఞాపిక అందించి పవన్ కళ్యాణ్ శుభాకాంక్షలు తెలియచేశారు. కూటమి స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా వర్తమాన రాజకీయ అంశాలపైనా, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయడంపైనా ఇద్దరూ చర్చించుకున్నారు.

# నేడు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 2.0

- **ఒకేరోజు 2.28 కోట్ల మంది భాగస్వామ్యంతో రికార్డుకు సన్నాహాలు**
- **పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం**
- **తల్లిదండ్రుల నుంచి పాఠశాలల పనితీరుపై అభిప్రాయాలు, సూచనల స్వీకరణ**



**అమరావతి:**

ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇవాళ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని విద్యా సంస్థల్లో నిర్వహించే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0 తో.. ఒకేరోజు దాదాపు 2.28 కోట్ల మందిని భాగస్వాములను చేస్తూ సరికొత్త రికార్డు సృష్టించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. పుట్టపర్తి నియోజకవర్గంలోని కొత్తచెరువు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగే ప్రధాన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలతో కలిపి మొత్తం 61 వేల విద్యా సంస్థలు పాలుపంచుకోనున్నాయి. ఈ సమావేశంలో 74.96 లక్షల మంది విద్యార్థులు, 3.32 లక్షల మంది ఉపాధ్యాయులు, కోటిన్నరకు పైగా తల్లిదండ్రులు, దాతలు, పూర్వ విద్యార్థులు పాల్గొననున్నారు. కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన పేరెంట్ టీచర్ సమావేశాలను ప్రభుత్వ బడుల్లోనూ నిర్వహించాలన్న మంత్రి నారా లోకేశ్ ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇది రెండో ముఖ్యమైన విద్యా సంబంధిత కార్యక్రమం.ఈ సమావేశం ద్వారా తమ పిల్లల చదువు, ప్రవర్తన, ఇతర నైపుణ్యాల పురోగతిని తల్లిదండ్రులు నేరుగా ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోనున్నారు. విద్యార్థుల సమగ్ర ప్రోగ్రెస్ కార్డులను ఈ సందర్భంగా తల్లిదండ్రులకు అందజేస్తారు. అంతేకాకుండా, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధన తీరుపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, సూచనలను ప్రభుత్వానికి తెలియజేసేందుకు ఇది ఒక చక్కటి వేదికగా ఉపయోగపడనుంది. ఈ కార్యక్రమాన్ని ఏటా పండుగ వాతావరణంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.



## కష్టసమయంలో అండగా నిలిచిన ప్రతిఒక్కరికి ధన్యవాదాలు

- **సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు**
- **కూటమి నేతలకు రుణపడి ఉంటానని వీడియో సందేశం**

**కోవూరు:**

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌కి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తనపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఖండిస్తూ, తనకు మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె వీడియో సందేశం ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ లకు ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. సభ్యసమాజం తలదించుకునేలా తనపై జరిగిన మాటల దాడిని ఖండిస్తూ అండగా నిలిచిన తెలుగుదేశం కుటుంబసభ్యులకు, ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. వీరితో పాటు మంత్రులు, ఎంపీలు, తోటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, పార్టీ నేతలకు పేరుపేరునా కృతజ్ఞతలు చెప్పారు. తన కోసం క్షేత్రస్థాయిలో పోరాడిన మహిళలకు, జిల్లావ్యాప్తంగా తరలివచ్చి సంఘీభావం ప్రకటించిన తన భర్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి అభిమానులకు, కోవూరు నియోజకవర్గ కూటమి నాయకులకు తాను రుణపడి ఉంటానని స్పష్టం చేశారు. మీడియా మిత్రులకు కూడా ఆమె ధన్యవాదాలు తెలిపారు. అందరి మద్దతుతో మనోధైర్యాన్ని కూడగట్టుకుని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రశాంతి రెడ్డి ఆ వీడియోలో భరోసా ఇచ్చారు.

# ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు

**మొదటిపేజీ తరువాయి**

పెరుగుతున్నాయన్నారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు సరిహద్దుల విస్తరణతో పాటు అదనంగా 790 ఎకరాల సేకరణకు కేబినెట్ ఆమోద ముద్ర వేసినట్లు తెలిపారు.

**జగన్ పర్యటనలో చనిపోయిన తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం**

రామాయపట్నంలో కొత్త పరిశ్రమలు వచ్చేందుకు భూసేకరణ చేపట్టనున్నట్లు పార్థసారథి పేర్కొన్నారు. ఇందుకోసం 5 బృందాల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు చెప్పారు. కుప్పం, దగదర్తి, శ్రీకాకుళంలో విమానాశ్రయాల అభివృద్ధికి హడ్కో నుంచి వెయ్యి కోట్ల రుణం తీసుకునేందుకు మంత్రిమండలి అంగీకారం తెలిపిందన్నారు. ఎయిర్‌పోర్టుల లీజుకు ఇచ్చి వచ్చిన ఆదాయంతో అప్పు తీర్చాలని నిర్ణయించినట్లు వివరించారు. సరకు రవాణా వాహనాలపై విధించిన గ్రీన్ టాక్స్‌ను రూ.1500 నుంచి రూ.3000ల వరకూ తగ్గించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జలజీవన్ మిషన్ వాటర్ సప్లై పేరిట ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడమేగాక దానికి రూ.10,00ల కోట్ల రుణ సమీకరణకు ఆమోదం తెలిపిందని పార్థసారథి వివరించారు. మార్క్ ఫెడ్ నుంచి మరో వెయ్యి కోట్లు తీసుకునేందుకు కేబినెట్ అంగీకరించిందని చెప్పారు. జగన్ హయాంలో వైసీపీ నేతలు నడిరోడ్డుపై గొంతుకోసి చంపిన తోట చంద్రయ్య కుమారుడు తోట వీరాంజనేయులుకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చేందుకు మంత్రిమండలి ఆమోద ముద్ర వేసినట్లు పార్థసారథి వివరించారు.



# దివ్యాంగుల క్రీడాకారులకు అండగా ఉంటాం: ఎంపీ చిన్ని

- **దివ్యాంగుల స్వర్ణాంధ్ర క్రికెట్ కప్ -2025 పోస్టర్ ఆవిష్కరణ**

**విజయవాడ :**

దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారుల అభివృద్ధి కోసం ఏసీఏ అన్ని విధాల ప్రోత్సహిస్తోందని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగుల కొరకు నిర్వహించనున్న స్వర్ణాంధ్ర ఇంటర్ డిస్ట్రిక్ జోనల్ ఇన్ క్లూజివ్ క్రికెట్ కప్ 2025 పోస్టర్ ను, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఎబెల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లవల్లి సూర్యనారాయణతో కలిసి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ డిఫరెంట్లీ ఎబెల్డ్ క్రికెట్ కమిటీ దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులకు నిర్వహించే స్వర్ణాంధ్ర ఇంటర్ డిస్ట్రిక్ జోనల్ ఇన్ క్లూజివ్ క్రికెట్ కప్ 2025 టోర్నమెంట్ ను జోన్ ల వారీగా ఆగస్టు నుంచి ప్రారంభిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ కి డిఫరెంట్లీ ఎబెల్డ్ క్రికెట్ కమిటీ చైర్మన్ యడ్లవల్లి సూర్యనారాయణ వివరించారు. గుంటూరు లో జరిగే సెంట్రల్ జోన్ టోర్నమెంట్ ఆగస్టు 8వ తేదీ నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, శ్రీకాకుళంలో జరిగే నార్త్ జోన్ టోర్నమెంట్ ఆగస్టు 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు, అనంతపుర్ లో జరిగే సౌత్ జోన్ టోర్నమెంట్ సెప్టెంబర్ 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. చివరగా విజయవాడలో స్వర్ణాంధ్ర ఇంటర్ డిస్ట్రిక్ జోనల్ ఇన్ క్లూజివ్ క్రికెట్ కప్ 2025 టోర్నమెంట్ జరుగుతుందని సూర్యనారాయణ ఎంపీ కేశినేని శివనాథ్‌కి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఫరెంట్లీ ఎబెల్డ్ క్రికెట్ కౌన్సిల్ సభ్యుడు కొండా సత్యవరప్రసాద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసన్నకుమార్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలి పురంధేశ్వరి



**అమరావతి:**

కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైసీపీ నేత ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి. వైసీపీ నాయకులకు మహిళలను కించపరచడం అలవాటుగా మారిపోయిందన్నారు. శాసనసభ లోపల, వెలుపల మహిళలను వ్యక్తిత్వ హననం చేయడం వైసీపీకి అలవాటైపోయిందన్నారు. ఆరుసార్లు ఎంఎల్ఏ గా గెలిచిన వ్యక్తి.. మహిళలను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు అన్నారు. సభ్య సమాజం ఆమోదించని సంఘటన ఇది అన్నారు. ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలు వారి తల్లికి, భార్యకి చూపించాలన్నారు. వాళ్ళు ప్రసన్నకుమార్ రెడ్డి గారి వ్యాఖ్యలు సరైనవే అంటే, నా డిమాండ్ ను వెనక్కు తీసుకుంటానని చెప్పారు. ఇప్పటికైనా ప్రసన్నకుమార్ రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని .. బేషరతుగా ప్రశాంతిరెడ్డికి క్షమాపణలు చెప్పాలని పురంధేశ్వరి డిమాండ్ చేశారు.

# లెనిన్ సెంటర్ పేరు మార్చాలి ఏపీ బీజేపీ అధ్యక్షుడు



**మొదటిపేజీ తరువాయి**

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. ముందుగా తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. లెనిన్‌సెంటర్‌లో విశ్వనాథ సత్యనారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లెనిన్‌సెంటర్ పేరు మార్చి విశ్వనాథ సత్యనారాయణ పేరు పెట్టాలని ఈ సందర్భంగా మాధవ్ డిమాండ్ చేశారు. భారత దేశానికి ఎలాంటి సంబంధం లేనప్పుడు లెనిన్ పేరు పెట్టాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మాధవ్‌కు పార్టీ నేతలు అభినందనలు తెలిపారు.



# సమ్మె సంపూర్ణం.. ఎరుపెక్కిన విజయవాడ

- **కదం తొక్కిన కార్మిక వర్గం**
- **వేలాది మంది ఎర్రసైన్యం ప్రదర్శన**

**విజయవాడ:**

భారత్ బంద్ బెజవాడలో సక్సెస్ అయింది. కార్మికుల సమ్మె విజయవంతమైంది. తమ విధులను బహిష్కరించి సమ్మెలో వేలాదిగా కార్మిక వర్గం పాల్గొంది. రైల్వే, బ్యాంకు, ఎల్ఐసి, వివిధ సంఘటిత, అసంఘటితరంగాల కార్మికులు వేలాదిగా సమ్మెలో పాల్గొన్నారు. విజయవాడ వన్ టౌన్ లోని రథం సెంటర్ నుంచి ఏలూరు రోడ్డు లెనిన్ సెంటర్ కు భారీ నిరసన ప్రదర్శన చేశారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, కనీస వేతనం 26వేలు ఇవ్వాలని, 10గంటల పని విధానాన్ని రద్దు చేయాలని, నూతన వ్యవసాయం మార్కెట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక, కర్షక ఐక్యత వర్ధిల్లాలంటూ పెద్దపెట్టున నినదించారు. సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం లెనిన్ సెంటర్లో జరిగిన భారీ బహిరంగ సభకు ఎ.ఐ.టి.యు.సి నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, సి.ఐ.టి.యు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు కె.దుర్గారావు అధ్యక్షత వహించారు. కేంద్ర కార్మిక సంఘాల రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ.. ఈ సమ్మె కేవలం కొసమెరుపు మాత్రమేనన్నారు. రానున్న రోజుల్లో బిజెపి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున యుద్ధం చేయాల్సి ఉందన్నారు. లేబర్ కోడ్లు రద్దు అయ్యే వరకు, కార్మిక చట్టాలు అమలయ్యే వరకు పోరాటం ఆగేది లేదన్నారు. బడా కార్పొరేట్ కంపెనీల కోసం వారికి అనుకూల చట్టాలను రూపొందిస్తున్నారని, కంపెనీల దోపిడీకి ద్వారాలు తెరిచారని విమర్శించారు. కార్మికుల, కర్షకుల సంక్షేమం, అభివృద్ధిని గాలికి వదిలేసారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలని దుయ్యబెట్టారు. ప్రభుత్వాలు ఉన్నది ప్రజల పాలన కోసమా? కంపెనీల శ్రేయస్సు కోసమా! అని ప్రశ్నించారు. పారిశ్రామిక రంగంలో, వ్యవసాయ రంగంలో స్వదేశీ, విదేశీ బడా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే ప్రభుత్వాలు చట్టాలు చేస్తున్నాయని మండిపడ్డారు. విశాల పేద ప్రజానీకాన్ని కూడగట్టుకొని సంఘటిత ఐక్య పోరాటాలు చేయటమే పరిష్కార మార్గమని నాయకులు వెల్లడించారు. రాబోయే రోజుల్లో సమరశీల ఉద్యమాల కోసం అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం ఎటువంటి ప్రాణత్యాగాలకైనా సిద్ధపడాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఈ బహిరంగ సభలో మాజీ మంత్రి, రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాధేశ్వరరావు, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సి.ఐ.టి.యు రాష్ట్ర అధ్యక్షులు ఎ.వి నాగేశ్వరరావు, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి ప్రసాద్, ఏఐయుటియుసి కె.సుధీర్, ఏఐఎఫ్ టియు(న్యూ) జాస్తి కిషోర్ బాబు, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, ఏఐసీసీటుయు రాష్ట్ర నాయకులు ఉదయ్ కిరణ్, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు, వైయస్సార్ టియు రాష్ట్ర అధ్యక్షులు పూనూరి గౌతంరెడ్డి, బ్యాంకు అసోసియేషన్ నాయకులు ఆర్.అజయ్ కుమార్, హెచ్ఎంఎస్ నాయకులు త్రినాథ్, జర్నలిస్ట్ నాయకులు ఎస్.వెంకటరావు, రైతు సంఘం నాయకులు వై కేశవరావు, యం.వెంకటరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా సిఐటియు అధ్యక్షులు ఎ.వెంకటేశ్వరరావు, సిఐటి జిల్లా ఉపాధ్యక్షులు దోనెపూడి కాశీనాథ్ తదితరులు ప్రసంగించారు. ఈ ప్రదర్శనకు మద్దతుగా సి.పి.ఎం పార్టీ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు నాయకత్వాన మద్దతు పలికారు.

# కృష్ణా, గోదావరికి మంత్రి నిమ్మల జలహారతి

- **పవిత్ర సంగమం దగ్గర మంత్రి నిమ్మల పూజలు**
- **జగన్‌పై తీవ్ర విమర్శలు చేసిన నిమ్మల**

**ఎన్టీఆర్ జిల్లా-ఇబ్రహీంపట్నం:**

కృష్ణా,గోదావరి జలాల పవిత్ర సంగమం దగ్గర పవిత్ర జలాలకు చీర, సారె సమర్పించి, జలహారతి నిర్వహించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, జగ్గయ్య పేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య , తదితరులు పాల్గొన్నారు. ఆసందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ .. నాడు పట్టిసీమ కాదు వట్టిసీమ అని జగన్ ఎద్దేవా చేశాడని విమర్శించారు. రూ.1300 కోట్లతో పట్టిసీమ నిర్మిస్తే, 201419లో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు కృష్ణాడెల్టాకు తరలించడం ద్వారా రూ. 50వేల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వం కనీసం ప్రాజెక్టుల నిర్వహణకు, గేట్లకు గ్రీజు పెట్టడానికి కూడా నిధులు ఇవ్వలేదన్నారు. శ్రీశైలం, ధవళేశ్వరం మరమత్తులు, నిర్వహణ కోసం రూ 350 కోట్లు నిధులు కేటాయించినట్లు చెప్పారు. గతేడాది బుడమేరు వరదలవల్ల పడిన 3 గండ్లను కలుపుతూ సిసి వాల్ నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే, జగన్ పాలన వల్ల ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వెంటిలేటర్ మీద ఉన్న ఆర్థిక వ్యవస్థకు చంద్రబాబు , పవన్ కళ్యాణ్, ప్రధాని మోదీల సహకారంతో ఆక్సిజన్ ఇచ్చి ఊపిరి పోస్తున్నారని పేర్కొన్నారు. జగన్ స్వంత తల్లిని, చెల్లిని ఏ విధంగా కించపరిచాడో, వైసీపీ నేత ప్రసన్న కుమార్ రెడ్డి కూడా అలానే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని దూషించాడని విమర్శించారు.





# రాజధాని రైతులతో మంత్రి నారాయణ భేటీ

- **సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి పెనమాకలో పర్యటన**
- **భూములిచ్చిన రైతులకు ప్లాట్ ల కేటాయింపుపై చర్చ**

**అమరావతి:**

రాజధాని గ్రామం పెనుమాక లో పర్యటించారు మంత్రి నారాయణ,సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు. స్థానిక అధికారులతో కలిసి రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులతో సమావేశమయ్యారు. ల్యాండ్ పూలింగ్ లో భూములిచ్చిన రైతులకు ప్లాట్ ల కేటాయింపుపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రితో సమావేశమైన రైతులు రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ ల కేటాయింపుపై తమ అభిప్రాయాలు తెలిపారు. రైతుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ప్లాట్ లు కేటాయించాలని అధికారులకు మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈసందర్భంగా అధికారులు రైతులకు కేటాయించే ప్లాట్‌ల వివరాలను వివరించారు.



# సూపరిపాలనలో అంతా సుభిక్షం

- **కమలాపురంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం**
- **స్థానిక ప్రజల సమస్యలను తక్షణమే తీర్చిన ఎమ్మెల్యే**

**కడప:**

కూటమి ఏడాది సూపరిపాలనలో ప్రజలంతా సంతోషంతో, సుభిక్షంగా ఉన్నారని చెప్పారు కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి. కమలాపురం నియోజకవర్గంలోని..వీరపునాయునిపల్లె మండలం గోనమాకులపల్లెలో సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి.. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికీ చంద్రబాబు పాలనలో సూపర్ సిక్స్ పథకాలు, పెన్షన్ ఉచిత గ్యాస్ తల్లికి వందనం అన్నా క్యాంటిన్ చెత్తపన్ను ఇంకా మ్యాని పోస్టు లోని అమలు చేసిన సంక్షేమం వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో అన్నదాత సుఖీభవ అమలు చేయబోతున్నామని, అగస్ట్ 15 మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయనున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేయడం వల్ల రాష్ట్రం ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక అన్నింటిని చక్కదిద్ది ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రజలు కూడా ఈ విషయాన్ని గ్రహించి ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా పథకాలు రాని కుటుంబాలకు అక్కడే అధికారులను పిలిచి పరిష్కారించారు. పరిష్కారం కానివి ఎలా చేస్తే పరిష్కారం అవుతాయన్న సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు , మండల నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన



- **వైసీపీ కార్యకర్తలను వేధించే పనిలో ప్రభుత్వం...**
- **వైసీపీ కార్యకర్త హోటల్ కూల్చివేతపై రవీంద్రనాథ్ రెడ్డి మండిపాటు**

**కడప:**

రాష్ట్రంలో దుర్మార్గమైన రాక్షస పాలన సాగుతోందని కడప జిల్లా వైసీపీ అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి మండిపడ్డారు. దువ్వూరు మండలం ఇడమడక గ్రామంలో హోటల్ కూల్చివేత వల్ల జీవనోపాధిని కోల్పోయిన వైయస్ఆర్సీపీ కార్యకర్త వీరభద్రుడు కుటుంబాన్ని మైదుకూరు మాజీ ఎమ్మెల్యేల శెట్టిపల్లి రఘురామిరెడ్డితో కలిసి అయన పరామర్శించారు. ఈ సందర్భం గా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో దుర్మార్గమైన రాక్షస పాలన సాగుతుందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టకుండా కూటమి ప్రభుత్వం వైయస్ఆర్సీపీ కార్యకర్తలను వేధించే పనిలో ఉందన్నారు. టిడిపి నేతలు వైయస్ఆ ర్సీపీ నాయకులు కార్యకర్తలను టార్గెట్ చేసి ఇబ్బంది పెడుతున్నారని మండిపడ్డారు. వీరభద్రుడు వైయస్ఆ ర్సపీ సానుభూతిపరుడు అనే కారణంతో అతని ధాబాను టీడీపీ ఎమ్మెల్యే చెప్పాడని అధికారులు కూల్చివేయడం దారుణంఅన్నారు. నేషనల్ హైవేకు 20 మీటర్ల దూరంలో ఉన్న ధాబాకు నేషనల్ హైవే వాళ్ళు నోటీసు ఇవ్వాలి గాని రెవెన్యూ వాళ్లు నోటీసులు ఇచ్చి వెంటనే కూల్చివేయడం రెడ్ బుక్ రాజ్యాంగం అమలుకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించారు. టీడీపీ రెడ్ బుక్ రాజ్యాంగ బాధిత కుటుంబాలకు వైయస్ఆర్సీపీ పార్టీ అండగా ఉంటుంది అని రవీంద్రనాథ్రెడ్డి భరోసా ఇచ్చారు.




# బొగ్గు, ఖనిజ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వర్క్ షాప్

- **ఈకార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**
- **కడప జిల్లా కలెక్టర్‌కు ఘన సన్మానం**

**న్యూఢిల్లీ:**

భారత ప్రభుత్వ బొగ్గు, ఖనిజ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యం లో జాతీయ స్థాయి వర్క్ షాప్ జరిగింది. న్యూఢిల్లీలో బుధవారం జరిగిన జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణ పై జాతీయస్థాయిలోవర్క్ షాప్ కార్యక్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు. ఈ వర్కుషాపులో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి, భారత ప్రభుత్వ ఖనిజ మంత్రిత్వ శాఖ కార్యదర్శి డిఎల్ కాంతారావు, వివిధ రాష్ట్రాల జిల్లా కలెక్టర్లు, గనులు మరియు భూగర్భ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ వర్కు షాపులో ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించారు. జిల్లా ఖనిజ క్షేత్ర నిధి సంస్థల నిర్వహణకై ప్రణాళిక మరియు అమలు అనే అంశం పై నియమించిన కమిటిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ మరియు ఇతర రాష్ట్రాల కలెక్టర్లు ఇచ్చిన ప్రజెంటేషన్ అంశాలపై ఇతర సభ్యుల నుండి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా భారత బొగ్గు మరియు గనుల మంత్రిత్వశాఖ వారు వై ఎస్ ఆర్ కడప జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ని జ్ఞాపికతో సత్కరించడం జరిగింది




# కడపలో కదం తొక్కిన ఎర్ర దండు

- **జిల్లా వ్యాప్తంగా భారీ ర్యాలీలు..నిరసనలు...**
- **ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ఆందోళనలు .....**

**కడప :**

భారత్ బంద్‌లో భాగంగా ఐక్య కార్మిక సంఘాలు కడపలో ఆందోళనకు దిగాయి. ఐక్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో కడప నగరం లోని స్థానిక సిఎస్ఐ చర్చి నుండి పెద్ద ర్యాలీ నిర్వహించారు. నగరంలోని సెవెన్ రోడ్స్ వద్ద నిర్వహించిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బండి. రామలింగారెడ్డి, యుటియుసి జిల్లా నాయకులు సుబ్బరాయుడు, టియుసిసి జిల్లా నాయకులు జయవర్ధన్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు లక్ష్మి రాజాలు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. బిజెపి మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని మండిపడ్డారు. లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కనీసం కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటీష్ కాలం నాటి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మికుల పని గంటలను సైతం పెంచుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక సంఘాల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. 73 షెడ్యూల్లోని కార్మికులు మునిసిపల్ అంగన్వాడి ఆశా తదితర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు కాక, ఉద్యోగ భద్రత లేక చిరు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వీరి సమస్యలపై నిరసన తెలుపుకొనే అవకాశం కోల్పోతారని,ఇది ఒక రకంగా దేశంలో నిర్బంధ నిరంకుశ విధానాలను అవలంభించడమేనని మండిపడ్డారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటో హమాలి వీధివిక్రయ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అప్పచెపుతూ ఆదాని అంబానీ వర్గాల వారికి పన్నులు తగ్గిస్తూ కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించకపోతే దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తాం అని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఐఎం కడప నగర కార్యదర్శులు వెంకటశివ, రామ్మోహన్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, ఏఐటీయూసీ నాయకులు లింగన్న, బ్రహ్మానంద రెడ్డి, నాగిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, సురేష్, వేణుగోపాల్, భాగ్యలక్ష్మి, నాగేంద్ర, సునీల్, ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధం జిల్లా నాయకురాలు శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# బూసిపాటికి దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానం



- **వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నూతనంగా నియామకం**
- **హర్షం వ్యక్తం చేసిన దళిత సంఘాలు**

**కడప:**

వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నూతనంగా నియమితులయ్యారు సీనియర్ నేత బూసిపాటి కిషోర్. ఈసందర్భంగా ఆయనను దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కడప నగరంలోని స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో అయనను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సోషియల్ వెల్ఫేర్ ఫైనాన్స్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, వైసీపీ మాజీ ఎస్సీ సెల్ ఛైర్మన్ వినోద్ కుమార్, వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్పోరేటర్లు బాబు, త్యాగరాజు, కమలాపురం మాజీ సర్పంచ్ దానం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కడప జిల్లా నుంచి నియమితులైన మొదటి దళిత నేత కిషోర్ అని, జిల్లా నేతకు ఇంతటి ప్రాధాన్యతనివ్వడం ద్వారా వైసీపీలో దళితులకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లయ్యిందన్నారు. కడప జిల్లా నేతకు అవకాశం కల్పించడం పట్ల దళిత సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాలు కప్పి అభినందించి స్వీట్లు పంచుకుని తమ హర్షాన్ని చాటుకున్నారు. అనంతరం వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన కిషోర్ బూసిపాటి మాట్లాడుతూ పార్టీకి తనను, తన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయిలో సంయుక్త కార్యదర్శిగా నియమించినందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ తనపై నమ్మకముంచి అప్పగించిన బాధ్యతలకు తప్పక న్యాయం చేస్తానన్నారు. పార్టీ తరుపున ప్రజల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు.

తన సేవలను గుర్తించి తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథరెడ్డి, ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి , మాజీ డిప్యూటి సిఎం అంజాద్ బాష, మేయర్ సురేష్ బాబు, మాజీ ఆర్టీసీ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, వల్లూరు మాజీ జడ్పీటీసీ వీరారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వైద్య విభాగం ఇసీ సభ్యులు డా. పెంచలయ్య, ఇతర నాయకులు మేసా ప్రసాద్, శ్రీరాములు, లారెన్స్, సంపత్, రమణ, కన్నయ్య, ప్రవీణ్, మహిళా సీనియర్ నాయకురాళ్ళు రత్నకుమారి, ఉపాధ్యక్షురాలు మల్లీశ్వరి, జ్యోతి, చైతల్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు ఎమ్మెల్సీ భూమిరెడ్డి



- **ఎలాంటి అనుమతులు లేకుండా ఆర్కిటెక్చర్ కళాశాల ప్రారంభించారు**
- **మీ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ప్రభుత్వంపై విమర్శలు**
- **జగన్ తప్పిదం వల్లే ఇప్పుడు విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరం**

**కడప:**

కడప జిల్లాలోని ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులను, వైసీపీ విద్యార్థి సంఘాలు విద్యార్థులను రెచ్చగొట్టి వారి జీవితాలతో వైసీపీ ఆడుకుంటోందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి విమర్శించారు. పులివెందులలోని ఆయన తన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఆర్కిటెక్చర్కళాశాల సంబంధించి 2020సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అనుమతులు కూడా లేవన్నారు. ఎలాంటి అనుమ తులు లేకుండానే కళాశాలను వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏర్పాటు చేశారన్నాని తెలిపారు. అనుమతులు లేకుండా కళాశాలను ఏ విధంగా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న వైయస్ జగన్మోహన్ రెడ్డి.. ఇప్పుడు ఆ నిందను కూటమి ప్రభుత్వంపై వేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అనుమతులు లేకుండానే ఆర్కిటెక్చర్ కళాశాలను తన బావమరిది కోసం ఏర్పాటు చేశారని ఇప్పుడు అపనిందను చంద్రబాబు నాయుడు పై మోపుతున్నారన్నారని మండిపడ్డారు. ఎటువంటి భవన సముదాయాలు కానీ ఫ్యాకల్టీ కానీ లేకుండానే కళాశాలను ఏర్పాటు చేసి వందలాదిమంది విద్యార్థులను అందులో చేర్చుకొని ఇప్పుడు వారి భవిష్య త్తుతో ఆటలాడుకుంటున్నారని జగన్మోహన్ రెడ్డిపై ఫైర్ అయ్యారు. కళాశాల విద్యార్థుల భవిష్యత్తును తప్పకుండా కాపాడతామని వారి సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు సమ్మెలు చేయకుండా చదువుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్తామని త్వరలోనే సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కూడా చూపుతామని ఆయన అన్నారు. ఎవరు కూడా వైసీపీ విద్యార్థి సంఘాల మాటలను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు సుబ్బారెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## AI విప్లవానికి గ్రాఫిటీ సహకారం..

# భారత్‌కు పిలుపు..!

**టీపీఎన్ ప్రతినిధి** : అమెరికాలో ఒక లెక్చర్ సందర్శన సందర్భంగా, హ్యూస్టన్ విశ్వవిద్యాలయంలో నా స్నేహితుడు మరియు సహోద్యోగి సియమియన్ ఫజ్‌ట్‌లోవిచ్‌తో ఒకరితో ఒకరు ఆసక్తికరమైన ట్యుటోరియల్ జరిగింది. సియమియన్ నన్ను తాను అభివృద్ధి చేసిన గ్రాఫిటీ అనే అద్భుతమైన సాఫ్ట్‌వేర్‌ను పరిచయం చేశాడు. ఈ ప్రోగ్రామ్ గ్రాఫ్ సిద్ధాంతంలో—నోడ్స్ మరియు ఎడ్జెస్ యొక్క నెట్‌వర్క్‌లను అధ్యయనం చేసే గణిత శాఖలో—కొత్త మరియు సాధారణం కాని ఊహాగానాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉంది. నాకు, గ్రాఫిటీ 1980లు మరియు 1990లలో గణితం మరియు కంప్యూటర్ సైన్స్ రంగాలలో కృత్రిమ మేధస్సు (AI) యొక్క తొలి రూపాలలో ఒకటిగా కనిపించింది.

**గ్రాఫిటీ యొక్క AI సామర్థ్యాలు**

గ్రాఫిటీ యొక్క స్వయంచాలక రీజనింగ్ మరియు సృజనాత్మక సమస్యా పరిష్కార సామర్థ్యాలు AI యొక్క పలు లక్షణాలను ప్రదర్శించాయి. 1992 నాటికి, సియమియన్ గ్రాఫిటీని రసాయన శాస్త్రానికి కూడా విస్తరించాడు, ఇది అంతర్జాతీయ గుర్తింపు పొందింది. న్యూయార్క్ టైమ్స్ ఈ సాఫ్ట్‌వేర్ ప్రభావాన్ని హైలైట్ చేస్తూ ఒక కథనాన్ని ప్రచురించింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ గ్రాఫ్ సిద్ధాంతకారులు గ్రాఫిటీ ద్వారా ఉత్పత్తి చేయబడిన ఊహాగానాల రుజువులను ప్రచురించడం ప్రారంభించారు. ప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞుడు పాల్ ఎర్డోస్ కూడా ఈ ఊహాగానాలపై పనిచేశాడు, ఈ సాఫ్ట్‌వేర్ యొక్క ప్రాముఖ్యతను రేఖాంకితం చేశాడు.

AI విప్లవానికి గ్రాఫిటీ యొక్క సహకారం

ఈ రోజు మనం చూస్తున్న AI విప్లవం, గ్రాఫిటీ వంటి తొలి వేదికలకు చాలా రుణపడి ఉంది, ఇవి డేటా సైన్స్, న్యూరల్ నెట్‌వర్క్‌లు, మరియు మెషిన్ లెర్నింగ్‌లలో తర్వాతి అభివృద్ధులకు బీజాలు నాటాయి. భారతదేశం ఒకప్పుడు సాఫ్ట్‌వేర్ అభివృద్ధిలో వాగ్దానాన్ని చూపించినప్పటికీ, ప్రేరణ లేని పాఠ్యప్రణాళికలు మరియు బౌద్ధిక ధైర్యం లేకపోవడం వల్ల AI విస్ఫోరణంలో పెద్దగా వెనుకబడిపోయింది. దశాబ్దాలుగా ఈ నిర్లక్ష్యం భారతదేశానికి భారీ ధరను చెల్లించవచ్చు.

**AI యొక్క ప్రస్తుత పురోగతి**

ప్రస్తుత AI విస్ఫోరణం ఒకవైపు ఉత్తేజకరంగా, మరోవైపు భయానకంగా ఉంది. మే మధ్యలో, యూకే మరియు యూఎస్ నుండి నిపుణులతో సహా సుమారు 30 ప్రముఖ గణిత శాస్త్రజ్ఞులు కాలిఫోర్నియాలోని బర్కిలీలో రహస్యంగా సమావేశమై, అత్యాధునిక రీజనింగ్ చాట్‌బాట్‌ను పరీక్షించారు. వర్జీనియా విశ్వవిద్యాలయం నుండి కెన్ ఒనో నాయకత్వంలో, ఈ గణిత శాస్త్రజ్ఞులు రెండు రోజుల పాటు AIకి ప్రొఫెసర్‌స్థాయి సవాలు సమస్యలను ఉంచారు. ఆశ్చర్యకరంగా, చాట్‌బాట్ ప్రతి సమస్యను పరిష్కరించింది, ఒక కష్టమైన PhDస్థాయి ప్రశ్నను కేవలం పది నిమిషాల్లో పరిష్కరించింది—ఇది అత్యంత ప్రతిభావంతమైన మానవ మేధావులను కూడా ఆకట్టుకునే సామర్థ్యం.

**AI యొక్క సవాళ్లు**

OpenAI యొక్క o4మినీ మోడల్‌పై ఆధారపడిన ఈ AI, అనేక మానవ నిపుణులను అధిగమించే అధునాతన రీజనింగ్ సామర్థ్యాన్ని ప్రదర్శించింది. అయితే, ఒక ప్రమాదం ఉంది: దాని ఆత్మవిశ్వాసం మరియు అధికారిక స్పందనలు కొందరిని భయపెట్టవచ్చు, దాని పరిష్కారాలను పరిశీలన లేకుండా అంగీకరించేలా చేయవచ్చు. ఒనో హాస్యంగా చెప్పినట్లు, చాట్‌బాట్ “భయపెట్టడం ద్వారా రుజువు” చేయడంలో నైపుణ్యం సాధించింది.

భారత్‌కు ఒక పిలుపు

గణిత శాస్త్రజ్ఞులకు మరియు సమాజానికి, ఈ క్షణం ఉత్తేజకరమైనది మరియు అస్థిరమైనది. ఒకప్పుడు అభివృద్ధి చేయడానికి మరియు సాధన చేయడానికి దశాబ్దాలు పట్టిన సాధనాలు ఇప్పుడు క్షణాల్లో సంక్లిష్ట సమస్యలను పరిష్కరిస్తున్నాయి. తన గొప్ప బౌద్ధిక సంప్రదాయంతో, భారతదేశం ఈ సవాలును స్వీకరించాలి మరియు AIని కేవలం సాధనంగా కాక, ఆవిష్కరణలో భాగస్వామిగా స్వీకరించాలి, లేకపోతే ఈ రూపాంతర యుగంలో మరింత వెనుకబడి పోయే ప్రమాదం ఉంది.







# సవాళ్లకు దీటుగా యంగ్ టీమిండియా..!

**టీపీఎన్ ప్రతినిధి | బర్మింగ్‌హామ్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్ సాధించిన ఉత్తేజకర విజయం తర్వాత ఒక చర్చ రగిలింది: కొత్త టీమ్ ఇండియా చివరకు తన శిఖరాన్ని చేరుకుంటోందా? ఈ యువ జట్టు చుట్టూ ఉన్న కథనం తీవ్రంగా మారింది—లీడ్స్‌లో ఓటమి తర్వాత తీవ్ర విమర్శలు, ఆపై బర్మింగ్‌హామ్‌లో చారిత్రక విజయం తర్వాత ఉత్సాహపూరిత ప్రశంసలు. అయితే, తీవ్ర భావోద్వేగాలలో కొట్టుకుపోకుండా, వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించే సమయం ఇది.

**లీడ్స్ ఓటమి మరియు ఎడ్జ్‌బాస్టన్ పునరాగమనం**

లీడ్స్ టెస్ట్ ఓటమి శుభమన్ గిల్ మరియు జట్టుపై అభిమానులు మరియు విమర్శకులలో నిరాశను కలిగించింది. అయితే, క్రికెట్ అనేది గెలుపోటములతో నిండిన క్రీడ. ముఖ్యంగా, రెండవ టెస్ట్‌లో భారత్ యొక్క ప్రతిస్పందన స్థిరత్వం, నేర్చుకోవడం, మరియు అనుసరణను చూపించింది. సాపేక్షంగా కొత్త కెప్టెన్ నాయకత్వంలోని ఈ యువ జట్టు గొప్ప సామర్థ్యాన్ని కలిగి ఉంది. రవీంద్ర జడేజా తప్ప, ప్రస్తుత లైనప్‌లోని ప్రతి ఆటగాడు 34 ఏళ్ల కంటే తక్కువ వయస్సు కలిగినవాడు, ఇది రాబోయే సంవత్సరాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే జట్టును సూచిస్తుంది.ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం: ఒక సవాలు

ఉపఖండ జట్లకు ఇంగ్లండ్‌లో టెస్ట్ సిరీస్ గెలవడం అత్యంత కష్టమైన సవాలు. భారత్ చివరిసారిగా 2007లో రాహుల్ ద్రవిడ్ నాయకత్వంలో ఇంగ్లండ్‌లో సిరీస్ గెలిచింది. ఎంఎస్ ధోని మరియు విరాట్ కోహ్లీ వంటి దిగ్గజాలు కూడా అక్కడ సిరీస్ విజయాన్ని సాధించలేకపోయారు. ఈ సందర్భంలో, రెండవ టెస్ట్ విజయం మరింత ఆకట్టుకుంది—భారత్ అరుదైన అవే విజయాన్ని సాధించడమే కాక, ఇంగ్లండ్‌ను 336 పరుగుల తేడాతో ఘోరంగా ఓడించింది, ఇది రన్స్ పరంగా వారి అతిపెద్ద అవే విజయం. రికార్డు సృష్టించిన బ్యాటింగ్ మరియు బౌలింగ్ ఈ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా 1014 పరుగులు సాధించింది, ఇది ఒక టెస్ట్ మ్యాచ్‌లో భారత జట్టు 1000 రన్స్ మార్కును దాటిన మొదటి సందర్భం. శుభమన్ గిల్ చరిత్ర సృష్టించాడు, ఒకే మ్యాచ్‌లో డబుల్ సెంచరీ మరియు సెంచరీ సాధించిన తొలి టెస్ట్ ఆటగాడిగా నిలిచాడు. రిషభ్ పంత్ మరియు రవీంద్ర జడేజా కూడా కీలక సమయాల్లో ఫామ్‌లోకి వచ్చారు.

ఇంగ్లండ్ బౌలింగ్ దాడి, జోఫ్రా ఆర్చర్, ఒల్లీ స్టోన్, మరియు మార్క్ వుడ్ వంటి కీలక బౌలర్లు లేకపోవడంతో సతమతమైంది. భారత బౌలర్లు, స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా లేనప్పటికీ, అద్భుతంగా రాణించారు. ఆకాశ్ దీప్ మరియు మహ్మద్ సిరాజ్ ఇంగ్లండ్ బ్యాటింగ్ లైనప్‌ను ధ్వంసం చేశారు. ఆకాశ్ దీప్ రెండు ఇన్నింగ్స్‌లలో 10 వికెట్లు తీసి, ఇంగ్లండ్‌లో భారత బౌలర్‌కు ఉత్తమ బౌలింగ్ గణాంకాలను నమోదు చేశాడు. ఫ్లాట్ పిచ్‌పై వారి క్రమశిక్షణతో కూడిన, అవిశ్రాంత బౌలింగ్ ఒక మాస్టర్‌క్లాస్‌గా నిలిచింది. రాబోయే సవాళ్లుఇంగ్లండ్ దెబ్బతిన్నప్పటికీ, వారు తిరిగి బలంగా వస్తారని భావిస్తున్నారు. మూడవ టెస్ట్‌కు ఆర్చర్ తిరిగి రావచ్చు మరియు ఇతర బౌలర్లు ఫిట్‌నెస్ సాధించవచ్చు, ఇది ఆతిథ్య జట్టుకు బలాన్ని ఇస్తుంది. ఫ్లాట్ పిచ్‌లు మరియు కీలక ఆటగాళ్ల అనుపస్థితి ఇంగ్లండ్ యొక్క లోతును పరీక్షించాయి. అయినప్పటికీ, మూడు టెస్ట్‌లు మిగిలి ఉండటంతో, సిరీస్ ఫలితం ఇంకా నిర్ణయం కాలేదు. భారత్‌కు ఆత్మవిశ్వాసం ఉవ్వెత్తున ఉంది, చారిత్రక విజయం మరియు పూర్తిగా ఫిట్‌గా ఉన్న బుమ్రా తిరిగి వస్తే సిరీస్‌ను మరింత అనుకూలంగా మార్చవచ్చు.

**యువ జట్టు యొక్క బలం**

ఈ యువ భారత జట్టు ధైర్యం, ప్రతిభ, మరియు ఓటముల నుండి నేర్చుకునే సామర్థ్యాన్ని చూపించింది. ఎడ్జ్‌బాస్టన్ విజయం కేవలం స్కోర్‌బోర్డ్‌పై విజయం మాత్రమే కాదు; ఇది ఒక మానసిక బ్రేక్‌త్రూ, ఇంగ్లండ్ యొక్క దీర్ఘకాల ఆధిపత్యాన్ని భేదించింది. ఈ ఫామ్‌ను కొనసాగించి సిరీస్ విజయాన్ని సాధించగలరా అనేది చూడాల్సి ఉంది. కానీ ఒక విషయం స్పష్టం—ఈ టీమ్ ఇండియా తన లయను కనుగొంటోంది, ప్రపంచంలోని ఉత్తమ జట్లను వారి సొంత మైదానంలో సవాలు చేయడానికి సిద్ధంగా ఉంది.

# మెగా PTM 2.0 సరికొత్త అధ్యాయానికి నాంది..!

ఈ రోజు ప్రపంచంలో, వ్యక్తులు తమ "జీవన ప్రయాణాన్ని రూపొందించుకోవాలి" అనే ఆలోచనను ప్రోత్సహిస్తున్నారు, మరియు ఈ విజయానికి సూక్ష్మమైన ప్రణాళిక కీలకం. గత కొన్ని దశాబ్దాలుగా, "విద్యార్థి జీవితాన్ని రూపొందించడం" అనే భావన గణనీయమైన ఆదరణ పొందింది. అనేక ప్రైవేట్ విద్యా సంస్థలు, వ్యక్తిగతీకరించిన మార్గమే పిల్లల వ్యక్తిగత వృద్ధికి ఏకైక మార్గమని ఒప్పించే ప్రయత్నంలో ఉన్నాయి.

అయితే, వాస్తవం భిన్నంగా ఉంది. మధ్య మరియు తక్కువ ఆదాయ కుటుంబాల తల్లిదండ్రులు ఈ కథనానికి ఆకర్షితులై, దురదృష్టవశాత్తూ, ఇది ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసింది. అయినప్పటికీ, ఉచిత ఆరోగ్యం మరియు విద్య అనేవి మంచి పాలన యొక్క ప్రాథమిక నిబద్ధతలుగా మిగిలాయి.

బాహ్య దృక్కోణం నుండి చూస్తే, ఆంధ్రప్రదేశ్‌లో గణనీయమైన సంఖ్యలో యువత ప్రతిష్టాత్మక IITలు మరియు ఇతర జాతీయ సంస్థలలో స్థానం సంపాదించారు. అయినప్పటికీ, ఈ సంస్థలను చేరాలని కలలు కనే విద్యార్థులలో వాస్తవంగా లక్ష్యాన్ని సాధించే వారి శాతం 3% కంటే తక్కువగా ఉంది, ఎందుకంటే చాలా మంది కోచింగ్ సంస్థల్లో చేరుతారు. ఇది తల్లిదండ్రులకు ఆర్థిక భారాన్ని మరియు యువతకు నిరాశను తెచ్చిపెడుతుంది, ఫలితంగా వారు రాష్ట్రంలోని ప్రైవేట్ వృత్తిపరమైన సంస్థల వైపు మొగ్గు చూపుతారు. ఈ మార్గాన్ని ఎంచుకున్న వారు తరచుగా తక్కువ జీతం గల ఉద్యోగాలతో జీవనం సాగించడానికి అవిశ్రాంత పోరాటం చేయాల్సి వస్తుంది.

**మెగా PTM 2.0: ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడం**

ఈ రోజు జరుగుతున్న మెగా పేరెంట్‌టీచర్ మీటింగ్ (PTM) ప్రభుత్వ విద్యను పునరుజ్జీవనం చేయడానికి మరియు ప్రజల విశ్వాసాన్ని పునర్నిర్మించడానికి ఒక ఉద్దేశపూర్వక మరియు కీలకమైన చర్య. రెండు మెగా PTMలు మరియు రెండు త్రైమాసిక పేరెంట్‌టీచర్ సమావేశాల షెడ్యూల్, రాష్ట్ర భవిష్యత్ కార్యక్రమాలకు సంతోషకరమైన, విజయవంతమైన, మరియు సామర్థ్యవంతమైన మానవశక్తిని తీర్చిదిద్దేందుకు ఒక బాగా రూపొందిన వ్యూహాన్ని సూచిస్తుంది. ఇటువంటి చురుకైన చర్యలు లేకపోతే, మహారాష్ట్ర మరియు కర్ణాటక వంటి రాష్ట్రాలు ఎదుర్కొన్న సవాళ్లను ఆంధ్రప్రదేశ్ కూడా ఎదుర్కోవచ్చు, ఇక్కడ ఆర్థిక వృద్ధి మరియు సంపద దిగుమతి చేసుకున్న నైపుణ్య కార్మికులపై మరియు స్థానికుల నుండి తిరుగుబాట్లపై ఆధారపడుతున్నాయి.

**తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయుల సహకారం**

ఈ ప్రయత్నంలో, సమాచారం కలిగిన తల్లిదండ్రి ప్రధాన పాత్ర పోషిస్తారు, మరియు తల్లిదండ్రులుఉపాధ్యాయుల సంయుక్త ప్రయత్నం పిల్లల భవిష్యత్తును వారి సహజ బలాలను ఉపయోగించుకుని, బలహీనతలను సవరించే విధంగా రూపొందించడంలో కీలకం. ఈ సహకారం సాంప్రదాయ విద్యను అధిగమిస్తూ, వ్యక్తిగత అభివృద్ధి ప్రయాణాన్ని ప్రోత్సహిస్తుంది, ఇది అభివృద్ధి చెందిన దేశానికి అవసరమైన మానవ వనరులను నిర్మించడానికి ఆధారం.

ప్రభుత్వ విద్యలో పునరుజ్జీవనం

మన ప్రభుత్వ విద్యా వ్యవస్థ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క విఘాతకర శక్తి మరియు జనరేషన్ Z యొక్క సూక్ష్మ ప్రాధాన్యతలతో గుర్తించబడిన గ్లోబల్ యుగంలో ఎప్పుడో ఆలస్యమైన పునరుజ్జీవనాన్ని గుర్తించింది. ప్రతి విద్యార్థి యొక్క పురోగతిని సంపూర్ణంగా సమీక్షించడం ద్వారా, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు సహకరించి విద్యార్థి యొక్క అభ్యాస శైలి, బలాలు, మరియు బలహీనతలను సమగ్రంగా అర్థం చేసుకోవచ్చు. ఈ సహకార దృష్టి విజయాన్ని నిర్ధారిస్తుంది మరియు సరైన కెరీర్ ఎంపికలను సమాచారం చేస్తుంది, ఇంటిలో మరియు పాఠశాలలో వ్యక్తిగతీకరించిన మద్దతును అందిస్తుంది. ఈ సమన్వయం విద్యా పనితీరును మెరుగుపరుస్తుంది, ఉన్నత గ్రేడ్‌లను సాధిస్తుంది, మరియు జీవితకాల అభ్యాస ప్రేమను నాటుతుంది.

**హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్**

ఈ రోజు సమావేశం యొక్క ప్రధాన లక్షణాలలో ఒకటి, రాష్ట్ర విద్యా శాఖ రూపొందించిన విద్యార్థి యొక్క హోలిస్టిక్ ప్రోగ్రెసివ్ కార్డ్ సమీక్ష. ఇది కేవలం విద్యా సమీక్షతో పాటు, విద్యార్థి యొక్క అకడమిక్ కాని, పాఠ్యేతర, మానసిక, మరియు శారీరక ఆరోగ్యాలను సమగ్రంగా అందిస్తుంది, ఇది విద్యార్థిని నిర్వచించడానికి మరియు భవిష్యత్తును రూపొందించడానికి ఒక ముఖ్యమైన మైలురాయి.

మానసిక శ్రేయస్సు మరియు కెరీర్ ఎంపికలు

ఈ సంవత్సరం, సమగ్ర శిక్షా ఆంధ్రప్రదేశ్ యొక్క చురుకైన విద్యా నిర్వహణ బృందం కింద నియమించబడిన ఇన్‌హౌస్ శిక్షణ పొందిన మనస్తత్వవేత్తలు మరియు కెరీర్ నిపుణుల ద్వారా రాష్ట్రం మానసిక శ్రేయస్సు మరియు సమాచార కెరీర్ ఎంపికలను ప్రాధాన్యత ఇస్తోంది. ఈ రోజుల్లో చిన్న, న్యూక్లియర్ కుటుంబాలలో, ఇంటి మరియు పాఠశాల మధ్య స్థిరమైన సందేశాలు మరియు వ్యూహాలు చాలా ముఖ్యం. ఇవి పిల్లలకు సానుభూతి, స్థిరత్వం, ఆత్మవిశ్వాసం, సాంస్కృతిక విలువలు, మరియు సమర్థవంతమైన సంభాషణ వంటి కీలకమైన సామాజికమానసిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడంలో సహాయపడతాయి. ఈ సమన్వయ విధానం కుటుంబాలు మరియు పాఠశాలలకు సమాచార నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని ఇస్తుంది, పిల్లలు సవాళ్లను ఎదుర్కోవడానికి, ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచడానికి, మరియు వైవిధ్యమైన సామాజిక సెట్టింగులలో వృద్ధి చెందడానికి సన్నద్ధం చేస్తుంది.

పేరెంట్‌టీచర్ సమావేశాల లక్ష్యాలు

పేరెంట్‌టీచర్ సమావేశాల యొక్క ప్రధాన ఫలితాలను స్థిరత్వం, వనరుల విస్తరణ, మరియు సానుకూల పాఠశాల సంస్కృతిగా నిర్వచించవచ్చు.

LEAP: విద్యా శ్రేష్ఠతను నడిపించే సాధనం

ఈ అన్ని ప్రయత్నాలు LEAP (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) అనే బలమైన అప్లికేషన్ ద్వారా ఖచ్చితంగా పర్యవేక్షించబడుతున్నాయి, ఇది పాఠశాల నిర్వహణ మరియు ప్రణాళిక కోసం రూపొందించబడింది. అన్ని పురోగామి దేశాలు నాణ్యమైన డేటాపై ఆధారపడినట్లే, LEAP ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యా శ్రేష్ఠతను నడిపించి, బలమైన మరియు ఆర్థికంగా స్థిరమైన భవిష్యత్తును నిర్ధారిస్తుంది. గుర్తుంచుకోండి, విద్య అందరికీ, మరియు ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం ఈ హక్కులను నిర్ధారిస్తుంది.

**గమనిక: ఈ కథనం రచయిత యొక్క దృక్కోణం మాత్రమే.**



**రామ్ కమల్,**
**సోషల్ ఇంజినీర్, సమగ్ర విద్య సలహాదారు,ఏపీ**

# రాజ్ థాకరే వ్యూహం..ఇరకాటంలో ఉద్ధవ్

**టీపీఎన్, ముంబై :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన దాదాపు 10% ఓట్లను, 20 సీట్లను సాధించింది. రాజ్ థాకరే పార్టీ ఎంఎన్ఎస్ తన ఖాతాను కూడా తెరవలేకపోయింది. రాజ్ థాకరే కుమారుడు కూడా ఎన్నికల్లో ఓడిపోయాడు. బిఎంసి ఎన్నికలకు ముందు, మరాఠీహిందీ వివాదం కారణంగా, థాకరే సోదరులిద్దరూ ఒకే వేదికపైకి వచ్చారు, కానీ రాజ్ థాకరే మారుతున్న స్వరం మళ్ళీ ఉద్ధవ్‌ను ఇబ్బందుల్లో పడేసింది. మరాఠీహిందీ భాషా వివాదంపై ముంబైలో జరిగిన రాజకీయ గందరగోళాన్ని సద్వినియోగం చేసుకోవడానికి, రాజ్ ,ఉద్ధవ్ థాకరే 20 సంవత్సరాల తర్వాత వేదికపైకి వచ్చారు. ఇద్దరు సోదరుల మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చినట్లు అనిపించింది. మరాఠీ భాష కోసం మేము ఎంతకైనా వెళ్తామని ఉద్ధవ్ అన్నారు. కానీ రాజ్ థాకరే అకస్మాత్తుగా తన వ్యూహాన్ని మార్చుకున్నాడు. ఏ కార్యకర్త లేదా నాయకుడు తనను అడగకుండా మీడియాతో మాట్లాడొద్దని రాజ్ థాకరే MNS కార్యకర్తలకు ట్వీట్ చేశారు. సోషల్ మీడియాలో కూడా ఎవరూ ఏమీ పోస్ట్ చేయొద్దని సూచించారు. ఒక విధంగా రాజ్ థాకరే హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని అంతం చేశారని అర్ధమవుతోంది. ఆయన హిందీ వ్యతిరేక ఉద్యమాన్ని పూర్తిగా ఆపకపోవచ్చు.. కానీ ఆయన వ్యూహం ఖచ్చితంగా మరాఠీహిందీ భాషా వివాదంలో కొత్త మలుపు తీసుకుంది.

గత కొన్ని రోజులుగా ముంబైలో హిందీ మాట్లాడేవారిని MNS కార్యకర్తలు కొడుతున్న తీరు కారణంగా దేశంలో వాతావరణం వేడెక్కిందని స్పష్టంగా తెలుస్తుంది. ర్యాలీలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే కూడా మరాఠీ భాష కోసం ఏ మేరకు అయినా వెళ్తానని చెప్పారు. కానీ రాజ్ థాకరే అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంపై కొత్త చిక్కులు వచ్చి పడే అవకాశం ఉంది.

**ఉద్ధవ్ థాకరే ఎక్కడా కనిపించడం లేదు**

2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, ఉద్ధవ్ ఠాక్రేకు చెందిన శివసేన (UBT) 95 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. కానీ 20 స్థానాల్లో మాత్రమే గెలిచింది. ఇది శివసేన UBTకి పెద్ద ఎదురుదెబ్బ. మహాయుతి కూటమి (BJP, షిండే వర్గం, అజిత్ పవార్ NCP) 230+ స్థానాలను గెలుచుకోవడం ద్వారా వారిని అణగదొక్కింది. షిండే అసలు పార్టీ, ఎన్నికల చిహ్నాన్ని తీసుకున్న తర్వాత శివసేనకు మరిన్ని సీట్లు రావడంతో, మహారాష్ట్ర రాజకీయాల్లో ఉద్ధవ్ రాజకీయ ఔచిత్యం ప్రమాదంలో పడినట్లు అనిపించింది. దీని తర్వాత 2025 జూలై 5న జరిగిన మరాఠీ విజయ్ ర్యాలీలో ఉద్ధవ్, రాజ్ థాకరేతో వేదికను పంచుకున్నారు. ఈ చర్య మరాఠీ గుర్తింపు రక్షకుడిగా తన ఇమేజ్‌ను బలోపేతం చేసుకునే ప్రయత్నం. కానీ దానికి విరుద్ధంగా జరిగింది. హిందీ వ్యతిరేక వైఖరి మరాఠీయేతర ఓటర్లను ఆగ్రహానికి గురిచేసింది.

**రాజ్ థాకరే కోల్పోయేది ఏమీ లేదు,**

రాజ్ ఠాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ సేన (MNS) లకు, మరాఠీహిందీ వివాదం ఖచ్చితంగా ఒక రాజకీయ అవకాశంగా మారింది. ఎందుకంటే వారు కోల్పోవడానికి ఏమీ లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో, ఆయన పార్టీ ఓట్ల శాతం కేవలం ఒక శాతం కంటే ఎక్కువ. వారు ఒక్క సీటు కూడా గెలవలేకపోయారు. ఆయన కుమారుడు కూడా తన స్థానాన్ని కోల్పోయాడు. దీనికి విరుద్ధంగా 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో, శివసేన UBT 10.03% ఓట్ల వాటాను పొందింది. పార్టీ అత్యంత ప్రతికూల సమయాల్లో కూడా 20 సీట్లను గెలుచుకోగలిగింది. కానీ ఈనెల 5న జరిగిన మరాఠీ విజయ్ ర్యాలీలో, రాజ్ థాకరే హిందీని మూడవ తప్పనిసరి భాషగా చేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడం ద్వారా మరాఠీ గుర్తింపు రక్షకుడి ఇమేజ్‌ను సృష్టించాడు. ఇది అతని ప్రధాన మరాఠీ ఓటర్ల స్థావరాన్ని బలపరుస్తుంది, ఇది MNS గుర్తింపుకు ఆధారం. అతి పెద్ద విషయం ఏమిటంటే, ఈ ర్యాలీలో, మరాఠీ గుర్తింపు రక్షకుడిగా అతని ఇమేజ్ అతని సోదరుడు ఉద్ధవ్ థాకరే కంటే ఎక్కువగా మారింది.

**ఆదిత్య థాకరే తన సీటును కాపాడుకోవడం కష్టమవుతుంది.**

హిందీ మాట్లాడేవారిని కొట్టాల్సిన అవసరం ఏమిటో ఇద్దరు నాయకులు ఒక్కసారి కూడా తమ కార్యకర్తలకు చెప్పలేదు. కానీ తన కుమారుడు ఆదిత్య థాకరే వర్లి అసెంబ్లీ వంటి పట్టణ ప్రాంతాల్లో, హిందీ మాట్లాడే , మరాఠీ కాని ఓటర్లు (సుమారు 3040%) ముఖ్యమని ఉద్ధవ్ థాకరే మర్చిపోయారు. థాకరే సోదరుల హిందీ వ్యతిరేక వైఖరి ఇక్కడ ఆగ్రహాన్ని పెంచుతుంది.


**కూటమిలో చీలిక వస్తుందా?**

శివసేన యుబిటి మహావికాస్ అఘాడిలో భాగం. కాంగ్రెస్, ఎన్‌సిపి కూడా ఈ కూటమిలో భాగం. కానీ ఉద్ధవ్ థాకరే, రాజ్ థాకరే కలిసి వచ్చి మరాఠీ విజయ్ ర్యాలీలో హిందీ వ్యతిరేక వైఖరి తీసుకున్న తీరు మిత్రదేశాలను అసౌకర్యానికి గురిచేసింది. కాంగ్రెస్, ఎన్‌సిపి ర్యాలీకి దూరంగా ఉన్నాయి. సుప్రియా సులే అక్కడికి చేరుకున్నారు కానీ వేదికపై కనిపించలేదు. దీని కారణంగా కూటమిలో చీలిక వచ్చే అవకాశం పెరిగింది.




## ఛంగూర్ బాబా అరెస్ట్..
## 40 ఖాతాల్లో రూ. 106 కోట్లు..!





**టీపీఎన్, బలరాంపూర్ :** ఉత్తర ప్రదేశ్‌లో మత మార్పిడి ముఠాకు సూత్రధారి అయిన జమాలుద్దీన్ అలియాస్ ఛంగూర్ బాబా సామ్రాజ్యంలో పలు రాష్ట్రాలకు విస్తరించింది. ఒకప్పుడు తన సైకిల్‌పై ఉంగరాలు, తాయెత్తులు అమ్మేవాడు. ఇప్పుడు అతని దగ్గర 40 బ్యాంకు ఖాతాల్లో రూ. 106 కోట్ల విలువైన నిధులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్ జిల్లాలో ఇటీవల బయటపడిన మతమార్పిడి రాకెట్‌కు సంబంధించి ఛంగూర్ బాబా, అతని సన్నిహితురాలు నీతు అలియాస్ నస్రీన్‌లను లక్నోలోని ఒక హోటల్‌లో అరెస్టు చేశారు. జమాలుద్దీన్ అరెస్టు అయినప్పటి నుండి అతని చుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది."పేద, నిస్సహాయ కార్మికులు, బలహీన వర్గాలు, వితంతువు మహిళలను ప్రోత్సాహకాలు, ఆర్థిక సహాయం, వివాహ హామీలతో ఆకర్షించడం లేదా బెదిరింపుల ద్వారా బలవంతంగా మత మార్పిడికి ప్రోత్సహించేవాడని పోలీసులు తెలిపారు. ఈ ముఠాకు ఏదైనా ఉగ్రవాద సంబంధాలు ఉన్నాయా అని యుపి ఉగ్రవాద నిరోధక దళం (ఏటిఎస్) కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ ముఠాపై కేసు నమోదు చేసిన యుపి స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్) కూడా ఈ విషయంపై దర్యాప్తు చేస్తోంది. బలరాంపూర్‌లోని ఈ ముఠాతో సంబంధం ఉన్నట్లు భావిస్తున్న ఇతర వ్యక్తులను కూడా స్థానిక పోలీసులు విచారిస్తున్నారు.

ఈ మూడు ఏజెన్సీలతో పాటు, పీర్ బాబా అని కూడా పిలువబడే ఛంగూర్ బాబా ఆదాయ మార్గాలను తెలుసుకోవడానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) కూడా కేసు నమోదు చేసింది. పలు బ్యాంకు ఖాతాల్లో జమ అయిన డబ్బును ఎవరు పంపారు, ఏ కారణాల వల్ల పంపారు అనే దానిపై ఏజెన్సీ దర్యాప్తు చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని రెహ్రా మాఫీ గ్రామానికి చెందిన ఛంగూర్ బాబా సామ్రాజ్యం మొత్తం నేపాల్ సరిహద్దులో ఉన్న బలరాంపూర్ జిల్లాలోని ఉత్తరౌలా ప్రాంతంలో ఉంది. బాబాకు పలు రాష్ట్రాల్లో కూడా అనేక ఆస్తులు ఉన్నాయి. ఒకటి మహారాష్ట్రలోని లోనావాలాలో ఉంది. దీనిని చంగూర్ బాబా నవీన్ పేరుతో కొనుగోలు చేశారు.ఈ భూమి ధర రూ. 16. 49 కోట్లు. ఆ భూమిని మహ్మద్ అహ్మద్ ఖాన్ అనే వ్యక్తి విక్రయించాడు.రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించిన విషయాలలో ఎటువంటి రాజీ లేదని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తెలిపారు. ఛంగూర్ బాబా ముఠాతో సంబంధం ఉన్న ఇతర నేరస్థుల ఆస్తులను స్వాధీనం చేసుకుని..వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.






## సీఎం రేఖా గుప్తా నివాసం పునరుద్ధరణ రద్దు..!

**టీపీఎన్, న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా అధికారిక నివాసం పునరుద్ధరణ కోసం జారీ చేసిన రూ.60 లక్షల టెండర్‌ను ఢిల్లీ ప్రభుత్వ ప్రజా పనుల శాఖ రద్దు చేసింది. జులై 7న ఆ శాఖ జారీ చేసిన అధికారిక నోటిఫికేషన్ ద్వారా ఈ నిర్ణయం తీసుకున్నారుఈ టెండర్ జులై 4న తెరవాల్సి ఉండగా, పరిపాలనా కారణాల వల్ల టెండర్ రద్దు చేయబడింది. ముఖ్యమంత్రి బంగ్లాలో ఎలక్ట్రికల్ ఫిట్టింగ్‌లు, ఇతర సాంకేతిక పనులు పూర్తి చేయాలనే ప్రణాళిక ఉంది. దీని కోసం రూ. 60 లక్షల టెండర్ జారీ చేయబడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేఖ గుప్తా బాధ్యతలు స్వీకరించారు, జూన్ నెలలో ఆమెకు రాజ్ నివాస్ మార్గ్‌లో ఉన్న బంగ్లా నంబర్ 1 కేటాయించారు. ఈ బంగ్లా టైప్7 కేటగిరీకి చెందినది. ఈ ఖర్చును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా విమర్శించడంతో టెండర్ రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. టెండర్ జారీ చేసిన తర్వాత, ఆమ్ ఆద్మీ పార్టీ , కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వం 'మాయా మహల్' , 'రంగ్ మహల్' నిర్మించిందని ఆరోపించాయి అయితే విపక్ష నేతల కమలనాథులు ఖండించారు. ఢిల్లీ ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (PWD) జులై 1న జారీ చేసిన టెండర్ ప్రకారం, ముఖ్యమంత్రి రేఖ గుప్తా ప్రభుత్వ బంగ్లా పునరుద్ధరణ మొదటి దశ జులై మొదటి వారం నుండి ప్రారంభం కావాల్సి ఉంది. ఇందులో ప్రధానంగా విద్యుత్ పనులు ఉన్నాయి. ఈ ప్రతిపాదనలో 80 లైట్స్, ఫ్యాన్ పాయింట్ల పూర్తి వైరింగ్, ఒక్కొక్కటి రెండు టన్నుల బరువున్న 24 ఎయిర్ కండిషనర్ల సంస్థాపన (దీని ధర రూ. 11 లక్షల కంటే ఎక్కువ), 23 ప్రీమియం ఇంధనసమర్థవంతమైన సీలింగ్ ఫ్యాన్లు , 16 వాల్ మౌంటెడ్ ఫ్యాన్లు ఉన్నాయి.

# గుజరాత్ లో కుప్పకూలిన వంతెన.. 10 మృతి, పలువురికి గాయాలు

గుజరాత్‌లోని వడోదర జిల్లాలో పెను ప్రమాదం జరిగింది. మహి నదిపై ఉన్న పాత వంతెన కూలిపోయింది. మహిసాగర్ నదిపై ఉన్న గంభీర బ్రిడ్జి ఒక్క సారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో 10 మంది చనిపోయారు. పలువురు గల్లంతయ్యారు. నిత్యం రద్దీగా ఉండే బ్రిడ్జి కావడంతో.. కూలిపోయే సమయంలో వంతెనపై ఉన్న కార్లు, ట్రక్కులు, బస్సులు, బైకులు నదిలో పడిపోయాయి. ఈ వంతెన సెంట్రల్ గుజరాత్‌ను సౌరాష్ట్రతో కలిపే కీలకమైన పాద్రాముజ్పూర్ రహదారిపై ఉంది.


గంభీర బ్రిడ్జి సుమారు 40 ఏళ్ల పాతది. 1983-84లో నిర్మించారు. పాత వంతెన కావడంతో ప్రమాదకరంగా మారుతోందని అనేక సార్లు నివేదికలు అందినా గుజరాత్ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ వంతెన సౌరాష్ట్ర ట్రాఫిక్‌కు కీలకం. ఈ వంతెన పాతబడిపోయిందని.. కొత్తది నిర్మించాలన్న డిమాండ్లు చాలా కాలంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోలేదు. భారీ వాహనాలు కూడా ఈ వంతెన మీద నుంచే వెళ్తూంటాయి. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు 4 లక్షల రూపాయలు, గాయపడిన వారికి 50 వేల పరిహారం ప్రకటించారు గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్. ఇటీవల కాలంలో గుజరాత్ లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయి. 2022 మోర్బీ బ్రిడ్జి నిర్మాణ లోపాలు, అధిక లోడ్ కారణంగా కూలిపోయింది. అది 100 ఏళ్ల పాత బ్రిడ్జి. ఈ ప్రమాదంలో 135 మంది మరణించారు. ఆనంద్ జిల్లాలో ముంబైఅహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో నిర్మాణంలో ఉన్న తాత్కాలిక నిర్మాణం 2024 నవంబర్ 5న కూలిపోయి, ముగ్గురు కార్మికులు మరణించారు. వరుస ప్రమాదాలు గుజరాత్ అభివృద్ధి నమూనాను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఎపుడో దశాబ్దాల కిందట కట్టిన ఇన్‌ఫ్రా తప్ప.. గుజరాత్ లో కొత్త ఏమీ నిర్మించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.






# మరోసారి పాక్ పరువుపాయే..!

పాకిస్తాన్ మరోసారి అడ్డంగా దొరికిపోయింది. ఉగ్రవాదులకు పాకిస్తాన్ స్వర్గధామమని యావత్ ప్రపంచానికి తెలుసు. కానీ, పాకిస్తాన్ ప్రభుత్వం, నాయకులు మాత్రం అంగీకరించరు. ఉగ్రవాదులను యోధులుగా, స్వాతంత్ర్య పోరాట యోధులుగా చెప్పుకుంటుంది. అయితే, అప్పుడప్పుడు పాకిస్తాన్ నైజం బయటపడుతున్నది. ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి హీనా రబ్బానీ ఖర్ ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ జరిపిన వైమానిక దాడుల్లో మరణించిన ఉగ్రవాదులకు అంత్యక్రియల్లో పాల్గొన్న లష్కర్ ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ ఉగ్రవాది కాదని.. ఆయన సామాన్యుడని హీనా రబ్బానీ ఖర్ అల్ జజీరాతో ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.జర్నలిస్ట్ లష్కర్ ఎ తోయిబా ఉగ్రవాది హాఫీజ్ సయీద్ సన్నిహితుడు అబ్దుల్ రవూఫ్ అంత్యక్రియల్లో ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలు, ఆయన వెనుక పాక్ సైన్యం, పోలీస్ ఉన్నతాధికారులు ఉన్న చిత్రాలను ఆమెకు చూపించారు. సదరు వ్యక్తి అమెరికా ప్రకటించిన ఉగ్రవాది అంటూ జర్నలిస్ట్ పేర్కొన్నారు. దీనికి హీనా రబ్బాని స్పందిస్తూ.. అంతర్జాతీయ ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ కాదని.. పాక్‌కు చెందిన సామాన్య వ్యక్తి అని తెలిపారు. పాకిస్తాన్‌లో లక్షలాది మంది అబ్దుల్ రవూఫ్‌లు ఉన్నారని.. తాను పూర్తి అధికారంతో ఈ విషయాన్ని చెబుతున్నానన్నారు. పాక్ సైన్యం స్వయంగా విలేకరుల సమావేశం నిర్వహించిందని.. ఆ వ్యక్తి ఉగ్రవాది కాదంటూ సైన్యం ఖండించలేదని జర్నలిస్ట్ గుర్తు చేశారు. పాక్ సైన్యం చిత్రంలో కనిపించిన వ్యక్తి నేషనల్ ఐడీని సైతం చూపించారు. అమెరికా ప్రకటించిన ఉగ్రవాది ఐడీతో సరిపోయిందని చెప్పగా.. హీనా రబ్బాని ఒక్కసారిగా నీళ్లు నమిలింది.. ఆమెకు ఏం చెప్పాలో తెలియక పాత విషయాలనే చెప్పుకువచ్చింది. ఆధారాలతో సహా ఉగ్రవాది గురించి బయటపెట్టడంతో షాక్‌కు గురయ్యారు. అమెరికా ప్రకటించిన ఉగ్రవాది ఫొటోలో కనిపించిన వ్యక్తి కాదంటూ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దాంతో పాకిస్తాన్ ప్రభుత్వం ఉగ్రవాదులకు మద్దతు ప్రకటిస్తుందనే విషయం మరోసారి తేలిపోయింది.



# ప్రధాని మోదీకి నమీబియా అత్యున్నత పౌర పురస్కారం

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి మరో అరుదైన గౌరవం లభించింది. నమీబియా పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ ది మోస్ట్ ఏన్షియంట్ వెల్‌విచ్చియా మిరాబిలిస్'ను ప్రధానం చేశారు. నమీబియా అధ్యక్షురాలు డాక్టర్ నెటుంబో నందిఎన్ ద్వైతా ఈ అవార్డును మోదీకి అందజేశారు. నమీబియాతో పాటు ప్రపంచ శాంతి, న్యాయం, సామాజిక ఆర్థిక అభివృద్ధికి మోదీ చేసిన సేవలను అధ్యక్షురాలు ప్రశంసించారు. నమీబియా అత్యున్నత పౌర పురస్కారం 'వెల్‌విచ్చియా మిరాబిలి'తో అందుకోవడం చాలా ఆనందంగా ఉందని మోదీ అన్నారు. నమీబియా అధ్యక్షురాలు, ప్రభుత్వం, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశంలోని 140 కోట్ల మంది భారతీయుల తరపున ఈ పురస్కారాన్ని అందుకుంటున్నానని చెప్పారు. ఇండియానమిబియా మధ్య ఎప్పటికీ చెక్కుచెదరని చిరకాల స్నేహం ఉందని, ఇక్కడ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. తనకు ఇచ్చిన పురస్కారాన్ని నమీబియా, ఇండియా ప్రజలకు అంకితమిస్తున్నానని తెలిపారు. కష్టకాలంలో ఉన్నప్పుడు చేయూత నిచ్చినవారే నిజమైన మిత్రులని, స్వాతంత్ర్య పోరాటం సమయం నుంచి కూడా ఒకరికొకరు బాసటగా ఇండియా, నమీబియా నిలబడ్డాయని చెప్పారు. ఇరుదేశాల మైత్రి రాజకీయాల నుంచి పుట్టిన మైత్రి కాదని, పరస్పరం ఎదుర్కొన కష్టాలు, సహకారం, పరస్పరం విశ్వాసం నుంచి బలపడందని చెప్పారు. భవిష్యత్తులో కూడా ఇరుదేశాలు మైత్రీ సంబంధాల తో అభివృద్ధి పథం దిశగా పయనించను న్నాయని అన్నారు.



# ఇరాన్ అణు బాంబు తయారీకి రెడీ..?

- **ఆందోళనలో అమెరికా, ఇజ్రాయెల్**
- **అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అనుమతి లేదు**
- **అణుబాంబులు తయారు చేయాలంటే ఎవరూ ఆపలేరన్న ఖమేనీ**



అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (IAEA)తో సహకరించకూడదని ఇరాన్ నిర్ణయించింది. గత నెలలో ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్ , అమెరికా దాడుల తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. IAEAతో సహకారాన్ని రద్దు చేస్తూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ఒక చట్టంపై సంతకం చేశారు.

**ఇరాన్ కొత్త చట్టం**

ఇజ్రాయెల్‌తో ఇరాన్ కాల్పుల విరమణకు ఒక రోజు తర్వాత జూన్ 24న ఇరాన్ పార్లమెంట్ IAEAతో సహకారాన్ని ముగించాలని అత్యధికంగా ఓటు వేసింది. ఈ చట్టం ఇప్పుడు అమల్లోకి వచ్చిందని అక్కడి మీడియా చెబుతోంది. దీంతో ఇరాన్ అణు కార్యక్రమం ఇకపై అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉండదు. అటువంటి పరిస్థితిలో, ఇరాన్ తన అణు మిషన్‌ను రహస్యంగా కొనసాగించవచ్చు. అణుశక్తిని కలిగి ఉండాలా వద్దా అని మరే ఇతర దేశం తనకు చెప్పకూడదని ఇరాన్ ఇప్పటికే చెప్పేసింది.

**IAEA నుండి విడిపోయిన తర్వాత**

ఇరాన్ పార్లమెంటులో ఆమోదించబడిన తీర్మానం ప్రకారం IAEA నుండి విడిపోయిన తర్వాత దాని ఇన్స్పెక్టర్లు ఇకపై ఇరాన్ అణు కేంద్రాలను తనిఖీ చేయలేరు. దీని అర్థం ఇరాన్ రహస్యంగా తన అణు కార్యక్రమాన్ని కొనసాగిస్తే IAEA ఇకపై దాని అణు కార్యక్రమం ఏ స్థాయికి చేరుకుందో దాని గురించి సమాచారాన్ని పొందలేకపోతుంది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరావానీ మాట్లాడుతూ IAEA ఇన్స్పెక్టర్లు ఇరాన్‌లో ఉన్నారని .. వారు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. కానీ వారి కార్యకలాపాలు నిలిపివేశామన్నారు. మా సైట్‌లను యాక్సెస్ చేయడానికి అనుమతించబోమని తేల్చిచెప్పారు. ఇప్పుడు IAEA ఇన్స్పెక్టర్లు ఇరాన్ అణు కేంద్రాలను చేరుకోవాలనుకుంటే, వారు ఇరాన్ అత్యున్నత సంస్థ అయిన జాతీయ భద్రతా మండలి నుండి అనుమతి తీసుకోవాలి.

**ఇరాన్ అణు బాంబు తయారీ.?**

ఇరాన్‌లోని ఫోర్డో, నటాంజ్ , ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడి తర్వాత, ఇరాన్‌లోని 400 కిలోల యురేనియం అదృశ్యమైంది. అది 9 అణు బాంబులను తయారు చేయడానికి తగినంత యురేనియం ఉందని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇరాన్ వద్ద ఇప్పటికే తగినంత యురేనియం ఉంది. 60 శాతం వరకు యురేనియంను సుసంపన్నం చేసిందని IAEA ఇప్పటికే తెలిపింది. ఎటువంటి అంతర్జాతీయ పర్యవేక్షణ లేనప్పుడు, ఇరాన్ తన సుసంపన్నత స్థాయిని 90 శాతానికి తీసుకువెళితే, అది అణు బాంబును తయారు చేసే సామర్థ్యాన్ని సాధించగలదు. అయితే ఇందులో ఇంకా చాలా అడ్డంకులు ఉన్నాయి.

**శాంతియుత ప్రయోజనాల కోసమే..**

ఇరాన్ ప్రస్తుతం అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (NPT)లో సభ్యదేశంగా ఉంది. ఈ సభ్యత్వం దానికి అణుశక్తిని శాంతియుతంగా ఉపయోగించుకునే హక్కును ఇస్తుంది. కానీ అది అణ్వాయుధాలను అభివృద్ధి చేయకుండా నిరోధిస్తుంది. ఈ హక్కులో యురేనియం సుసంపన్నం, అణు పరిశోధన కూడా ఉన్నాయి. ఆయుధ తయారీ కోసం కానట్లయితే అణు సాంకేతికత, సామగ్రిని యాక్సెస్ చేసే హక్కు దీనికి ఉంది. కానీ ఇలా చేయాలంటే ఇరాన్ తన కార్యక్రమం శాంతియుతంగా కొనసాగాలంటే IAEA పర్యవేక్షణను అంగీకరించాలి. ఇరాన్ తన అణు కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమేనని ఎల్లప్పుడూ చెబుతూనే ఉంది. కానీ శాంతియుత అణు పనులకు, 5% యురేనియం సుసంపన్నం సరిపోతుంది. అయితే ఇరాన్ 60% వరకు యురేనియంను సుసంపన్నం చేసింది. అందువల్ల దాని వాదన అనుమానాస్పదంగా ఉంది. ఇరాన్ సుప్రీం నాయకుడు అలీ ఖమేనీ కూడా తాను బాంబు తయారు చేయాలనుకుంటే, ప్రపంచ నాయకులు తనను ఆపలేరని అన్నారు.

**ఇరాన్ అణు కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తే..**

ఇరాన్ తన అణు కార్యక్రమాలను తిరిగి ప్రారంభించే విషయానికి వస్తే నటాంజ్‌లో ఉన్న అణు సెంట్రిఫ్యూజ్‌లు అమెరికా, ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమయ్యాయి. అటువంటి పరిస్థితిలో, సుసంపన్నం చేయడం దానికి అంత ఈజీ కాదు. కానీ ఇరాన్ యొక్క కొన్ని రహస్య అణు కేంద్రాలు ఇప్పటికీ సురక్షితంగా ఉన్నాయని చెబుతారు. కుహ్‌ఎకోలాంగ్ గజ్‌లా అనేది నటాంజ్ నుండి కొద్ది దూరంలో పర్వతాల మధ్యలో ఉన్న అణు కేంద్రం. ఇరాన్ ఈ కేంద్రాన్ని లేదా ఇలాంటి ఏదైనా కేంద్రాన్ని తిరిగి సక్రియం చేస్తే, ఈ దశ అమెరికా, ఇజ్రాయెల్ యొక్క ఆందోళనను పెంచుతుంది.

**అమెరికా-ఐక్యరాజ్యసమితి ఏం చెప్పింది?**

ఇరాన్ కు అణు బాంబు తయారు చేసే హక్కు లేదని ట్రంప్ ఎప్పుడూ చెబుతూనే ఉన్నారు. IAEA నుండి ఇరాన్ విడిపోవడంపై, ఇది ఆమోదయోగ్యం కాదని అమెరికా పేర్కొంది. తన వైఖరిని మార్చుకుని శాంతి , శ్రేయస్సు మార్గాన్ని ఎంచుకునే అవకాశం ఉన్న సమయంలో IAEA తో సహకారాన్ని నిలిపివేయాలని నిర్ణయించుకుందని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ కె. బ్రూస్ అన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ ప్రతినిధి ఈ నిర్ణయం స్పష్టంగా ఆందోళనకరంగా ఉందన్నారు.

**ఇరాన్ ఎంత వేగంగా అణు బాంబును తయారు చేయగలదు?**

ఇజ్రాయెల్ దాడిలో చాలా మంది అగ్రశ్రేణి ఇరాన్ అణు శాస్త్రవేత్తలు మరణించారు. ఇది ఖచ్చితంగా ఇరాన్ లక్ష్యాన్ని దెబ్బతీసింది. కానీ దాని మౌలిక సదుపాయాలకు ఎంత నష్టం జరిగిందనే దానిపై స్పష్టమైన సమాచారం లేదు. అయితే, అమెరికాఇజ్రాయెల్ దాడి ఇరాన్ అణు కార్యక్రమాన్ని కనీసం 2 సంవత్సరాలు వెనక్కి నెట్టిందని అమెరికా ఖచ్చితంగా చెబుతోంది.



# తాలిబాన్ ప్రభుత్వానికి రష్యా మద్దతు

రష్యా ఒక చారిత్రాత్మక అడుగు వేసి ఆఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించింది. ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించకపోవడంతో ఈ చర్య ప్రపంచ రాజకీయాల్లో ఒక మలుపుగా పరిగణించబడుతుంది. తాలిబన్లు నియమించిన కొత్త ఆఫ్ఘన్ రాయబారి గుల్ హసన్ హసన్‌ను అంగీకరిస్తూ రష్యా ప్రభుత్వం ఈ ప్రకటన చేసింది. దీంతో, తాలిబన్ పాలనను అధికారికంగా గుర్తించిన మొదటి దేశంగా రష్యా నిలిచింది. 2021 ఆగస్టులో ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ అధికారంలోకి వచ్చింది.ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వానికి అధికారిక గుర్తింపు లభించడం వల్ల రెండు దేశాల మధ్య వివిధ రంగాలలో నిర్మాణాత్మక ద్వైపాక్షిక సహకారం పెరుగుతుందని విశ్వసిస్తున్నామని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రష్యా ఉప విదేశాంగ మంత్రి ఆండ్రీ రుడెంకో మాస్కోలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో గుల్ హసన్ హసన్‌ను కలిశారు. కాబూల్‌లోని తాలిబన్ అధికారులు రష్యా చర్యను స్వాగతించారు. ఇది రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని అన్నారు. తాలిబన్ తాత్కాలిక విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తాకి మాట్లాడుతూ ఇది రెండు దేశాల సంబంధాల చరిత్రలో ఒక పెద్ద విజయంగా అభివర్ణించారు. 2021 ఆగస్టులో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా రష్యా కాబూల్‌లోని తన రాయబార కార్యాలయాన్ని తెరిచి ఉంచింది. తాలిబన్ నాయకత్వంతో సంబంధాలు కొనసాగిస్తుంది. వాణిజ్యం, ఆర్థిక రంగాలలో సహకారాన్ని పెంపొందుతుందని భావిస్తున్నారు. ఇంధనం, రవాణా, వ్యవసాయం , మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో పనిచేయాలని యోచిస్తోందని రష్యా ప్రభుత్వం తెలిపింది. దీంతో పాటు విద్య, సంస్కృతి, క్రీడలు , మానవతా రంగాలలో సంబంధాలను బలోపేతం చేయాలనే కోరిక కూడా వ్యక్తమైంది.ఇప్పటివరకు ఏ దేశం కూడా తాలిబన్ ప్రభుత్వాన్ని అధికారికంగా గుర్తించలేదు. చాలా దేశాలు తాలిబన్లు అంతర్జాతీయ ప్రమాణాలకు, ముఖ్యంగా మానవ హక్కుల విషయాలకు తమ నిబద్ధతను ప్రదర్శించాలని ఎదురు చూస్తున్నాయి. రష్యా తాలిబన్లను గుర్తించినప్పటికీ, వారి మానవ హక్కుల రికార్డును మెరుగుపరచుకోవాలని తాలిబన్లపై ఇప్పటికీ ప్రపంచవ్యాప్త ఒత్తిడి ఉంది.

# షేక్ హసీనా ఆడియో లీక్..



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు సంబంధించిన ఒక కీలకమైన ఆడియో లీక్ కావడంతో రాజకీయంగా పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా గతేడాది జరిగిన ఆందోళనల సమయంలో నిరసనకారులపై కాల్పులు జరపాలని ఆమె స్వయంగా ఆదేశించినట్లు ఈ ఆడియోలో ఉంది. ఇప్పుడు బంగ్లా రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.బంగ్లాదేశ్‌లో, అప్పటి ప్రధాన మంత్రి షేక్ హసీనా గత సంవత్సరం విద్యార్థి నిరసనకారులను నియంత్రించాలని కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. మాజీ ప్రధాని ఒక సీనియర్ ప్రభుత్వ అధికారితో చేసిన సంభాషణ యొక్క లీకైన ఆడియో, నిరసనకారులను వేటాడి కాల్చి చంపాలని ఆమె ఆదేశించినట్లు సూచిస్తుంది. ఈ వీడియో షేక్ హసీనా ఇబ్బందులను మరింత పెంచుతుంది. ఆమె ఇప్పటికే సామూహిక హత్యల కేసులో విచారణను ఎదుర్కొంటోంది. నిరసనకారులను అణచివేయడానికి ప్రాణాంతక ఆయుధాలు వాడండి. వాళ్లు ఎక్కడ కనిపిస్తే అక్కడ కాల్చేయండి అని ఆమె ఆదేశించారు. ఈ ఆదేశాలు జారీ అయిన కొద్ది గంటలకే పోలీసులు నిరసనకారులపై బలప్రయోగం చేసింది.కాగా, బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు హింసాత్మకంగా మారి తీవ్ర అల్లర్లకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో సుమారు 1,400 మంది మరణించినట్లు ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. ఈ నిరసనలు తీవ్రరూపం దాల్చడంతో హసీనా ప్రభుత్వం కుప్పకూలింది. అనంతరం ఆమె దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. అయితే బంగ్లాదేశ్ ఆమెను అప్పగించాలని భారతదేశానికి అధికారికంగా అభ్యర్థన పంపింది. కానీ ప్రస్తుతానికి ఈ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.ప్రస్తుతం మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం హసీనాను తిరిగి దేశానికి రప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఆమెపై బంగ్లాదేశ్‌లో ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి. కోర్టు ధిక్కరణ కేసులో అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ ఆమెకు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. తిరుగుబాటు తరువాత, గత ప్రభుత్వంలోని చాలా మంది అవామీ లీగ్ నాయకులు , అనేక మంది అధికారులను అరెస్ట్ చేశారు. కొంతమంది విదేశాలకు పారిపోయారు. తాత్కాలిక ప్రభుత్వం వారిపై క్రూరమైన అణచివేతకు సంబంధించి విచారణలు ప్రారంభించింది,. దీని ఫలితంగా ఆగస్టు 5న 15 ఏళ్లకు పైగా ఉన్న అవామీ లీగ్ ప్రభుత్వం కూలిపోయింది.

**అవామీ లీగ్ స్పందించింది**

తిరుగుబాటు సమయంలో సామూహిక హత్యలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హసీనాను బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రిబ్యునల్ విచారిస్తోంది. కాబట్టి ప్రాసిక్యూటర్లు ఆమెకు వ్యతిరేకంగా ఆడియోటేప్‌ను కీలక సాక్ష్యంగా ఉపయోగించాలని యోచిస్తున్నారు. బంగ్లాదేశ్‌ను విడిచిపెట్టిన తర్వాత ఆమె చేసిన మొదటి ప్రకటనలో, హసీనా తాను నిర్దోషినని ప్రకటించుకుంది. కానీ ఇటీవల లీక్ అయిన ఆడియో నిరసనకారుల కోసం 'కనిపించగానే కాల్చివేయండి అనే ఆదేశాలను హసీనా నేరుగా ఇచ్చినట్లు సూచిస్తుంది. బీబీసీ లీక్ చేసిన ఆడియోను అవామీ లీగ్ ప్రతినిధి తిరస్కరించారు. లీక్ అయిన ఆడియో నిరాధారమైనది.. చట్టవిరుద్ధమని పార్టీ పేర్కొంది.



# నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్!

**టీపీఎన్, ముంబై :**

భారత స్టాక్ మార్కెట్ బుధవారం ఉదయం మిశ్రమ గ్లోబల్ సూచనలు మరియు గ్లోబల్ వాణిజ్య అనిశ్చితుల నేపథ్యంలో బలహీనంగా ప్రారంభమైంది. ఉదయం 9:34 గంటల సమయంలో, BSE సెన్సెక్స్ 181.63 పాయింట్లు లేదా 0.22% తగ్గి 83,530.88 వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా, NSE నిఫ్టీ 44.25 పాయింట్లు లేదా 0.17% తగ్గి 25,478.25 వద్ద ఉంది.

విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, గ్లోబల్ వాణిజ్య ఒత్తిడులు మరియు సుంకాలపై స్పష్టత లేకపోవడం వల్ల మార్కెట్ బలహీనంగా ప్రారంభమైంది. "నిఫ్టీకి 25,500 వద్ద సపోర్ట్ ఉండవచ్చు, ఆ తర్వాత 25,400 మరియు 25,300 స్థాయిలు సపోర్ట్‌గా ఉంటాయి. అదే సమయంలో, 25,600 వద్ద తక్షణ నిరోధకం, ఆపై 25,700 మరియు 25,800 స్థాయిలు నిరోధకంగా ఉంటాయి," అని చాయిస్ బ్రోకింగ్‌కు చెందిన హర్దిక్ మటాలియా తెలిపారు.

ఇటీవలి గ్లోబల్ పరిణామాల్లో, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫార్మాస్యూటికల్స్‌పై 200% మరియు కాపర్ ఉత్పత్తులపై 50% సుంకాలను ప్రతిపాదించారు. దీని ప్రభావంతో కాపర్ ఫ్యూచర్స్ 17% కంటే ఎక్కువగా పెరిగి, తర్వాత స్థిరీకరణకు చేరుకున్నాయి. ఈ సుంకాలపై మరింత స్పష్టత వచ్చే వరకు మార్కెట్లు జాగ్రత్తగా ఉన్నాయని విశ్లేషకులు అంటున్నారు.

నిఫ్టీ బ్యాంక్ సూచీ 196.25 పాయింట్లు లేదా 0.34% తగ్గి 57,060.05 వద్ద ఉంది. విస్తృత సూచీలలో, నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 72 పాయింట్లు లేదా 0.12% పెరిగి 59,487.45 వద్ద, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 84.55 పాయింట్లు లేదా 0.45% పెరిగి 18,979.75 వద్ద ట్రేడవుతున్నాయి.

సెన్సెక్స్ షేర్లలో హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టాటా స్టీల్, ఎల్ అండ్ టీ, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటార్స్, అల్ట్రాటెక్ సిమెంట్, ఎం అండ్ ఎం, ఎటర్నల్, ట్రెంట్ టాప్ లూజర్స్‌గా ఉన్నాయి. హిందుస్తాన్ యూనిలీవర్, బజాజ్ ఫైనాన్స్, మారుతి సుజుకి, ఎన్‌టీపీసీ, పవర్ గ్రిడ్ టాప్ గెయినర్స్‌లో ఉన్నాయి.

జులై 8న విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FIIs) ₹26.12 కోట్ల విలువైన ఈక్విటీలను విక్రయించగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (DIIs) ₹1,366.82 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

ఆసియా మార్కెట్లలో బ్యాంకాక్, హాంకాంగ్ బలహీనంగా ట్రేడవుతుండగా, జపాన్, సియోల్, చైనా, జకార్తా లాభాల్లో ఉన్నాయి. అమెరికాలో, డౌ జోన్స్ 165.60 పాయింట్లు తగ్గి 44,240.76 వద్ద ముగిసింది. ఎస్ అండ్ పీ 500 సూచీ 0.07% తగ్గగా, నాస్డాక్ 0.03% స్వల్ప లాభాన్ని నమోదు చేసింది.

# దేశంలో ఈవీల విక్రయాల జోరు



**టీపీఎన్, న్యూఢిల్లీ :**

దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాలకు ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తున్నది. గత నెలలో దేశీయంగా 1.80 లక్షల యూనిట్ల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన వాహనాలతో పోలిస్తే 28.60 శాతం అధికమని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్ల అసోసియేషన్ (ఫాడా) తాజాగా వెల్లడించింది. ఈప్యాసింజర్ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉండటం ఇందుకు కారణమని తెలిపింది. ఎలక్ట్రిక్ ప్యాసింజర్ వాహన అమ్మకాలు 7,323 యూనిట్ల నుంచి 13,178 యూనిట్లకు చేరుకున్నాయి. మొత్తం వాహన విక్రయాల్లో ప్యాసింజర్ వాహనాల వాటా 4.4 శాతానికి ఎగబాకింది. కమర్షియల్ వాహనాలు ఏడాది ప్రాతిపదికన రెండింతలు పెరిగి 1,146 యూనిట్లకు చేరుకున్నాయి. పెట్రోల్ ధరలు గరిష్ఠ స్థాయిలో ఉండటంతో వాహన కొనుగోలుదారులు ఈవీలపై ఆసక్తి చూపుతున్నారని, అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రత్యేక స్కీంలు కూడా ఆకట్టుకుంటున్నాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. చార్జింగ్ స్టేషన్లు అత్యధికంగా ఏర్పాటు కావడంతో చార్జింగ్ ఇబ్బందులు కూడా లేకుండా పోయాయన్నారు.

# దిగొస్తున్న బంగారం ధరలు



**టీపీఎన్, ముంబై :**

పసిడి ప్రియులకు గుడ్ న్యూస్. బంగారం ధరలు దిగివస్తున్నాయి. ప్రపంచ మార్కెట్‌లో డిమాండ్ పడిపోవడంతో ధర దిగి వచ్చింది. బుధవారం రాజధాని ఢిల్లీలో బంగారం 24 క్యారెట్ల ధర రూ.700 తగ్గి తులానికి రూ.98,420కి చేరుకుంది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.600 తగ్గి తులానికి రూ.98వేలకు తగ్గింది. అదే సమయంలో వెండి ధర కిలోగ్రాముకు రూ.800 తగ్గి రూ.1,04,000కి చేరుకుంది. ఈ మేరకు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. జులైలో ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గింపు అంచనాలు తగ్గడం, యూఎస్ డాలర్ బలోపేతం కావడంతో బంగారం ధరలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ (కమోడిటీస్) సౌమిల్ గాంధీ తెలిపారు.

# భారత రిటైల్ సెక్యూరిటైజేషన్ మార్కెట్ Q1 FY26లో 6%వృద్ధి



**టీపీఎన్, న్యూఢిల్లీ :**

కేర్‌ఎడ్జ్ రేటింగ్స్ నివేదిక ప్రకారం, భారత రిటైల్ సెక్యూరిటైజేషన్ మార్కెట్ 202526 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో (Q1 FY26) గత సంవత్సరంతో పోలిస్తే 6% వృద్ధిని సాధించి, మొత్తం ₹45,400 కోట్ల వాల్యూమ్‌ను చేరుకుంది. పెట్టుబడిదారుల విశ్వాసం, బలమైన ఆస్తి నాణ్యత, మరియు వాహన రుణాలు, మైక్రోఫైనాన్స్ రుణాలకు పెరుగుతున్న డిమాండ్ ఈ వృద్ధికి కారణాలుగా ఉన్నాయి.

పాస్‌త్రూ సర్టిఫికేట్ (PTC) జారీలు మరియు డైరెక్ట్ అసైన్‌మెంట్ (DA) లావాదేవీలతో కలిపి, మొత్తం లావాదేవీల వాల్యూమ్ ₹52,000 కోట్లుగా నమోదైంది. ఈ సెక్టార్‌లో నిరంతర వృద్ధి మార్కెట్ స్థిరత్వాన్ని మరియు రుణదాతలు నిధుల సేకరణలో వైవిధ్యాన్ని తీసుకురావడానికి చేస్తున్న వ్యూహాత్మక మార్పులను సూచిస్తుంది.

ఈ త్రైమాసికంలో ఒక ముఖ్యమైన సంఘటన ఏమిటంటే, RMBS డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (RDCL) ద్వారా భారతదేశంలో మొట్టమొదటి రెసిడెన్షియల్ మార్ట్‌గేజ్‌బ్యాక్డ్ సెక్యూరిటైజేషన్ (RMBS) ఒప్పందం జరిగింది. ఇది ఎలక్ట్రానిక్ బుక్ ప్రొవైడర్ (EBP) ప్లాట్‌ఫామ్‌పై జరిగిన తొలి సెక్యూరిటైజేషన్ కూడా. ఈ నూతన ఆవిష్కరణ మార్ట్‌గేజ్‌బ్యాక్డ్ సెక్యూరిటీలలో పెట్టుబడిదారుల ఆసక్తిని పెంచి, దీర్ఘకాలిక నిధుల సేకరణ అవకాశాలను మెరుగుపరుస్తుందని భావిస్తున్నారు.

Q1 FY26లో PTC లావాదేవీలు మొత్తం వాల్యూమ్‌లో 56% వాటాను కలిగి ఉన్నాయి, గతంలో డామినేట్ చేసిన DA లావాదేవీలను అధిగమించాయి. ఈ మార్పు పెట్టుబడిదారులు ప్రామాణిక మరియు ట్రేడబుల్ ఫైనాన్షియల్ ఇన్‌స్ట్రుమెంట్‌లపై పెరుగుతున్న ఆసక్తిని సూచిస్తుంది. PTCలలో, ఆస్తిఆధారిత సెక్యూరిటైజేషన్ (ABS) ఉత్పత్తులు 75% వాటాతో ముందంజలో ఉన్నాయి, అందులో వాహన రుణాలు ₹14,600 కోట్లతో లేదా ABS జారీలలో 51% వాటాను కలిగి ఉన్నాయి.

అయితే, వాహన రుణఆధారిత PTCల వాటా తగ్గుతోంది, ఎందుకంటే అసురక్షిత వ్యక్తిగత రుణాలు, వ్యాపార రుణాలు, బంగారు రుణాలు వంటి ఇతర విభాగాలు ఊపందుకుంటున్నాయి. అసురక్షిత రుణాలు PTC వాల్యూమ్‌లో 15% వాటాను కలిగి ఉన్నాయి, ఇది వైవిధ్యమైన రిటైల్ క్రెడిట్ ఉత్పత్తులపై పెట్టుబడిదారుల ఆసక్తి పెరుగుతున్నట్లు సూచిస్తుంది.

మైక్రోఫైనాన్స్ సంస్థల (MFIs) PTC వాటా గత సంవత్సరం 8% నుండి 15%కి పెరిగింది, ఇది ఆస్తి నాణ్యతలో మెరుగుదల మరియు ఈ రంగంపై పెట్టుబడిదారుల విశ్వాసం పెరిగినట్లు సూచిస్తుంది. DA సెగ్మెంట్‌లో, మార్ట్‌గేజ్‌ఆధారిత ఒప్పందాలు 67% వాటాను కలిగి ఉండగా, ఆస్తిఆధారిత DAలు 26% వాటాను కలిగి ఉన్నాయి.

## అమెరికాభారత వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో
# స్వల్ప లాభాలు!

**టీపీఎన్, ముంబై :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత దేశంతో వాణిజ్య ఒప్పందం త్వరలో పూర్తవుతుందని ప్రకటించడంతో, భారత ఈక్విటీ మార్కెట్లు మంగళవారం జాగ్రత్తగా ప్రారంభమైన తర్వాత స్వల్ప లాభాలతో ముందుకు సాగాయి. ప్రారంభంలో బలహీనంగా ఉన్న BSE సెన్సెక్స్ 121.55 పాయింట్లు తగ్గి 83,320.95 వద్ద, NSE నిఫ్టీ 37.15 పాయింట్లు తగ్గి 25,424.15 వద్ద ట్రేడయ్యాయి. అయితే, కొద్దిసేపటికే రెండు సూచీలు రికవరీ కనబరిచాయి. ఉదయం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 86.13 పాయింట్లు పెరిగి 83,526.55కి, నిఫ్టీ 19.75 పాయింట్లు పెరిగి 25,481.05కి చేరుకున్నాయి.

దక్షిణ కొరియా యొక్క కోస్పి, జపాన్ యొక్క నిక్కీ 225, చైనా యొక్క SSE కాంపోజిట్, మరియు హాంకాంగ్ యొక్క హాంగ్ సెంగ్ వంటి ఆసియా మార్కెట్లలో లాభాలు మనోభావాలను ఉత్తేజపరిచాయి. అదనంగా, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల (FIIs) నుండి కొత్త నిధుల ప్రవాహం మరింత ఉత్సాహాన్ని ఇచ్చింది.

సెన్సెక్స్ కంపెనీలలో కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎటర్నల్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, టాటా మోటార్స్, ఎన్‌టీపీసీ, మరియు అదానీ పోర్ట్స్ లాభాల్లో ముందున్నాయి. మరోవైపు, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, సన్ ఫార్మా, హెచ్‌సీఎల్ టెక్, మరియు ట్రెంట్ వెనుకబడ్డాయి.


సోమవారం మాట్లాడిన ట్రంప్, అమెరికా ఇప్పటికే యూకే మరియు చైనాతో వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకున్న తర్వాత, భారత దేశంతో ఒప్పందం సమీపిస్తోందని తెలిపారు. అమెరికా ఆసక్తులకు విరుద్ధంగా ఉన్న దేశాలపై సుంకాలు విధిస్తామని, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, బంగ్లాదేశ్ సహా 14 దేశాలకు లేఖలు పంపినట్లు ఆయన చెప్పారు.

"ఈ జాబితాలో భారతదేశం లేకపోవడం, ట్రంప్ వ్యాఖ్యలు వాణిజ్య ఒప్పందం త్వరలో ఖరారయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నాయి," అని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ వి.కె. విజయ కుమార్ అన్నారు. అయితే, ఒప్పందంలోని చిన్నపాటి వివరాలు, ముఖ్యంగా రంగనిర్దిష్ట సుంకాలపై మార్కెట్ ప్రతిస్పందన ఆధారపడి ఉంటుందని ఆయన జోడించారు.

సోమవారం FIIలు ₹321.16 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేయగా, దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు (DIIs) ₹1,853.39 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. బ్రెంట్ క్రూడ్ ధర స్వల్పంగా తగ్గి బ్యారెల్‌కు $69.33 వద్ద ఉంది.




# భారత్‌లో గూగుల్ ఏఐ మోడ్




1టీపీఎన్ ప్రతినిధి :

ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఏ సమాచారం కావాలన్నా గూగుల్ సెర్చ్ ఓపెన్ చేస్తుంటారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 90 శాతం మంది దీన్ని ఉపయోగిస్తారు. యూజర్లు అడిగిన సమాచారాన్ని.. సంబంధిత వెబ్‌లింక్‌లను వెతికి ఇస్తుంది. అయితే, చాట్‌జీపీటీ రాకతో గూగుల్ కూడా 'ఏఐ' వైపు అడుగులు వేసింది. తన సెర్చ్ ఇంజిన్‌కు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను అనుసంధానం చేసింది. ఇప్పటికే అమెరికాలో విడుదలై విజయవంతంగా సేవలు అందిస్తున్న 'గూగుల్ సెర్చ్ ఏఐ మోడ్ ఇప్పుడు భారత్ లోనూ అందుబాటులోకి వచ్చింది. ఎలాంటి సైన్‌అప్స్ చేయకుండానే డైరెక్ట్‌గా మొబైల్, వెబ్ వెర్షన్లలో ఏఐ ఆధారిత శోధనలు చేసుకోవచ్చు. ఇప్పటివరకు గూగుల్‌లో ఏదైనా వెతికితే.. అందుకు సంబంధించిన వెబ్‌లింక్‌లు మాత్రమే వచ్చేవి. కొన్ని సంక్లిష్టమైన ప్రశ్నలకు జవాబులు దొరికేవి కాదు. కానీ, ఈ సరికొత్త ఏఐ మోడ్ టూల్‌తో.. ఎలాంటి ప్రశ్నకైనా ఇట్టే సమాధానం దొరుకుతుంది. వినియోగదారుల మనసులో ఏమున్నా.. గూగుల్‌ను నేరుగా అడగొచ్చు. వాటికి గూగుల్ ఏఐ టూల్ 'జెమిని' సహాయంతో సమాధానాన్ని అందిస్తుంది. అందుకే, ఈ గూగుల్ సెర్చ్ ఏఐ మోడ్‌ను 'జెమిని 2.5 వెర్షన్‌గా చెబుతున్నారు. ప్రస్తుతానికి ఇంగ్లీషులో మాత్రమే అందుబాటులో ఉంది. త్వరలోనే తెలుగుతోపాటు ఇతర ప్రాంతీయ భాషల్లోనూ సేవలు అందించనున్నది.



# గల్లీ టూ ర్యాపర్.. మహి ఘూనే స్టోరీ..





ఆమె ఓ ర్యాపర్.. కానీ అంత ఈజీగా తన లైఫ్ లో సక్సెస్ అవ్వలేదు. ఎన్నో చాలెంజెస్ ను క్రాస్ చేసి ఈ స్టేజ్ కి చేరింది. ఆమె పేరు మహి మధుర ఘూనే. మహదేవ్ కొలి అనే తెగకు చెందిన మహిది మహారాష్ట్రలోని కలన్ అనే ప్రాంతం. ఇక్కడ స్కూల్ లో చదువుకునే వారి కంటే మధ్యలో మానేసే వారే ఎక్కువ. అమ్మాయిలకు చిన్నవయసులోనే పెళ్లి చేయడం ఇక్కడ చాలా నార్మల్. అయితే మహి తండ్రి బస్ కండక్టర్ కావడంతో తన ఇద్దరు పిల్లల్ని చదువుకోమని ఎంకరేజ్ చేశారట. ఈ క్రమంలోనే రకరకాల సామాజిక అడ్డంకుల్ని దాటుకుని ఆమె ఇంజినీరింగ్ పూర్తి చేసింది. మహికి కాలేజీ రోజుల నుంచే కవితలు రాసే అలవాటుంది. ఆ తర్వాత కూడా ఈ అలవాటునే కంటిన్యూ చేస్తుంది. ఓవైపు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే మరోవైపు ఖాళీ సమయాల్లో కవితలు రాసేదట. ఈ క్రమంలోనే 2019లో వచ్చిన గల్లీబాయ్ సినిమా ఆమె జీవితాన్నే మార్చేసింది. ఈ సినిమాను ఓ ర్యాపర్ జీవితం ఆధారంగా తెరకెక్కించారు. ఆ తర్వాత ర్యాప్ మ్యూజిక్ కి ఆదరణ మరింత పెరిగింది. దాంతో తాను కూడా దేశంలోని రకరకాల సోషల్ ప్రాబ్లెమ్స్ ను ర్యాప్ సాంగ్స్ తో వెలుగులోకి తీసుకురావచ్చని అనుకుంది మహి. అప్పటికే తాను కవితలు రాస్తుండడంతో తన ఆలోచనలను ర్యాప్ వైపు టర్న్ అయ్యింది. ర్యాప్ పాటలతో యూత్ కు సోషల్ టాపిక్స్ గురించి సూటిగా చెప్పాలనుకున్న మహి.. 2020 ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమాన్ని వేదికగా చేసుకుంది. ఈ క్రమంలో రైతుల సమస్యల గురించి ఓ ర్యాప్ సాంగ్‌ని ప్లాన్ చేసుకుని తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసింది. ఆ వీడియోకి అభిమానుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ రావడంతో తాను సెలెక్ట్ చేసుకున్న మార్గం సరైందని భావించింది. దాంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి పూర్తి ర్యాపర్‌గా మారిపోయింది. అలా 2021లో మరాఠీ ర్యాపర్ ర్యాప్‌బాస్ తో కలిసి తన ఫస్ట్ ట్రాక్ Jungle cha Raja ను రిలీజ్ చేసింది. ఇందులో ఆదివాసీల సమస్యలను వివరించడంతో.. వారి నుంచి చక్కటి ఆదరణ సొంతం చేసుకుంది. ఆ తర్వాత ట్రాన్స్‌జెండర్ సమస్యలపై తన స్టైల్ లో ర్యాప్ ను ప్లే చేసింది. అంతేకాకుండా వారి కోసమే ఏర్పాటు చేసిన హమ్ సఫర్ ట్రస్ట్ తో కలిసి పనిచేసింది. అంబేద్కర్ 131వ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పిస్తూ Baapmanus అనే పాటను పాడింది. ఇదే ర్యాప్‌ను న్యూ ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలోనూ పాడి అక్కడి ఆడియన్స్ ని ఆకట్టుకుంది. ఏ టాపిక్ అయినా సరే నా మనసుకు తాకితే వెంటనే ర్యాప్ రాస్తాను. అయితే నా గురించి పాటల రూపంలో ప్రపంచానికి తెలియజేయడం మాత్రం నాకు ఇష్టం లేదు. వేరే ఆర్టిస్ట్ ల పాటలు కూడా అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా ఉండాలని కోరుకుంటాను అంటుంది మహి. మహికి కవితలు, పాటలు రాసే అలవాటు తన తండ్రి నుంచి వచ్చిందట. అంతేకాదు.. ఒకవేళ పాటల్లో ఏవైనా లోపాలుంటే ఆయన సరైన సూచనలిస్తారని కూడా చెబుతోంది. ప్రజంట్ సోషల్ మీడియా విస్తృతంగా పెరగడంతో తన పాట నలుమూలల్లోనూ వినిపిస్తుందని మహి సంతోషం వ్యక్తం చేస్తుంది.

## ఫోన్ బ్యాటరీ విషయంలో ఇన్ని

# అపోహలా?

స్మార్ట్‌ఫోన్లు.. ఇవి లేకపోతే ప్రజంట్ సిట్యువేషన్ లో హ్యూమన్ లైఫ్ లేదు అనడంలో ఎలాంటి డౌట్ లేదు. మన జీవితంలో ఒక భాగంగా మారిపోయాయి. బ్యాంకు, ఈమెయిల్, సామాజిక మాధ్యమాల పనులన్నీ ఇప్పుడు దీంతోనే సాగుతున్నాయి. అందుకే ఎక్కడ బ్యాటరీ నిండుకుంటుందోనని తరచూ ఫోన్ల వంక చూస్తూనే ఉంటాం. ఇంటర్నెట్ లో బ్యాటరీని సేవ్ చేసుకోవటానికి సంబంధించిన టిప్స్ కు కొదవలేదు. అయితే వీటిల్లో చాలావరకూ ఎక్స్ పైరీ అయినవే. అవి కొత్త ఫోన్లకు వర్తించవు. మరి కొన్ని బ్యాటరీ అపోహల్లో నిజాలేంటో చూద్దాం. అతి ఎక్కువగా ప్రచారంలో ఉన్న అపోహల్లో ఒకటి. బ్యాక్ గ్రౌండ్ యాప్స్ ను రిమూవ్ చేస్తే బ్యాటరీ సేవ్ అవుతుందని అనుకోవటం. ఫోన్ లో ఎన్ని ఎక్కువ యాప్ లు ఓపెన్ అయ్యుంటే అంత ఎక్కువగా బ్యాటరీ ఖర్చవుతుందని చాలామంది నమ్ముతుంటారు. ఇది పాత ఫోన్ల విషయంలో నిజం కావొచ్చేమో గానీ కొత్త ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాలకు మాత్రం కాదు. లేటెస్ట్ టెక్నాలజీ ఫోన్లన్నీ బ్యాక్ గ్రౌండ్ లో ఉన్న యాప్స్ ను పాజ్ చేసేస్తాయి. ఆశ్చర్యంగా అనిపించినా ఓపెన్ చేసి ఉన్న యాప్స్ ను ప్రతిసారి తీసేస్తుంటే.. ఫోన్ మరింత ఎక్కువ బ్యాటరీని వాడుకుంటుంది. ఎందుకంటే బ్యాక్ గ్రౌండ్ నుంచి రిమూవ్ చేసినప్పుడు అవి మెమరీ నుంచి పోతాయి. తిరిగి ఓపెన్ చేసినప్పుడు స్టోరేజీ నుంచి రీలాంఛ్ అవుతాయి. ఇందుకు బ్యాటరీని వాడుకుంటాయి. యాప్స్ రెస్పాన్స్ కానప్పుడు.. వాటితో పనిలేనప్పుడే యాప్‌స్‌ను బ్యాక్ గ్రౌండ్ నుంచి తీసేయడం మంచిది. ఫోన్ ను ఎక్కువగా ఛార్జింగ్ చేస్తే బ్యాటరీ మీద ఎక్కువగా ఎఫెక్ట్ పడుతుందనేది మరో అపోహ. దీనికి మూలం పాతకాలం ఫోన్లు. లిథియం అయాన్ బ్యాటరీలు రాక ముందు ఎక్కువసేపు ఛార్జ్ చేస్తే పరికరాలు వేడెక్కేవి. ఫలితంగా బ్యాటరీ క్వాలిటీ టైమ్ తగ్గేది. అయితే మోడరేట్ ఫోన్లలో ఓవర్‌ఛార్జింగ్ చేసినా దెబ్బతినకుండా కాపాడే టెక్నికల్ పార్ట్స్ ఉంటున్నాయి. బ్యాటరీ పూర్తిస్థాయి ఛార్జింగ్ కు వస్తున్నప్పుడు ఫోన్ దాన్ని ట్రికిల్ ఛార్జింగ్‌కు మారుస్తుంది. అప్పుడు బ్యాటరీ నెమ్మదిగా... డిశ్చార్జ అయ్యే పర్సంటేజ్ తో ఈక్వల్ గా లేదా దాని కన్నా కాస్త ఎక్కువగా ఛార్జ్ అవుతుంది. అంటే 100% ఛార్జింగ్ దగ్గరికి వస్తున్నప్పుడు ఫోన్ చాలా నెమ్మదిగా ఛార్జ్ అవుతుందన్నమాట. ఫోన్‌లో వైఫై, బ్లూటూత్ ఆన్ చేసి ఉంచితే బ్యాటరీ త్వరగా నిండుకుంటుందనేది ఇంకో అపోహ. ఇది పదేళ్ల క్రితం నాటి మాట. అధునాతన టెక్నాలజీ.. మెరుగైన ఆండ్రాయిడ్, ఐఓఎస్ పరికరాల రాకతో నేడు అలాంటి ఇబ్బంది తొలగిపోయింది. వైఫై, బ్లూటూత్‌ను డిసేబుల్ చేస్తే కొద్దిగా బ్యాటరీ ఆదా కావొచ్చు గానీ పెద్ద తేడా కనిపించదు. దగ్గర్లో ఛార్జర్ ఉంటే లేదా రాత్రిపూట ఛార్జ్ చేసే అవకాశం ఉంటే ఈ ఫీచర్లను ఆన్ చేసుకుంటే ఇబ్బందేమీ ఉండదు. బ్యాటరీ పూర్తిగా నిండుకున్న తర్వాతే ఛార్జింగ్ చేయాలనుకోవటం శుద్ధ తప్పు. నిజానికి వీలైనంత వరకూ ఛార్జింగ్ సున్నాకు చేరకుండా చూసుకోవటమే ఉత్తమం. ఎందుకంటే సున్నా నుంచి ఛార్జ్ కావటానికి ఎక్కువ శక్తి అవసరమవుతుంది. నికెల్‌కాడ్మియం ఆధారిత పాత బ్యాటరీ టెక్నాలజీలు సున్నాకు చేరకపోతే తమ పూర్తి సామర్థ్యాన్ని గుర్తించేవి కావు. అందుకే అప్పట్లో పూర్తిగా బ్యాటరీ నిండుకున్నాకే ఛార్జ్ చేస్తుండేవారు. ఇప్పుడలా కాదు. లిథియం అయాన్ బ్యాటరీలకు అలాంటి సమస్యేమీ లేదు. ఛార్జింగ్ 20 శాతం కన్నా దిగువకు పడిపోకుండా చూసుకోవటం మంచిదన్నది నిపుణుల సూచన. బ్యాటరీ ఛార్జింగ్ 20 కన్నా తగ్గితే బ్యాటరీ సేవింగ్ మోడ్‌లోకి మార్చుకోవాలని కొన్ని ఫోన్లు సూచిస్తుండటం గమనించే ఉంటారు. చాలా ఏళ్ల పాటు అతిగా వాడినప్పటికీ అధునాతన ఫోన్లు కనీసం 80% బ్యాటరీ సామర్థ్యాన్ని నిలిపి ఉంచుకుంటాయి కూడా. మనం చాలావరకూ ఫోన్ కొన్నప్పుడు దాని వెంట వచ్చే ఛార్జర్‌నే వాడతాం. ఎందుకంటే థర్డ్ పార్టీ లేదా అనధికార ఛార్జర్లు వాడితే బ్యాటరీ దెబ్బతినే అవకాశముందని ఫోన్‌ను తయారుచేసిన కంపెనీలు చెబుతుంటాయి. అందుకే థర్డ్ పార్టీ ఛార్జర్లు వాడితే బ్యాటరీ క్షీణిస్తుందనే నమ్మకం ప్రబలిపోయింది. కొన్ని స్మార్ట్‌ఫోన్లు సొంత ఛార్జింగ్ ప్రమాణాలతో వచ్చినప్పటికీ చాలా ఫోన్లు యూఎస్‌బీ పవర్ డెలివరీ పీపీఎస్ వంటి ప్రమాణాలనూ సపోర్టు చేస్తాయి. అంటే కంపెనీకి సంబంధించిన ఛార్జర్ అవసరం లేదన్నమాట. కాకపోతే నాణ్యమైన, విశ్వసనీయమైన బ్రాండ్ల ఛార్జర్లు మాత్రమే కొనాలి. నాసిరకం ఛార్జర్లతో బ్యాటరీతో పాటు ఫోన్ దెబ్బతినే ప్రమాదముంది.



# పిల్లలు ఒత్తిడికి లోనవుతున్నారా?

రోజూ బడికి వెళ్లే పిల్లలు హోంవర్క్, పరీక్షలు, ట్యూషన్లు అంటూ చదువులోనే పూర్తిగా నిమగ్నమై ఉంటున్నారు. సెలవు రోజుల్లో కూడా స్మార్ట్ ఫోన్ చూస్తూ అందులోనే ఆటలు ఆడుతూ సమయం గడిపేస్తూ ఉంటారు. దీనివల్ల తెలియకుండానే పిల్లల్లో ఒత్తిడి స్టార్ట్ అవుతుంది. అలా కాకుండా రోజూ సాయంత్రం పిల్లల చేత ఆటలు ఆడించాలి. ఆటల్లో భాగంగా పరుగెత్తడం, నవ్వడం, అరవడం వల్ల పిల్లల శరీరంలో ఎండార్ఫిన్లు రిలీజ్ అవుతాయి. ఇవి ఒత్తిడిని దూరంచేసి సంతోషాన్ని కలిగిస్తాయి. సైకిల్ తొక్కడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం లాంటి వాటిని పిల్లలకు అలవాటు చేయాలి. సొంత పనుల్లో మునిగిపోయి పట్టించుకోకపోతే పిల్లల్లో ఒంటరితనం అనే భావన మొదలవుతుంది. ఇది క్రమంగా ఒత్తిడికి దారితీస్తుంది. కాబట్టి పిల్లలతో తరచూ మాట్లాడుతూ ఉండాలి. వాళ్లతో స్నేహపూర్వకంగా మెలగాలి. స్కూల్ లో ఏం జరిగిందనే విషయాల గురించి అడిగి తెలుసుకోవాలి. వీలైనంత ఎక్కువ సమయాన్ని పిల్లలతో గడపాలి. పిల్లలకు రోజూ పోషకాహారం పెట్టాలి. అందులో పాలు, నెయ్యి, తాజా పండ్లు, గింజలు, ఆకుకూరలు, కూరగాయలు ఉండేలా చూడాలి. వీటివల్ల శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి ఒత్తిడి దరిచేరదు. అప్పుడప్పుడూ డార్క్ చాక్లెట్ తెచ్చి ఇస్తుంటే పిల్లల సంతోషానికి అవధులు ఉండవు. పిల్లలపై కోపాన్ని చూపించకూడదు. అలాగని అతిగా గారాబం చేయకూడదు. ప్రతి విషయాన్ని వాళ్లకు అర్థమయ్యే రీతిలో ఓపికగా వివరించి చెప్పాలి. సందర్భానుసారం చక్కగా ప్రవర్తించినప్పుడు పిల్లలను మనస్ఫూర్తిగా ప్రశంసించాలి. దీనివల్ల వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చిన్నపాటి పొగడ్తల వల్ల మెదడులో డోపమైన్ స్థాయి పెరుగుతుంది. దీంతో పిల్లల మనసు ప్రశాంతంగా మారుతుంది. ఆటలు, సంగీతం, పాటలు పాడడం, నృత్యం చేయడం, చిన్న కథలు రాయడం లేదా చెప్పడం, బొమ్మలు వేయడం ఇలా ఆసక్తి ఉన్న అంశాన్ని నేర్చుకునేలా పిల్లలను ప్రోత్సహించాలి. దీనివల్ల పిల్లలకు మానసిక ఆనందం కలుగుతుంది. దీనివల్ల వారికి ఒత్తిడి అనిపించదు. పైగా వాళ్లల్లో ఉండే స్మార్ట్ వర్క్ తో పాటు వారి టాలెంట్ ను కూడా తెలుకోవాల్సిన బాధ్యత మీపై ఉంది.

## వాకింగ్ వల్ల ఎన్ని లాభాలో

# తెలుసా?

వాకింగ్ అనేది చాలా నార్మల్ అండ్ సేఫ్ వ్యాయామం. ప్రతిరోజూ నడవడం చాలా మంచిది. ఇది శరీరానికి చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది సులభమైన, తక్కువ ప్రభావం చూపే వ్యాయామం. రక్త ప్రసరణ నుండి గుండె ఆరోగ్యం వరకు ఎంతగానో హెల్ప్ చేస్తుంది. ప్రతిరోజూ నడవడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని యోగా నిపుణులు చెబుతున్నారు. అయితే, వాకింగ్ వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం. వాకింగ్ చేయడం వల్ల కేలరీలు బర్న్ అవుతాయి. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. గుండె జబ్బులు, స్ట్రోక్ వంటి వాటి ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎందుకంటే ఇది రక్తపోటును కంట్రోల్ చేయడంలో హెల్ప్ చేస్తుంది. అంతేకాకుండా ఒత్తిడిని తగ్గించడం, డిప్రెషన్‌ను తగ్గించడం, మానసిక స్థితిని మెరుగుపరచడంలో వాకింగ్ ఎంతగానో సహాయపడుతుంది. వాకింగ్ శారీరక దృఢత్వాన్ని మెరుగుపరుస్తుంది. కండరాలను బలోపేతం చేస్తుంది. ఎముకల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ప్రతిరోజూ వాకింగ్ చేయడం వల్ల మరింత ఫిట్‌గా కూడా ఉంటారు. అయితే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పార్కులో వాకింగ్ కు వెళ్లడం మంచిది. వాకింగ్ చేసేటప్పుడు హైడ్రేటెడ్‌గా ఉండటం చాలా ముఖ్యం. సౌకర్యవంతమైన బూట్లు ధరించండి. లేదంటే వాకింగ్‌కు వెళ్లినప్పుడు పాదాలకు గాయాలు అయ్యే అవకాశం ఉంది. నడకతో పాటు, ఇతర వ్యాయామాలను కూడా చేయండి. వీటితో పాటు డైలీ హెల్తీ డైట్ ను మెయింటైన్ చేయడం వల్ల కూడా శరీరం ఫిట్ గా ఉంటుంది.





# క్యాన్సర్ ను కనిపెట్టండిలా

మనం శ్రద్ధ పెట్టి వింటే శరీరం మనతో మాట్లాడుతుంది. డబ్బులు సంపాదించాలి.. జీవితంలో ఉన్నతంగా ఎదగాలి అనే తపనతో శరీరంపై అలసత్వం చూపించకండి. జబ్బులను ముందే గుర్తిస్తే ప్రాణాలు కాపాడుకోవచ్చు. క్యాన్సర్ విషయంలో ఇది మరింత ముఖ్యం. అలాంటి నిర్లక్ష్యం చేయకూడని కొన్ని క్యాన్సర్ లక్షణాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఆహార, వ్యాయామ నియమాలేవీ పాటించకుండా.. అకారణంగా బరువు తగ్గుతుంటే క్లోమ, జీర్ణాశయ, పెద్దపేగు, అన్నవాహిక క్యాన్సర్ కారణం కావొచ్చు. అలసట వేధిస్తుంటే.. విశ్రాంతి తీసుకున్న తర్వాతా నిస్సత్తువ వీడకపోతే రక్త, ఎముకమజ్జ క్యాన్సర్లని అనుమానించాల్సిందే. ఇలాంటి క్యాన్సర్లు ఒంట్లో శక్తిని త్వరగా హరించేస్తుంటాయి. కారణమేదీ తెలియకుండా తరచూ జ్వరం వస్తున్నట్టయితే బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, రోగనిరోధక వ్యవస్థను బలహీనం చేసే ఇతర త్రా క్యాన్సర్లకు సింబాలిక్ కావొచ్చు. మూడు నెలలు దాటినా దగ్గు తగ్గకపోవటం, కళ్లెలో రక్తం పడటం, గొంతు బొంగురు పోవటం వంటివి ఊపిరితిత్తి, గొంతు లేదా తల, మెడ క్యాన్సర్లలో కనిపిస్తుంటాయి. కొద్దిపాటి పనికే ఆయాసం, ఛాతీ బిగపట్టినట్టు అనిపించటం ఊపిరితిత్తి క్యాన్సర్, ఊపిరితిత్తి ధమనుల్లో అడ్డంకి, ఇతర అవయవాల క్యాన్సర్ ఊపిరితిత్తి చేరుకోవటానికి హెచ్చరిక అయ్యిండొచ్చు. హఠాత్తుగా చూపు మసకబారటం, ఒకటికి రెండు కనిపించటం, కళ్ల ముందు మిరుమిట్లు గొలపటం వంటివి మెదడు, కళ్ల క్యాన్సర్ల లక్షణాలు కావొచ్చు. వీటికి మధుమేహమూ యాడ్ అవుతుంది. షుగర్ క్లోమ క్యాన్సర్ ఎక్కువ అవుతుంది. దీర్ఘకాలంగా అజీర్ణం, ఛాతీలో మంట, ముద్ద సరిగా కిందికి దిగకపోవటం, కడుపుబ్బరం వంటివి అన్నవాహిక, జీర్ణాశయం, క్లోమ క్యాన్సర్లలో ముదిరిపోతాయి. హఠాత్తుగా, అకారణంగా ఆకలి తగ్గటం కూడా హెచ్చరిక సంకేతమే. యూరిన్ లో రక్తం పడటం పెద్దపేగు, మూత్రపిండాలు, మూత్రాశయ క్యాన్సర్లలో కనిపిస్తుంది. హఠాత్తుగా, అతి తీవ్రంగా జీవితంలో ముందెన్నడూ ఎరుగని విధంగా తలనొప్పి వేధిస్తుంటే.. ముఖ్యంగా వికారం, వాంతి, తల తేలిపోవటం లేదా నాడీ సంబంధ లక్షణాలూ కనిపిస్తుంటే మెదడు కణితి కారణం కావొచ్చు. ఇతర చోట్ల నుంచి క్యాన్సర్ మెదడులోకి వ్యాపించినా ఇలాగే ఉండొచ్చు. ముఖం, చేతులు, కాళ్లు హఠాత్తుగా మొద్దుబారినట్టు అనిపించినా దీన్ని అనుమానించాలి. దీర్ఘకాల లేదా అకారణ నొప్పులనూ విస్మరించొద్దు. ముఖ్యంగా ఎముకలు, కీళ్లలో నొప్పి వస్తుంటే తాత్సారం చేయొద్దు. ఇతర భాగాల నుంచి ఎముకల వంటి అవయవాలకు విస్తరించే క్యాన్సర్లలో ఇలాంటి నొప్పులు కనిపిస్తుంటాయి. కొత్త పుట్టుమచ్చలు రావటం లేదా అప్పటికే ఉన్నవి రంగు, సైజు, ఆకారం మారటం.. పుండ్లు మానకపోవటం మెలనోమా వంటి చర్మక్యాన్సర్లకు సంకేతాలు కావొచ్చు. వ్యాధిని ముందే గుర్తించడం వల్ల మీతో పాటు మీ కుటుంబాన్ని సంరక్షించుకున్నవారు అవుతారు. కాబట్టి జాగ్రత్త వహించండి.



## క్రికెట్ కెరీర్ పై కోహ్లీ ఎమోషనల్ కామెంట్స్..

టీమిండియా టాప్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కెరీర్ లో ఎన్నో అరుదైన ఘనతలు అందుకున్నాడు. ఓల్డ్ రికార్డులకు చెక్ పెడుతూనే.. లెక్కనేనన్ని కొత్త రికార్డులు సృష్టించాడు. ప్రతి ఫార్మాట్‌లో టాప్ బ్యాటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. దాదాపుగా అన్ని ట్రోఫీలు అందుకున్నాడు. ఇలా కెరీర్‌ను తనకు అనుకూలంగా మార్చుకున్నాడు. టీ20లు, టెస్టులకు రిటైర్‌మెంట్ ఇచ్చేసిన విరాట్.. ఇక మీదట వన్డేల్లో మాత్రమే కనిపించనున్నాడు. తాజాగా టెస్ట్ రిటైర్‌మెంట్‌పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసిన స్టార్ బ్యాటర్.. తన కెరీర్ ఎలా టర్న్ తీసుకుందో కూడా బయటపెట్టాడు. టీమిండియా మాజీ కోచ్ రవిశాస్త్రి తన కెరీర్‌ను మార్చేశాడని అన్నాడు కోహ్లీ. రవిశాస్త్రితో పని చేయకపోయి ఉంటే టెస్ట్ క్రికెట్‌లో ఇదంతా సాధ్యమయ్యేది కాదు. మేం కలసి విజయాలు సాధించడానికి మాకు ఉన్న క్లారిటీ కారణమని చెప్పాలి. ఏ ప్లేయర్ కి అయినా కెరీర్‌లో ఎదిగే సమయంలో సపోర్ట్ చాలా అవసరం. అలాంటి సపోర్ట్ నాకు రవిశాస్త్రి అందించాడు. ప్రెస్ కాన్ఫరెన్స్‌ల్లో తాను ముందుండి విమర్శలు ఎదుర్కొనేవాడు. ఆయన లేకపోతే నా కెరీర్ ఇలా ఉండేది కాదు. నా క్రికెట్ ప్రయాణంలో ఎల్లప్పుడూ అండగా ఉంటూ కీ రోల్ ను పోషించినందుకు ఆయనకు ఎప్పుడూ రుణపడి ఉంటా. ఆయన మీద గౌరవం ఎప్పటికీ తగ్గదు అని చెబుతూ కోహ్లీ ఎమోషనల్ అయ్యాడు. టీమిండియాకు వచ్చిన కొత్తలో తనకు భయం, బెరుకు ఉండేవని.. అయితే యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్, జహీర్ ఖాన్ తనకు అండగా నిలిచారన్నాడు కోహ్లీ. డ్రెస్సింగ్ రూమ్ వాతావరణానికి అలవాటు పడేలా చేశారని.. ఎప్పుడూ సపోర్ట్‌గా ఉంటూ వచ్చారని తెలిపాడు. వాళ్ల మద్దతుతోనే జట్టులో తన స్థానాన్ని పదిలం చేసుకోగలిగానని పేర్కొన్నాడు విరాట్.

# రణరంగం..
## నేడే ఇంగ్లండ్ తో మూడో టెస్ట్









ఇంగ్లండ్ తో జరుగుతున్న ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో మూడో టెస్టుకు టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా రెడీ అయ్యారు. ఈ నెల 10 నుంచి లార్డ్స్ వేదికగా మూడో టెస్టు స్టార్ట్ కానుంది. ఈ మ్యాచ్‌లో బుమ్రా తిరిగి బరిలోకి దిగనున్నాడు. వర్క్‌లోడ్ కారణంగా బుమ్రా బర్మింగ్‌హామ్ టెస్టు మ్యాచ్‌కు దూరమయ్యాడు. మ్యాచ్ తరువాత బుమ్రా మూడో టెస్టుకు అందుబాటులో ఉంటాడని రెండో టెస్ట్ తర్వాత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ క్లియర్ చేశాడు. ఈ మ్యాచ్ కోసం బుమ్రా నెట్స్‌లో బాగానే కష్టపడ్డాడు. సుమారు 45 నిమిషాల పాటు బౌలింగ్ చేశాడు. అలాగే లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్, త్రోడౌన్ స్పెషలిస్ట్‌తో బ్యాటింగ్ సైతం ప్రాక్టీస్ చేశాడు. సిరీస్ మొదలయ్యే ముందు ఇంగ్లండ్ టూర్‌లో బుమ్రా కేవలం మూడు టెస్టులకు మాత్రమే ఆడుతానని చెప్పిన విషయం తెలిసిందే. లీడ్స్ టెస్ట్‌లో బుమ్రా ఆడగా.. రెండో టెస్టుకు రెస్ట్ తీసుకున్నాడు. ప్రస్తుతం ఈ సిరీస్‌లో 11తో రెండు టీమ్స్ ఈక్వల్ గా ఉన్నాయి. ఇక టీమిండియా థర్డ్ టెస్ట్‌కు భారీగానే కసరత్తు చేసింది. ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొంది. బుమ్రా ఎంతో ఉత్సాహంగా కనిపించగా.. కో ప్లేయర్స్ తో చర్చలు కూడా జరిపాడు. ఇదిలా ఉండగా లార్డ్స్ టెస్ట్‌లో బుమ్రాను ప్రసిద్ కృష్ణ స్థానంలో జట్టులోకి రానున్నాడు. మరో వైపు అర్షదీప్ సింగ్ సైతం బాగానే ప్రాక్టీస్ చేశాడు. ఇక లార్డ్స్ పిచ్ బర్మింగ్‌హామ్ కంటే మరింత సవాల్‌గా నిలుస్తుందని క్రికెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ఇద్దరు స్పిన్నర్లు, ముగ్గురు పేసర్లు, నాలుగో ఫాస్ట్ బౌలర్‌గా నితీష్‌కుమార్‌రెడ్డితో బరిలోకి దిగుతుందా? అనే ఇంట్రెస్టింగ్ గా మారింది. మూడో టెస్టుకు ముందు కెప్టెన్ గిల్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, ఆకాశ్ దీప్, మహ్మద్ సిరాజ్ ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గోలేదు. సిరాజ్ ఫస్ట్ రెండు మ్యాచ్‌లలో ఆడగా.. భారత బౌలర్లలో ఎక్కువ ఓవర్లు వేసింది అతనే కావడం విశేషం. బౌలింగ్ కోచ్ పరవూరు ఆనందన్ మాట్లాడుతూ బుమ్రాతోపాటు సిరాజ్ వర్క్‌లోడ్‌ను సైతం మేనేజ్ చేయాల్సి ఉందన్నారు.



## హెచ్‌సీఏ ప్రెసిడెంట్ అరెస్ట్..

సన్ రైజర్స్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హెసీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావు అరెస్ట్ అయ్యారు. జగన్మోహన్ రావుతోపాటు హెచ్‌సీఏ సభ్యులను సీఐడీ అరెస్ట్ చేసిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఐపీఎల్ టికెట్ల వ్యవహారంలో విజిలెన్స్ సిఫార్సు మేరకు సీఐడీ ఈ చర్యలకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఐతే గత ఐపీఎల్ సీజన్‌లో హెచ్‌సీఏఎస్ఆర్‌హెచ్ మధ్య టికెట్ల వివాదం జరిగిన సంగతి తెలిసిందే. హెచ్‌సీఏ ప్రెసిడెంట్ హోదాలో ఎస్ఆర్‌హెచ్ ఫ్రాంచైజీని జగన్‌మోహన్‌రావు బెదిరించారన్నది ఇందులో ముఖ్య ఆరోపణ. అయితే ఆ అభియోగాలన్నీ నిజాలేనని విజిలెన్స్ కన్ఫర్మ్ చేయడంతో సీఐడీ ఇప్పుడు అరెస్టులు చేసింది. హెచ్‌సీఏకు ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం 10 శాతం టికెట్లు ఉచితంగా ఇస్తోంది. అయితే మరో 20 శాతం టికెట్లు ఫ్రీగా ఇవ్వాలని, లేకుంటే మ్యాచ్‌లు జరగబోనివ్వమని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యాన్ని జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. అయితే హెచ్‌సీఏ ద్వారా రిక్వెస్ట్ పెట్టుకుంటే ఆలోచన చేస్తామని ఆ సమయంలో హెచ్ఆర్ఎస్ ఆయనకు స్పష్టం చేసింది. ఈ క్రమంలో తనకు వ్యక్తిగతంగా 10 శాతం వీఐపీ టికెట్లు కచ్చితంగా ఇవ్వాలని, లేకుంటే మ్యాచ్‌లు జరగనివ్వబోమని ఆయన బెదిరింపులకు దిగారు. అందుకు ఎస్ఆర్‌హెచ్ అంగీకరించలేదు. దీంతోలక్నో మ్యాచ్ సందర్భంగా వీఐపీ కార్పొరేట్ బాక్స్‌కు ఆయన తాళాలు కూడా వేయించారు. ఈ పరిణామంతో షాక్ తిన్న ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం.. హైదరాబాద్ నుంచి వెళ్లిపోతామంటూ ప్రకటించడం చర్చకు దారి తీసింది. ఐపీఎల్ టికెట్ల వివాదం నేపథ్యంతో ఈ ఘటనపై విజిలెన్స్ ఎంక్వయిరీకి తెలంగాణ ప్రభుత్వం ఆదేశించింది. ఈ వ్యవహారంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా హెచ్‌సీఏ అక్రమాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపిన సీఐడీ.. ఇప్పుడు అరెస్టులు చేసింది.

# క్రికెట్ తారలు ఒక్కటైన వేళ



లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ తో మూడో టెస్టు మ్యాచ్ ఆడేందుకు టీమ్ ఇండియా రెడీ అయింది. ఇప్పటికే అక్కడికి చేరుకున్న ఇండియా ప్లేయర్స్ ప్రాక్టీస్ కూడా మొదలెట్టేశారు. ఈ క్రమంలో క్రికెట్ సెలబ్రిటీస్ కలిసి ఓ ఫొటోషూట్ లో పాల్గొన్నారు. ఆ ఫొటో బీసీసీఐ తన సోషల్ మీడియాలో షేర్ చేసింది. భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ యూ వుయ్కెన్ ఛారిటీ కోసం వీళ్లంతా ఒక్క చోటుకు చేరారు. ఇందులో సచిన్, కెవిన్ పీటర్సన్, అజిత్ అగార్కర్, బ్రియాన్ లారా లాంటి సెలెబ్రిటీలు హాజరయ్యారు. యువరాజ్ ఛారిటీ నిధుల కోసం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో విరాట్ కోహ్లీ, రవిశాస్త్రి, డారెన్ గాఫ్, క్రిస్ గేల్ పాల్గొన్నారు. టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ అయ్యాక తొలిసారి క్రికెట్ స్టార్లతో కలిసి విరాట్ పాల్గొనడం ఇదే ఫస్ట్ టైమ్. ఈసందర్భంగా కోహ్లీ తన టెస్టు కెరీర్ను ముగించాల్సిన సమయం వచ్చిందని చెప్పేందుకు గడ్డం రంగును ఎగ్జంపుల్ చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. నేను రెండు రోజుల కిందట నా గడ్డానికి రంగు వేసుకున్నా.. ప్రతి నాలుగు రోజులకొకసారి మన గడ్డం రంగు మార్చుకోవాలా? వద్దా? అనేది తెలుస్తుంది అని తన కెరీర్ గురించి ఓ క్లారిటీ ఉందని కోహ్లీ కామెంట్ చేశారు. ప్రజంట్ సోషల్ మీడియాలో కోహ్లీ చేసిన ఈ కామెంట్స్ వైరల్ అవుతున్నాయి.

## గిల్‌కు గంగూలీ స్ట్రాంగ్ వార్నింగ్?

టీమిండియా నయా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరో ఛాలెంజ్ కు రెడీ అవుతున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ రిజల్ట్ నే లార్డ్స్‌లోనూ రిపీట్ చేయాలని చూస్తున్నాడు. ఈ టైం లో గిల్ నాయకత్వం గురించి మోస్ట్ పాపులర్ ప్లేయర్ సౌరవ్ గంగూలీ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. గిల్ హనీమూన్ పీరియడ్ ముగిసిందన్నాడు. సారథిగా గిల్ తన ప్రయాణాన్ని అద్భుతంగా మొదలు పెట్టాడు. అయితే ఇక మీదట ఇలాగే ఉండదు. అతడికి కెప్టెన్సీ బాధ్యతలు కొత్త. ఆ పరంగా ఇది శుభ్‌మన్‌కు హనీమూన్ పీరియడ్. కానీ రాబోయే సిరీస్‌ల్లో అతడు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోక తప్పదు. ఇంగ్లండ్‌తో నెక్స్ట్ జరిగే 3 టెస్టుల్లో గిల్‌పై కచ్చితంగా ప్రెజర్ పడుతుంది అని దాదా చెప్పుకొచ్చాడు. హనీమూన్ పీరియడ్ ముగిసిందనే విషయాన్ని అతడు గ్రహించాలని.. రానారానూ అతడిపై తీవ్ర ఒత్తిడి పడటం ఖాయమన్నాడు గంగూలీ. సవాళ్లకు సిద్ధంగా ఉండాలని.. లైట్ తీసుకుంటానంటే కుదరదన్నాడు. భారత్‌లో అపార ప్రతిభావంతులైన క్రికెటర్లు ఎంతో మంది ఉన్నారని గంగూలీ అన్నాడు. ప్రతి తరంలో అద్భుతమైన ఆటగాళ్లు వస్తున్నారని చెప్పాడు. సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్, సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే లాంటి ప్లేయర్స్ తర్వాత విరాట్ కోహ్లీ లాంటి ప్లేయర్స్ వచ్చారు. ఇప్పుడు శుభ్‌మన్ గిల్, ఆకాశ్‌దీప్, యశస్వి జైస్వాల్, ముఖేష్ కుమార్, మహ్మద్ సిరాజ్ లాంటి వాళ్లు అదరగొడుతున్నారు అని మెచ్చుకున్నాడు.





# దర్శకుడితో సమంత వెకేషన్.. ఫోటోలు వైరల్

సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత, బాలీవుడ్ డైరెక్టర్ రాజ్ నిడిమోరు గత కొంతకాలంగా డేటింగ్ లో ఉన్నారంటూ వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. సామ్ కూడా తన బిహేవియర్ తో ఈ వార్తలు నిజమేనంటూ హింట్స్ ఇచ్చేలా చేస్తున్నాయి. ఇక రీసెంట్ గా సమంత, రాజ్ తో కలిసి ఓ వెకేషన్ కి వెళ్లి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో సామ్ షేర్ చేశారు. దీంతో ఇవి కాస్త వైరల్ మారాయి. రాజ్ వైఫ్ శ్యామాలి లేటెస్ట్ గా తన ఇన్ స్టాగ్రామ్ స్టోరీస్ లో ఇంట్రెస్టింగ్ మెసేజ్ ను షేర్ చేశారు. ఈ పోస్ట్ లో ఏముందంటే.. మతమేదైనా మన చర్యలతో ఇతరులను బాధించవద్దు అనే చెబుతుందని.. అదే మనం జీవితంలో పాటించాల్సిన గొప్ప నియమమని అందులోని సారాంశం. సామ్, రాజ్ ఫొటోలు వైరల్ గా మారిన టైమ్ లో శ్యామాలి పెట్టిన ఈ పోస్ట్ చర్చకు దారితీసింది. ఆ ఫొటోల కారణంగా ఆమె బాధపడి ఉండొచ్చని.. అందుకే ఆమె ఈవిధమైన సందేశాన్ని పంచుకుని ఉంటారని కొంతమంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అయితే శ్యామాలి చాలా ఫ్రీక్వెన్ట్ గా ఇలాంటి మెసేజ్ ఓరియెంటెడ్ పోస్ట్‌లు షేర్ చేస్తుంటారు. రాజ్, సమంతలపై వార్తలు వస్తున్నప్పటినుంచి ఆమె పోస్ట్‌లపై నెటిజన్ లు ఇంట్రెస్ట్ చూపుతున్నారు. కొన్నిరోజుల క్రితం నమ్మకం, కర్మ సిద్ధాంతం గురించి పోస్టులు పెట్టారు. నమ్మకాన్ని ఒక్కసారి కోల్పోతే ఎంత ఖర్చు పెట్టినా తిరిగి పొందలేమని కొన్నిరోజుల క్రితం ఆమె రాసుకొచ్చారు. కాలం అన్నింటినీ బయటపెడుతుంది.. కర్మ సమాధానం చెబుతుంది అని కొన్నిరోజుల క్రితం ఒక పోస్ట్ ను షేర్ చేశారు. శ్యామాలి చివరిసారి 2023లో రాజ్‌తో కలిసున్న ఫొటోను షేర్ చేశారు. వీరిద్దరూ విడిపోతున్నారంటూ కొన్ని రోజుల క్రితం వార్తలు కూడా వచ్చాయి. ఆయా స్టోరీస్ ను బేస్ చేసుకుని రాజ్, శ్యామాలి ఎక్కడా రెస్పాన్స్ కాలేదు. రాజ్ అండ్ డీకే కలిసి తెరకెక్కించిన ది ఫ్యామిలీమ్యాన్ సీజన్ 2, సిటడెల్: హనీ బన్నీలో సమంత నటించారు. ఆయా ప్రాజెక్ట్‌ల కోసం వర్క్ చేస్తున్న సమయంలోనే రాజ్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. రీసెంట్ గా సమంత నిర్మించిన శుభం సినిమాకి రాజ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్నారు. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ.. అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. వెకేషన్‌లో భాగంగా సమంత ఎక్కడికి వెళ్లినా.. రాజ్ కూడా వెంట ఉండటం ఆ స్టోరీస్ కు మరింత ఆజ్యం పోశాయి. ఈ క్రమంలోనే అమెరికా వెకేషన్‌కు వెళ్లిన సామ్.. తన ఫ్రెండ్స్‌తో కలిసి ఉన్న ఫొటోలను పంచుకున్నారు. ఇందులో ఆమెతో పాటు రాజ్ నిడిమోరు కూడా ఉన్నారు. అమెరికా వీధుల్లో వీరిద్దరూ కలిసి నడుస్తూ.. రెస్టారెంట్ లోనూ ఫుడ్ తింటూ కనిపించారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. వీరిద్దరూ క్లోజ్‌గా ఉండడం చూసి కొందరు అభిమానులు కంగ్రాట్స్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. ఏది ఏమైనా సామ్ వైరల్ ఫోటోలు మాత్రం తీవ్ర దుమారం రేపుతున్నాయి.



# వార్ 2 విషయంలో కియారా ఎగ్జైట్మెంట్

ప్రజంట్ బాలీవుడ్ సినిమా నుంచి రాబోతున్న అవైటెడ్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ అలాగే మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ ల కాంబోలో దర్శకుడు అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన భారీ సినిమా వార్ 2 అనే చెప్పవచ్చు. మరి ఈ సినిమాలో హృతిక్ రోషన్ సరసన హ్యాపెనింగ్ బ్యూటీ కియారా అద్వానీ నటించిన సంగతి తెలిసిందే. ఇక లేటెస్ట్ గానే సినిమా షూటింగ్ కంప్లీట్ కావడంతో హృతిక్ రోషన్ చేసిన పోస్ట్ ఒకటి వైరల్ గా కూడా మారింది. ఇక లేటెస్ట్ గా దీనికి హీరోయిన్ కియారా అద్వానీ కూడా యాడ్ అయ్యింది. తనకి కూడా అంతే ఎగ్జైట్మెంట్ ఉందని హృతిక్ రోషన్ తో పని చేయడం అనేది ఒక మర్చిపోలేని అనుభూతి, అయాన్ పనితనం వరల్డ్ ఎప్పుడు చూస్తుందా అని వెయిట్ చేస్తున్నాను, అయాన్ ఇంకా ఎన్టీఆర్ అలాగే తమ టీం అంతా వార్ 2 కి ప్రాణం పోశారు అంటూ ఆలియా తెలిపింది. దీనితో ఈ పోస్ట్ ఇపుడు వైరల్ గా మారింది. ఇక కియారా ప్రజంట్ భారీ లైనప్ లో వర్క్ చేస్తున్నారు. ముఖ్యంగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయితే ఇక బాలీవుడ్ లో కియారాకు ఎలాంటి తిరుగు ఉండదు.

## లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో

# కూలీ?

సినీ ఇండస్ట్రీలో ఎవరైనా ఇద్దరు యాక్టర్స్ ఒకే స్క్రీన్ పై కనిపించారంటే భారీ అంచనాలు క్రియేట్ అవుతాయో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. లేటెస్ట్ గా సూపర్ స్టార్ రజనీకాంత్, యాక్షన్ కింగ్ అర్జున్ కలిసి నటించేందుకు ఆస్కారం ఉందనే విషయం వినిపిస్తుంది. రజనీకాంత్ నటిస్తున్న కూలీ సినిమా లోకేష్ కనగరాజ్ యూనివర్స్ లో భాగం కాబోతోందనే ఊహాగానాలు ఇప్పుడు స్టార్ట్ అయ్యారు. దీనికి కారణం లేటెస్ట్ గా కొరియోగ్రాఫర్ శాండీ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్. లోకేష్ కనగరాజ్, అర్జున్ సర్జాల తో కలిసి శాండీ మాస్టర్ సోషల్ మీడియాలో షేర్ చేసిన కొత్త పోస్ట్ లో రజనీకాంత్ కూలీ ఎల్.సి.యులో భాగం అనే కొత్త ఊహా సిద్ధాంతానికి దారి తీసింది. తన పుట్టినరోజు సందర్భంగా శాండీ ఈ పోస్ట్ ని షేర్ చేయగా దీనిపై లోకేష్ కనగరాజ్ అభిమానులు మండిపడుతున్నారు. శాండీ తన పోస్ట్ లో కామెంట్ చేస్తూ.. అర్జున్ సర్జా, ఉమాపతి రామయ్య తన బర్త్ డే పార్టీకి హాజరైనందుకు థ్యాంక్స్ చెప్పారు. ఈ కాంబినేషన్ తో కూలీ సినిమా లోకేష్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగం అనే టాపిక్ కు దారి తీసింది. నెటిజన్లు చాలా ఉత్సాహంగా ఈ డిబేట్ లో పార్టిసిపేట్ చేస్తున్నారు. అభిమానులు కూలీలో లియో హెరాల్డ్ దాస్? నటిస్తారు అని డౌట్ ను వ్యక్తం చేస్తున్నారు. దళపతి విజయ్ నటించిన లియోలో హెరాల్డ్ దాస్‌గా నటించిన అర్జున్ సర్జా కూలీలోను నటిస్తే బావుంటుందని అభిమానులు సూచించారు. శాండీ బర్త్ డే పార్టీలో అర్జున్ కనిపించగానే ఈ ఊహాగానాలకు రెక్కలొచ్చాయి. జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకాలు.. ఈ ప్రత్యేకమైన రోజు అర్జున్ సర్ ఆశీర్వాదాలు.. మీ ప్రేరణ ప్రతిరోజూ మెరుగ్గా కృషి చేయడానికి నాకు సహాయపడతాయి.. సినిమా పట్ల మీ అంకితభావం ఆశావహ కళాకారులకు నిజమైన ప్రేరణ.. అని రాసారు. అయితే లోకేష్ కనగరాజ్ ఈ వార్తలపై ఎగ్జయిట్ అవుతూ.. నాపై మీకున్న ప్రేమ మంచి విషయాలకు దారి తీస్తుందని అన్నారు. అయితే కూలీ అనేది ఒక ఇండిపెండెంట్ స్టోరీ అని లోకేష్ కనగరాజ్ ప్రతిసారీ చెబుతూనే ఉన్నారు. ఎల్.సి.యులో కూలీ భాగమా కాదా? అన్నది లోకేష్ స్వయంగా అనౌన్స్ చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అదే నిజంగా జరిగితే అది మరిన్ని సంచలనాలకు దారి తీయొచ్చు. కూలీ సినిమాని కళానిధి మారన్ సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. ఈ సినిమాలో రజనీకాంత్ తో పాటు నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతి హాసన్, రెబా మోనికా జాన్ యాక్ట్ చేశారు. ఈ సినిమాకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందించారు. ఈ సినిమా 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇక ఈ మూవీలో రజనీకాంత్ లుక్స్ అండ్ యాక్షన్ పార్ట్ అదిరిపోతుందని టాక్ వినిపిస్తుంది. ఈ సినిమాకి సంబంధించిన పోస్టర్లు కూడా తెగ వైరల్ అవుతున్నాయి.





## హరిహర వీరమల్లు

# రన్ టైం లాక్

టాలీవుడ్ పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించిన అవైటెడ్ హిస్టారికల్ సినిమానే హరిహర వీరమల్లు. ఎన్నో ఏళ్ళు నిరీక్షణ తర్వాత ఎట్టకేలకి ఈ జూలైలో సినిమా విడుదల కాబోతుంది. మరి ఈ గ్యాప్ లో ప్రమోషన్స్ ఇతర పాటలు కూడా రావాల్సి ఉండగా సినిమా రన్ టైం పై కూడా పలు వార్తలు బయటకి వచ్చాయి. అయితే మొదట హరిహర వీరమల్లుని మేకర్స్ 2 గంటల 40 నిమిషాలకి కట్ చేసినట్టుగా వినిపించింది. కానీ లేటెస్ట్ సమాచారం ఏంటంటే మొత్తంగా 2 గంటల 42 నిమిషాల నిడివి గల సినిమా థియేటర్స్ లో పడనుందట. ఇక సెన్సార్ కి కూడా సినిమా పంపాల్సి ఉండగా అక్కడ మరింత క్లారిటీ సినిమాపై రానుంది. ఇక ఈ భారీ సినిమాకి ఎం ఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. అలాగే మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మాణం వహించిన ఈ సినిమా ఈ జూలై 24న పాన్ ఇండియా భాషల్లో విడుదల కాబోతుంది. ఇక ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ లుక్స్ అండ్ యాక్షన్ సీక్వెన్సులు భారీగా ప్లాన్ చేశారు. క్యారెక్టర్ ఎలివేషన్ విషయంలో కూడా డైరెక్టర్ చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ ను ఎలా అయితే చూడాలనుకుంటున్నారో అలానే చూపిస్తారట. అంతేకాకుండా ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కావడంతో మరింత అంచనాలు క్రియేట్ అయ్యాయి. మరి ఈ సినిమా పవన్ కళ్యాణ్ సినీ కెరీర్ లో ఎలాంటి సక్సెస్ ను తెచ్చిపెడుతుందో చూడాలి. దీంతో పాటు నెక్స్ట్ పవన్ కళ్యాణ్ లైనప్ కూడా భారీగానే ఉంది.



# అల్లు, అట్లీ కాంబోలో హాలీవుడ్ స్టార్ విలన్?

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ పాన్ ఇండియా పుష్ప సిరీస్ హిట్ తర్వాత నెక్స్ట్ టార్గెట్ ను హాలీవుడ్ రేంజ్ లో ప్లాన్ చేశారు. ఈ క్రమంలో కోలీవుడ్ కమ్ బాలీవుడ్ డైరెక్టర్ అట్లీతో సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. అయితే అల్లు, అట్లీ కాంబో నెవ్వర్ బిఫోర్ అనేలా ఉంటుందని ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. ఇద్దరు కూడా అంతకుమించి అనేలా ఆలోచిస్తున్నారట. ఏకంగా హాలీవుడ్ ను టార్గెట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కాంబో ఫిక్స్ అయినప్పటి నుంచే సినిమా రేంజ్ భారీగా పెరిగింది. ఫుల్ మాస్, స్టైలిష్ ట్రీట్ కావొచ్చని ఫ్యాన్స్ లో అంచనాలు పెరిగిపోయాయి. ఇప్పుడు ఆ కాంబో మీద ఇంకొక భారీ వార్త వైరల్ అవుతోంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం, ఈ సినిమాకు విలన్‌గా హాలీవుడ్ స్టార్ విల్ స్మిత్ తో డిస్కస్ చేశారట. ఐ యామ్ లెజెండ్, మెన్ ఇన్ బ్లాక్, కింగ్ రిచర్డ్ వంటి వరల్డ్ ఫేమస్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న విల్ స్మిత్.. ఈ భారీ బడ్జెట్ తెలుగు సినిమాలో అల్లు అర్జున్ కు శత్రువుగా కనిపించనున్నారట. ఈ ప్రాజెక్ట్‌కు స్కై ఫై నేపథ్యం ఉండనుందని టాక్. 800 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమా ఇండియన్ సినిమా స్టాండర్డ్‌ను మరో లెవెల్‌కు తీసుకెళ్లేలా ఉండనుందని అంటున్నారు. విల్ స్మిత్ కన్ఫామ్ కాకపోతే.. డ్వేన్ జాన్సన్ అనే మరో స్టార్ పేరును కూడా అట్లీ టీమ్ చెక్ చేస్తుందని తెలుస్తుంది. మరి ఇద్దరిలో ఎవరు ఫిక్స్ అవుతారో చూడాలి. ఇక హీరోయిన్ విషయంలో అయితే ఈ సినిమా మరింత హై లెవెల్ గా మారనుంది. ఇప్పటికే దీపికా పదుకోన్ హీరోయిన్‌గా ఫిక్స్ అయ్యారు. ఆమెతో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా ఈ సినిమాలో కీ రోల్స్ ప్లే చేస్తున్నారు. అంటే స్క్రీన్ మీద గ్లామర్‌తో పాటు పెర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రలు ఉంటాయన్నమాట. ఈ మాస్ కాంబినేషన్‌కు సన్ పిక్చర్స్ భారీ స్థాయిలో నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. టెక్నికల్ టీమ్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ బ్లాక్ లెవెల్ అంతా ఇంటర్నేషనల్ స్టాండర్డ్‌లో ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. త్వరలో ఈ సినిమాకు సంబంధించి అఫిషియల్ అనౌన్స్ మెంట్ రావొచ్చని ఫిలింనగర్ టాక్. ఇక విల్ స్మిత్ తెలుగు తెరపై కనిపిస్తే అది ఇండియన్ సినిమాకు కూడా ఒక బిగ్ అచివ్‌మెంట్ గా నిలవనుంది. మరి ఇది ఎంతవరకు నిజమవుతుందో చూడాలి.